శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥ 180/-
పేజీలు: 180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




మెట్రో విస్తరణకు అనుమతులు, నిధుల విడుదలపై
జాప్యం చేయవద్దు
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ
10


సంపుటి 09, సంచిక: 197 | బుధవారం | 17-06-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


విత్తన సరఫరా నుంచి పంట కొనుగోళ్ల దాకా

# సమగ్ర ప్రణాళిక.. నిర్దిష్ట కార్యాచరణ

- అన్ని విషయాల్లోనూ వ్యవసాయశాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి
- కనీస మద్దతు ధరలు, కేంద్ర కోటాను అనుసరించి కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టాలి
- బోనస్ ఇచ్చే ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలి
- సన్న వడ్లు పండించే రైతుల డేటాను సేకరించాలి
- రైతు వేదికలను రైతులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి
- సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- యూరియా, ఇతర ఎరువుల కేటాయింపుపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మలకు సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతులు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని సిఎం స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు, వ్యవసాయ సీజన్, తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలపై సమావేశంలో తరువాయి 8లో



నరహరి నివాసాలపై

# ఎసిబి దాడులు

- రూ.13 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు
- రూ.1.54 కోట్ల నగదు, కిలోన్నర బంగారం, కోట్ల రూపాయల డిపాజిట్లు వెలుగులోకి
- అక్రమాస్తుల కేసులో సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్

అవినీతి ఆరోపణలతో తెలంగాణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుపై నమోదైన అక్రమాస్తుల కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు మంగళవారం నిర్వహించిన సోదాల్లో రూ.13 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించారు. భారీ మొత్తంలో నగదు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, వెండి, విలువైన స్థిరాస్తులు బయటపడటంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎసిబి విడుదల చేసిన వివరాల ప్రకారం మల్టీ జోన్2 పరిధిలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సుంకరి నరహరి రావు తన చట్టబద్ధ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన నివాసంతో పాటు తరువాయి 8లో

ఇరాన్‌కు ఎప్పటికీ

# అణ్వాయుధం ఉండదు




- జి-7 సదస్సులో ట్రంప్ ప్రకటన
- 80 డాలర్లకు క్షీణించిన చమురు ధర
- రేపో ఎల్లుండో ఒప్పంద పూర్తిపాఠం విడుదల

**ఎవియాన్‌-లెస్‌-బైన్స్:** ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందం (ఎంఓయు) ప్రకారం, ఇజ్రాయెల్ దగ్గర ఎప్పటికీ అణ్వాయుధం ఉండదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఎవియాన్‌-లెస్‌-బైన్స్‌లో జరుగుతున్న జి-7 సదస్సులో మంగళవారం ట్రంప్ మాట్లాడుతూ, అణ్వాయుధాన్ని తయారు చేయబోమని ఇరాన్ హామీ ఇచ్చిందని చెప్పారు. అదేవిధంగా ఈ సదస్సులో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిని తెరిపించడంలో బ్రిటన్ కీలకపాత్ర వహిస్తుందని ప్రకటించారు. అదేవిధంగా ఇరాన్ నుండి శుద్ధిచేసిన యురేనియంను శిథిలాలమధ్య నుండి తరలించేందుకు తామేమీ తొందర పడటం లేదని చెప్పారు. మీడియాతో మాట్లాడుతూ, ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వాయుధం ఉండదని, ఒప్పందంలో ఉన్న విషయం ఇదేనని, తాను కోరుకున్నదీ 99.9 శాతం ఇదేనని ట్రంప్ చెప్పారు. 60 రోజుల తర్వాత కూడా హోర్ముజ్ జలసంధిలో సుంకాలు లేకుండానే నౌకల రాకపోకలు జరుగుతాయని చెప్పారు. ఒక అధికారిని ఏర్పాటు చేసి ఒప్పంద పూర్తి పాఠం విడుదల చేస్తామన్నారు. ఒక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ఒప్పంద పత్రంలోని ప్రతి పదాన్ని ఒక అధికారితో తాను చదివించి మీకు తెలియజేస్తానని పాత్రికేయులకు చెప్పారు. కాగా ఈ సదస్సులో ట్రంప్ యుఎఇ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయెద్‌తో కూడా సంభాషణలు జరిపారు. మరోవైపు ఒప్పందం కుదిరిన ఉత్సాహంలో ప్రపంచమార్కెట్లు కొత్త జోష్‌లో ఓలలాడుతున్నాయి. మరోవైపు ముడిచమురు ధర వేగంగా క్షీణిస్తోంది. మంగళవారంనాడు తాజాగా బ్రెంట్ క్రూడాయిల్ ఒక బ్యారెల్ ధర 80 డాలర్లకు పడిపోయింది. దీంతో మెల్లిగా ఈ ధరలు యుద్ధం ముందునాటిస్థితి దిశగా ప్రయాణిస్తున్నాయి. యుద్ధానికి ముందు ఫిబ్రవరి తరువాయి 8లో

హెజ్బొల్లాపై ఇక

## సిరియా పోరాడాలి

మేం లేకపోతే టెల్‌అవీవ్ ఎప్పుడో ధ్వంసమయ్యేది : ట్రంప్

లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న పోరాట పద్ధతులను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తప్పుపట్టారు. తూర్పు ఫ్రాన్స్‌లో స్విట్జర్లాండ్ సరిహద్దుల్లో ఉన్న ఎవియాన్‌-లెస్‌-బైన్స్ రిసార్ట్ ప్రాంతంలో జరుగుతున్న జి-7 శిఖరాగ్ర సదస్సులో ట్రంప్ మంగళవారం మాట్లాడుతూ, లెబనాన్‌లో ఇకమీదట సిరియా పోరాటం చేయాలని సూచించారు. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌-షారా సమర్థవంతంగా ఈ పోరాటాన్ని నడిపించగలరని అన్నారు. హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ చాలాకాలంలో పోరాడుతోందన్నారు. "హెజ్బొల్లా వ్యవహారాన్ని సిరియాకు అప్పగించమని నేను ఇజ్రాయెల్‌కు సూచించాను, ఎందుకంటే నిజం చెప్పాలంటే హెజ్బొల్లాపై పోరాటాన్ని వారు మరింత సమర్థవంతంగా నడిపించగలరు" అన్నారు. "ఆయన (అల్‌-షారా) చాలా సమర్థుడు, నేను కోరినవాటినన్నింటినీ నెరవేర్చాడు,నాకు సానుకూలంగా వ్యవహరించాడు" అని ప్రశంసించారు. సామాన్యులను,ఇతరులను చంపకుండా ఇజ్రాయెల్ పని పూర్తిచేయలేకపోతే ఆ పని సిరియా పూర్తి చేస్తుందని అన్నారు. ఇరాన్ పెంచిపోషిస్తున్న తరువాయి 8లో

ఏ ఒక్క ప్రాజెక్టునూ

# అడ్డుకోలేదు



- నేను వద్దంటే ప్రాజెక్టులు ఆగవు
- మెట్రో రైల్ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డివి తప్పుడు ఆరోపణలు
- కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నానని అనడం అవాస్తవం
- ఢిల్లీలో మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాడుతూ మెట్రో ప్రాజెక్టును రేవంత్ రెడ్డి తనకు తానే ఆపుకుంటూ, ఆ నెపాన్ని కేంద్రంపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 'నేను వద్దంటే ప్రాజెక్టులు ఆగవు. ఒక తెలంగాణ బిడ్డగా రాష్ట్ర ప్రయోజనాల కోసమే పనిచేశాను తప్ప, ఏనాడూ ఒక్క ప్రాజెక్టును కూడా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు' అని కిషన్ రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఒక తెలంగాణ బిడ్డగా తాను ఉద్యమాల్లో పాల్గొన్నానని, ఆమరణ నిరాహార దీక్ష చేసి తరువాయి 8లో



హామీలు నెరవేర్చకుంటే

# తిరుగుబాటు తప్పదు

- ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాల్సిందే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్

ప్రజాపక్షం/హనుమకొండ /వరంగల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి తరువాయి 12లో

నిరూపిస్తే

# రాజీనామా చేస్తా

బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావుకు మంత్రి లక్ష్మణ్‌కుమార్ సవాల్

గురుకుల విద్యాసంస్థల కొనుగోళ్ల టెండర్లలో కుంభకోణం ఆరోపణలు నిరాధారమని వెల్లడి

టెండర్లపై సిఎం, మంత్రుల సమీక్ష తరువాతే నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్



గురుకుల విద్యాసంస్థల కొనుగోళ్లకు సంబంధించిన టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందంటూ బిఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. హరీష్ రావు చేసిన ఆరోపణలు ఆధారాలతో నిరూపిస్తే ప్రజల సమక్షంలోనే మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని అడ్లూరి సవాల్ విసిరారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో తరువాయి 12లో

తెలంగాణకు

# రాబడి లోటు

- మరో 15 రాష్ట్రాలకు కూడా
- 13 రాష్ట్రాలకు ఆదాయాల్లో మిగులు
- రాష్ట్రాల అప్పులు రూ.91.50 లక్షల కోట్లు
- ఐదేళ్ళలో గణనీయంగా పెరిగిన ద్రవ్యలోటు
- 2025 కాగ్ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్ సహా 13 రాష్ట్రాలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయాల మిగులు లక్ష్యాలను సాధించాయని, 15 రాష్ట్రాలు మాత్రం లక్ష్యాలు సాధించలేక ఆదాయ లోటు ఎదుర్కొన్నాయని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్)నివేదిక వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలలో ఉన్న ఆర్థిక స్థితిగతులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కె.సంజయ్ మూర్తి మంగళవారం న్యూఢిల్లీలో ఒక నివేదిక విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం, దేశంలో మిగులు ఆదాయాలు ఉండాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న 18 రాష్ట్రాలలో తొమ్మిది రాష్ట్రాలు తరువాయి 12లో

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యానికి

# కేంద్రం విశ్వ ప్రయత్నాలు

- కార్మిక, ఉద్యోగ సంఘాలు తీవ్ర విమర్శ
- ఎఐబిఇఎ అధ్యక్షుడిగా ఎన్నికైన బి.ఎస్.రాంబాబుకు ఘన సన్మానం





ప్రజాపక్షం/హైదరాబాద్

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) అధ్యక్షులుగా బి.ఎస్.రాంబాబు ఎన్నిక కావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పలువురు కార్మిక సంఘాల నాయకులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సంఘాల నాయకులు అన్నారు. ఎఐబిఇఎ అధ్యక్షులుగా ఎన్నికైన బి.ఎస్.రాంబాబు సన్మాన సభ ప్రభుత్వ రంగ కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బి.ఎస్.రాంబాబును నాయకులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఆయన సమర్థవంతమైన నాయకత్వం అందించాలని వారు ఆకాంక్షించారు. యుఎఫ్‌పిఎస్‌యు కన్వీనర్ ఎన్.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి తరువాయి 8లో

# ఏది ప్రత్యామ్నాయం?

- సందిగ్ధంలో రైతాంగం
- అపరాల సాగుతో సరిపెట్టుకుంటారా
- వరి స్థానే ఏ పంట ?- ఆలస్యమవుతున్న ఖరీఫ్



ప్రజాపక్షం/ ఖమ్మం

అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. సాంప్రదాయ పంటల సాగుకు సానుకూలత లేదంటున్నారు. ఏ పంటకు ఏది ప్రత్యామ్నాయం అని తేల్చుకోలేక రైతులు ఖరీఫ్ ముంగిట ఆలోచనలో పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలతో పాటు వరి, మొక్కజొన్న, అపరాలు కొద్ది శాతంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. గడిచిన ఐదారు సంవత్సరాలలో పామాయిల్ సాగు గణనీయంగా పెరిగింది. గతేడాది వానా కాలం, ఎండాకాలం రెండు సీజన్లలోనూ వరి రైతులకు లాభసాటి పంటగా మారింది. వరి సాగు చేసిన రైతులు కాస్త సంతోషంగానే ఉన్నారు. వరి సాంప్రదాయ పంట. దానికి ప్రత్యామ్నాయంగా వేరే పంటలు సాగు చేయడం అంత సులభం కాదు. వరిని వంపు నేలలు, తేలిక నేలలతో పాటు పదునెక్కువగా ఉండి నీరు నిల్వ ఉండే భూముల్లోనే సాగు చేస్తున్నారు. వరి తప్ప మరో పంట సాగు చేయడం కుదరదు. వరి సాగు తగ్గించవచ్చునేమో కానీ వరికి ప్రత్యామ్నాయంగా మరో పంట సాగు చేయడం కుదరదు. కొన్ని సంవత్సరాలుగా నీటి వసతి కలిగిన మెట్ట భూముల్లో రెండవ పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో పత్తి, అపరాలు సాగు చేసిన రైతులు రబీలో మొక్కజొన్న సాగు చేసి అధిక దిగుబడులు తరువాయి 8లో



# కళాకారులకు ఆత్మగౌరవ భరోసా

- గుర్తింపుకార్డులు అందజేసిన మంత్రి జూపల్లి
- కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ స్పష్టీకరణ
- తొలికార్డు అందుకున్న పల్లె నరసింహా

ప్రజాపక్షం/హైదరాబాద్

కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడటంతోపాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టంచేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సాంస్కృతిక సారథి కళాకారులకు కూడా ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చూస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్ తరువాయి 12లో

# మహారాష్ట్రకు 'ఆపరేషన్ టైగర్'

పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేజిక్కించుకున్న అనంతరం, మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను నిట్టనిలువునా చీల్చేందుకు 'ఆపరేషన్ టైగర్' ప్రాజెక్టును విజయవంతంగా నెరవేర్చిన బిజెపి నాయకత్వం, ఇప్పుడు దాన్ని మహారాష్ట్రకు విస్తరిస్తున్నట్లు తెలుస్తున్నది. ఉద్ధావ్ థాక్రే నాయకత్వంలోని శివసేన (యుబిటి) ఆదివారం ఏర్పాటు చేసిన తమ లోక్‌సభ సభ్యుల అత్యవసర సమావేశానికి 9మందిలో 5గురు హాజరు కాకపోవటంతో ఈ మేరకు ఊహాగానాలు బయలుదేరాయి. ఈ వార్తను పార్టీ నాయకుడు సంజయ్ రౌత్ గట్టిగా ఖండించినప్పటికీ, పార్టీలను చీల్చటంలో, ఫిరాయింపులు ప్రోత్సహించటంలో బిజెపి శక్తిసామర్థ్యాలు ఇప్పటికే రుజువైనాయి. శివసేన(యుబిటి)కి చెందిన 7గురు లోక్‌సభ సభ్యులు, 17 మంది ఎమ్మెల్యేలు అధికారిక శివసేన నేత, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండెతో టచ్‌లో (బేరసారాల్లో) ఉన్నట్లు ఆ పార్టీకి చెందిన కృపాన్ తుమార్ మీడియాకు చెప్పారు. ఇందులో వాస్తవం ఉండవచ్చు, లేకపోవచ్చు, లేదా ప్రత్యర్థి పక్షంలో అలజడి రేకెత్తించే వ్యూహం కావచ్చు. అయితే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించలేక గత లోక్‌సభ సమావేశంలో 2011 జనాభా ప్రాతిపదికపై లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపుదల, 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు, నియోజకవర్గాల పునర్విభజన నిమిత్తం 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఓడిపోయిన నేపథ్యంలో ఆ టార్గెట్‌ను సాధించి జులై మధ్యలో ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశంలో ఆ బిల్లులను మళ్లీ ప్రవేశపెట్టి విజయం సాధించాలని మోదీ ప్రభుత్వం పట్టుదలతో ఉన్నట్లు రోజూ ఊహాగాన వార్తలు వస్తున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 7గురు రాజ్యసభ సభ్యులను రాఘవ్ చద్దా నాయకత్వంలో బిజెపి ఆకర్షించింది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యులు 20 మంది మాతృసంస్థ నుంచి బయటకువచ్చి, ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు ఒక అనామక రిజిస్టర్డ్ పార్టీ నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా అనే దాంట్లో విలీనమయ్యారు. తృణమూల్ కాంగ్రెస్‌లో ప్రత్యేక గ్రూపుగా వ్యవహరించాలని ఆలోచన చేసి, ఒక పార్లమెంటరీ పార్టీలోపల ప్రత్యేక గ్రూపుగా గుర్తింపుతో 'అనర్హత' వేటు తప్పించుకోలేమని తెలుసుకున్నాక బిజెపి వారి సహాయంతో ఆ రిజిస్టర్డ్ పార్టీని అన్వేషించారు. రాత్రికి రాత్రి విలీనం అయినట్లు, తిరుగుబాటు ఎంపిలకు నాయకత్వం వహిస్తున్న శ్రీమతి కాకోలి ఘోష్ దస్తీదార్‌ని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిషన్‌కు సోమవారం లేఖ ఇచ్చారు. అంతకుముందు, తాము దస్తీదార్‌ను తమ గ్రూపు నాయకురాలిగా ఎన్నుకున్నట్లు, తమ గ్రూపుకు సభలో విడిగా సీట్లు కేటాయించాలని కోరుతూ తిరుగుబాటుదారుల బృందం స్పీకర్ ఓం బిర్లాకు ఆదివారం లేఖ ఇచ్చారు. న్యాయసలహా తర్వాత ఆయన తమ అభిప్రాయం ప్రకటిస్తారని భావించబడుతున్నది. ఇందుకు సమయం పడుతుంది. స్పీకర్ ఈ గ్రూపును ఎన్‌సిపిఐగా గుర్తిస్తూ నిర్ణయం ప్రకటించేలోపు వారు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు చేయవచ్చు. ఈ గ్రూపు ఎన్‌డిఎను బలపరుస్తున్నట్లు మొదటినుంచీ ప్రకటిస్తున్నది.

ఎన్‌సిపిఐ అనేది గిరిజన సంక్షేమం, జాతీయవాదం, పరిపాలనా సంస్కరణలకు కృషిచేసే వేదికగా 2020లో రిజిస్టర్ అయింది. దీని కేంద్ర కార్యాలయం హౌరా జిల్లాలో ఒక చిన్న పల్లెటూరు. అది ముందుగా త్రిపురలో తన ఉనికిని చాటుకుంది. ఎన్నికల కమిషన్‌కు దాఖలు చేసిన పత్రాల ప్రకారం అడ్వొకేట్ షూలీ కుందు కోశాధికారి. ఆమె భర్త ఉట్టియకుందు పార్టీ అధ్యక్షుడు. అది గుర్తింపు పొందని రాజకీయ పార్టీగా 2023 జనవరిలో రిజిస్టర్ అయింది. దాని ఎన్నికల గుర్తు ఫౌంటైన్ పెన్. ఆ పార్టీ ఫేస్‌బుక్ పోస్టులో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో ఉట్టియ కుందు ఫోటో ఉంది. ఆ పార్టీ ఎంతటి అనామక పార్టీ అంటే అది త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులను పోటీ చేయిస్తే ముగ్గురికీ కలిపి 822 ఓట్లు వచ్చాయి.

మమతా బెనర్జీ విధేయుడు, టిఎంసి ఎమ్మెల్యే కునాల్ ఘోష్ వ్యాఖ్య ఈ పరిణామాన్ని తేటతెల్లం చేస్తున్నది. "ఈ ఫిరాయింపును ప్రోత్సహించిన పార్టీ తిరుగుబాటుదారులను తమ పార్టీలోకి ఆహ్వానించలేక అతి చిన్న మూడవ పార్టీలోకి పంపింది'' అన్నారు. బిజెపి రూలు ప్రకారం తమ పార్టీలోకి ఎవరైనా ప్రజాప్రతినిధి ఫిరాయించదలుచుకుంటే ముందుగా ఆ పదవికి రాజీనామా చేయాలి.

28మంది తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుల్లో 20మందితో కూడిన తిరుగుబాటుగ్రూపు (ఇప్పుడు ఎన్‌సిపిఐ) లోక్‌సభలో బిజెపి, కాంగ్రెస్ తర్వాత మూడవ పెద్ద పక్షంగా అవతరించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైన బిజెపి ప్రధానంగా టిడిపి, జనతాదళ్(యు), మరికొన్ని ఎన్‌డిఎ భాగస్వాముల తోడ్పాటుపై ఆధారపడి మెజారిటీ సంఖ్యను దాటింది. ఈ తృణమూల్ తిరుగుబాటుదారుల తోడ్పాటు కారణంగా బిల్లులు ఆమోదింపజేసుకోవటం ఒక అంశమైతే, టిడిపి, జనతాదళ్‌లు ఎప్పుడైనా తోకజాడించే (ఆ అవకాశమైతే ప్రస్తుతానికి లేదనుకోండి!) అవకాశాన్ని నిరోధిస్తుంది కూడా. బిజెపి వచ్చే మూడేళ్లు నిశ్చింతగా తన ఏకచ్ఛత్రాధిపత్యం కొనసాగించవచ్చు.

టిఎంసి తిరుగుబాటు ఎంపిలు తమదే అసలు టిఎంసి అని, రెండాకుల ఎన్నికల చిహ్నం తమకే చెందాలని ఎన్నికల కమిషన్ ముందు సుదీర్ఘ పోరాటం చేయటం కన్నా, ప్రత్యేక బ్లాక్(పార్టీ)గా తక్షణం పార్లమెంటరీ గుర్తింపు పొందేందుకు సౌలభ్యంగా ఎన్‌సిపిఐతో విలీనమార్గం ఎంచుకున్నారు. అయితే బెంగాల్‌లోని తృణమూల్ తిరుగుబాటు ఎమ్మెల్యేలతో సంప్రదించకుండా ఎంపిలు ఏకపక్ష నిర్ణయం తీసుకోవటం "ప్రతిపక్ష నాయకుడు రిటబ్రత బెనర్జీ'' గ్రూపును గందరగోళంలో పడేసింది. పార్టీ చీలిందని, తమదే అసలుసిసలు పార్టీ అని ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ దాఖలు చేయాలంటే అసెంబ్లీ, పార్లమెంటు సభ్యుల్లో మూడింట రెండువంతుల తోడ్పాటు కావాలి. పార్టీ నిర్మాణంలో కూడా సగానికిపైగా వీరితో రావాలన్న సుప్రీంకోర్టు తీర్పు ఉంది.

టిఎంసి వ్యవస్థాపకురాలు మమతా బెనర్జీ ఈ పరిణామాలన్నింటిని గమనిస్తూ మౌనంగా ఉన్నారు. తిరుగుబాటుదారులపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత పిటిషన్ దాఖలు చేయకపోవటం ఆసక్తిదాయకం. ●



## కేరళలో షిగెల్లా ఆందోళన కలిగిస్తోంది

**కేరళ రాష్ట్రంలో షిగెల్లా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుండి రాష్ట్రంలో ఇప్పటివరకు 146 షిగెల్లా కేసులు నమోదయ్యాయి. 70 కేసులు కేవలం ఈ జూన్ నెలలోనే వెలుగుచూశాయి. రాష్ట్రంలో నమోదైన ఐదు షిగెల్లా మరణాలలో ఒకటి మార్చి నెలలో సంభవించగా, మిగిలిన నాలుగు మరణాలు జూన్ నెలలోనే నమోదయ్యాయి. అత్యధికంగా కోజికోడ్ జిల్లాలో 74 కేసులు నమోదయ్యాయి. మలప్పురంలో రెండు మరణాలతో సహా 25 కేసులు, తిరువనంతపురంలో కూడా 25 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని పథనంథిట్ట, పాలక్కాడ్, కాసరగోడ్ జిల్లాల్లో ఇప్పటివరకు ఎలాంటి షిగెల్లా కేసులు నమోదు కాలేదు.**

- కేరళ ఆరోగ్య శాఖ మంత్రి
కె. మురళీధరన్



# బడుల చదువులపై విశ్వాసాల నీడ

అజ్ఞానాన్ని తొలగించే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య. ప్రశ్నించడం, పరిశోధించడం, సత్యాన్వేషణ చేయడం వంటి లక్షణాలను పెంపొందించేది విద్యే. కానీ ఈరోజు విద్యకే అమావాస్య చీకట్లు కమ్ముకుంటున్నాయి. తెలంగాణలో జూన్12కు బదులు జూన్ 15న విద్యాసంస్థలను తెరవాలనీ విద్యాశాఖ నిర్ణయించింది. సవరించిన ఆ తేదీన అమావాస్య కావడంతో పిల్లలను పాఠశాలకు ఎలా పంపడమని విద్యార్థుల తల్లిదండ్రులు, నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నిన్న బడులు ప్రారంభమైన తొలి రోజున అమావాస్య కారణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు స్వల్పంగా నమోదైంది. అసలు కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు జీరోనే.

ప్రైవేట్ పాఠశాలలు అమావాస్య, మంగళవారం కారణాలు చూపుతూ రెండు రోజుల సెలవులు ప్రకటించాయి. ఈ క్రమంలో రాజకీయ నాయకులు తాము పదవులు చేపట్టేటప్పుడు, నామినేషన్లు వేసేటప్పుడు, కొత్త పథకాలు ప్రారంభించేటప్పుడు మాత్రం ఖచ్చితంగా మంచి రోజు, ముహూర్తం చూసుకుంటారు కదా? మరి పిల్లల విద్యాసంవత్సరాన్ని ప్రారంభించడానికి మాత్రం ఇలాంటి సెంటిమెంట్స్ ఉండవా?అని జనం ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కూడా సెంటిమెంట్ తో ముడిపడిన అంశంగా మారింది. రాజకీయ నాయకులు తీరు, తల్లిదండ్రుల సెంటిమెంటును పరిశీలిస్తే...మన సమాజంలో ఇంకా శాస్త్రీయ దృక్పథం ఎంత వెనుకబడి ఉందో అర్థమవుతుంది.

**అమావాస్య ఖగోళ సంఘటన**

వాస్తవంగా పిల్లల విద్య, ఆరోగ్యం లేదా భవిష్యత్తుపై అమావాస్య ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపదని సైన్స్ చెబుతుంది. అందువల్ల అమావాస్య కారణంగా పిల్లలను పాఠశాలకు దూరంగా ఉంచాలని పేరెంట్స్ అభిప్రాయపడడం శాస్త్రీయ దృష్టిలో సమర్థించదగిన విషయం కాదు. ఖగోళ శాస్త్రం ప్రకారం అమావాస్య అనేది చంద్రుని దశలలో ఒకటి. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. ఒక దశలో చంద్రుడు భూమి, సూర్యుని మధ్యకు వస్తాడు. ఆ సమయంలో చంద్రుని వెలుతురు పడే భాగం భూమికి ఎదురుగా ఉండదు. అందువల్ల భూమి నుండి చంద్రుడు కనిపించడు లేదా చాలా స్వల్పంగా కనిపిస్తాడు. ఇదే అమావాస్య. ఇది పూర్తిగా సహజమైన ఖగోళ సంఘటన మాత్రమే. ఇందులో ఎలాంటి శుభం, అశుభం, అదృష్టం, దురదృష్టం అనే అంశాలు లేవు.

ఒకవైపు అంతరిక్ష పరిశోధనలు చేస్తున్నాం. ఇస్రో చంద్రునిపైకి రాకెట్ పంపుతోంది. కృత్రిమ మేధస్సు(ఎఐ), డిజిటల్ విద్య, శాస్త్రీయ ఆవిష్కరణల్లో ముందుకు వెళ్తున్నాం. అయినా అమావాస్య, రాహుకాలం, వాస్తు, జాతకాల నిర్ణయాలనే ఇంకా నమ్ముతున్నాం. విద్య, ఉద్యోగం, వివాహం వంటి కీలక విషయాల్లో కూడా శాస్త్రీయ ఆలోచన కంటే భయాలు ప్రజలను గందరగోళంలోకి నెట్టుతున్నాయి. వీటి ప్రభావం విద్యార్థులపై పడి బాల్యదశలోనే అంధ విశ్వాసాలు నాటుకుంటున్నాయి. ఇప్పటికే కొంతమంది పిల్లలు గ్రహణాలను అరిష్ట సూచకాలుగా భావించడం, భాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలను నిజమని నమ్మడం జరుగుతోంది. అంతేకాక ఇలాంటి అవైజ్ఞానిక భావనలను మతంతో ముడిపెట్టి సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విద్య మరింత అవసరమైంది. అయితే 50 రోజుల సుదీర్ఘ సెలవుల తర్వాత బడికి సిద్ధమైన విద్యార్థికి అమావాస్యను అడ్డంపెట్టి ఆపితే అతనిలోని శాస్త్రీయ ఆలోచనలను చప్పినట్లే కదా!. మూఢనమ్మకాలను పెంచి పోషించినట్లే కదా! అందువల్లనే మంచిని గ్రహించి, చెడును విడిచిపెట్టే అభ్యుదయ సమాజ నిర్మాణానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హెచ్) చేర్చారు. ఇదీ ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, పరిశోధనా స్ఫూర్తిని పెంపొందించాలనీ నొక్కి చెబుతుంది.

**అజ్ఞానాన్ని తొలగించే ఆయుధం విద్యనే**

అమావాస్య రోజు వ్యతిరేక శక్తి ఉద్భవిస్తుందనీ, కీడు జరుగుతుందనీ కొందరు సూడో సైన్స్ వాదనలు చేస్తుంటారు. ఇలాంటి వాదనలకు శాస్త్రీయ ఆధారాలు లేవని విజ్ఞానం స్పష్టంగా చెబుతోంది. అయినా సామాన్య ప్రజలతో పాటు కొందరు విద్యావంతులు సైతం ఇలాంటివి నమ్మడం ఆందోళన కలిగిస్తుంది. ఇవన్నీ కూడా వర్ణ వ్యవస్థలో ఆదిపత్య సంప్రదాయవాదులు తరతరాలుగా ప్రజల మనసుల్లో నూరిపోసిన తప్పుడు ఆచారాలు, విశ్వాసాలు. శాస్త్రీయ ఆధారాలు లేని ఇలాంటి అంధ విశ్వాసాల ఉచ్చులో బడుగు, బలహీన వర్గాలు పడి బలవుతున్నారు. చారిత్రకంగా కులవర్ణ ఆధారిత అసమానతలకు ఛాందస దృక్పథమే మూల కారణం. ఈ దృక్పథమే దళిత, బహుజనులను, ఉన్నత వర్గ మహిళలను చదువు కు దూరం చేసింది. పూలే, అంబేద్కర్ పోరాటం, భారత రాజ్యాంగం వల్ల అందరికీ విద్య అందుతుంది. కానీ ఆ చదువును మూఢ నమ్మకాల పరిధిలో బంధిస్తే అది మన అజ్ఞానానికి, మానసిక బలహీతకు పరాకాష్టగా మారుతుంది. సాంప్రదాయాలు, మూఢనమ్మకాల ప్రభావంతో ప్రశ్నించే స్వభావం తగ్గి, చదువు లక్ష్యం దెబ్బతింటోంది. అందువల్ల అమావాస్యను ఒక సహజ ఖగోళ సంఘటనగా, పిల్లల విద్యను అంశాలను శాస్త్రీయ ఆలోచనతో చూడడం ఆధునిక సమాజ లక్షణం. సంప్రదాయాలను గౌరవించాలి. కానీ అవి విద్యకు, అవకాశాలకు అడ్డంకిగా మారకూడదు. ప్రభుత్వ విధానాలు సైతం హేతుబద్ధంగా ఉండాలి. చీకటిని పారద్రోలీ, వెలుగు నింపే బలమైన ఆయుధం విద్య మాత్రమే. కావున తల్లిదండ్రులు అంధ విశ్వాసాలను వీడి ఆధునిక విజ్ఞానానికి బాటలు వేయండి. అప్పుడే తరగతి గది శాస్త్రీయ పౌర సమాజానికి పునాదిగా నిలుస్తుంది.

సంపతి రమేష్, 7989579428.

# స్వార్థ, మత రాజకీయాలు సమాజానికి ప్రమాదకరం



వి.యస్.బోస్
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
9391356527

భారతదేశానికి 100 సంవత్సరాల పోరాటాల తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది. మన దేశాన్ని సర్వసత్తాక ప్రజాస్వామ్య దేశంగా ప్రకటించుకున్నాము.ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత ప్రజల కొరకు ప్రజల యొక్క ప్రభుత్వంగా ప్రజాస్వామ్యయుతంగా ఉండాలని శపథం చేశాము. స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది యోధులు ప్రాణాలొడ్డి పోరాటాలలో పాల్గొన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి నాయకత్వంలో చేసిన తిరుగుబాటు మొదటి స్వాతంత్ర్య పోరాటంగా చరిత్రలో నమోదైంది. టిప్పుసుల్తాన్ లాంటి రాజులు, ప్రజాస్వామ్యవాదులు, దేశభక్తికి అసలైన ప్రతినిధులైన సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బాలగంగాధర్ తిలక్ లాంటి వారితో పాటు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, రాజ్‌గురు లాంటి వీర కిశోరాల ప్రాణ త్యాగాలు, కమ్యూనిస్టులు మరియు అనేక వర్గాలు తరతమ భేదాలు లేకుండా ఒకే లక్ష్యంతో బ్రిటీష్ రాజ్యం పోవాలి, దేశానికి స్వారాజ్యం రావాలి అని పోరాటం చేశారు. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, పార్శీలు అనే తేడా లేకుండా మతాలకు, కులాలకు అతీతంగా దేశ స్వాతంత్ర్య పోరాటం జరిగింది. ఎట్టకేలకు 1947 ఆగస్టు 15నాడు మన దేశం బ్రిటీష్ వారి దోపిడీ, కబంధ హస్తాల నుండి ముక్తి చేయబడి స్వతంత్ర దేశంగా ఏర్పడింది.

నాటి నాయకులు నిజాయితీగా, స్వార్ధ చింతన లేకుండా, అవినీతి ఆశ్రిత పక్షపాతానికి తావులేకుండా దేశం కోసం పనిచేశారు. కానీ రానురాను 70 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ సమరంలో దేశ ప్రయోజనాలు అడుగంటి స్వార్ధ ప్రయోజనాలు ప్రథమ స్థానానికి చేరాయి. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి రాజకీయాల్లో ప్రథమ స్థానం సంపాదించింది. అవినీతి రాజ్యమేలుతుంది. ప్రవచనాలు ప్రజలకు... పైసలు రాజకీయ నాయకులకు అన్నది నిత్య సత్యంగా ఉన్నది. కష్టాలు ప్రజలకు, సుఖాలు రాజకీయ నాయకులకు అనేది వాస్తవంలో అమలవుతున్నది.

ఒకప్పుడు పార్టీ రాజకీయాల విధివిధానాలపై, సూత్రాలపై పార్టీ నాయకులు పనిచేసేవారు. రానురాను పార్టీ రాజకీయాలు వ్యక్తి రాజకీయాలుగా మారిపోయాయి. ఒకప్పుడు ఉన్న పార్టీ ప్రాధాన్యత మసకబారి వ్యక్తి ప్రాధాన్యత పెరిగి నియంతృత్వ స్థాయికి చేరుకుంటున్నాయి. పార్టీ భజనకన్నా వ్యక్తి భజన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పటి రాజకీయ నాయకులు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో ఎవరూ ఊహించటం అసాధ్యం. ఇలాంటి వారంతా ఉన్న పార్టీలో టికెట్ దొరకలేదని, డబ్బు సంపాదనకు అధికార పార్టీలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, పార్టీలు మారుతున్న విషయం ప్రజలు గమనిస్తున్నారు.

నిన్నటి వరకు మత సామరస్యం, సెక్యులర్ విధానం అని గుండెలు బాదుకునేవారు. మత రాజకీయాలతో నడుస్తున్న పార్టీలలో చేరి మత ద్వేషాలు రెచ్చగొడుతూ అంతకు ముందు మతరాజకీయాలు చేస్తున్న వారికన్నా తామే అగ్రగాములమని ప్రజలు నమ్మటానికి తాపత్రయపడుతూ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారు. సెక్యులర్ పార్టీలో ఉంటే సెక్యులరిస్టుగా, సోషలిస్టు పార్టీలో ఉంటే సోషలిస్టుగా, మతపార్టీలో ఉంటే మతోన్మాదిగా అనే కపాత్రలు నిర్వహిస్తూ సినిమా నటులను మరిపిస్తున్నారు.

తొలితరంలో పార్టీలు మారటం చాలా అరుదుగా ఉండేది. ప్రస్తుతం ఒక పార్టీలో గెలిచి పదవుల కోసం ఇతర పార్టీల్లో చేరటం అలవాటుగా మారిపోయింది. పార్టీ మార్పు చట్టాన్ని కూడా పనికిరానిదిగా చేసి అవకాశవాద రాజకీయాలను పరాకాష్టకు చేర్చుతున్నారు. ఒకప్పుడు మత రాజకీయాలను అసహ్యించుకొని వ్యతిరేకించినవారు సమాజ శ్రేయస్సు కన్నా తమ శ్రేయస్సే ముఖ్యమని భావించి మత రాజకీయ పార్టీల్లో చేరటంతో ఆ పార్టీల వారు ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతున్నది. అవకాశవాద రాజకీయవాదులు చేస్తున్న విన్యాసాలకు సమాజం (ప్రజలు) మూల్యం చెల్లించుకుంటున్నది.

ఒకనాడు తెలుగు ప్రజల ఆత్మగౌరవం పేరుతో ఢిల్లీపై తిరుగుబాటు చేస్తూ స్థాపించిన పార్టీ మరియు లోహియా ప్రవచించిన సోషలిజమే ధ్యేయంగా ఏర్పడిన పార్టీ నేడు మత రాజకీయాల పార్టీలతో ఊరేగటం స్వార్ధం మరియు అవకాశవాదం. చిన్న రాష్ట్రాలు తమ ధ్యేయమని రాజమండ్రి సమావేశంలో తీర్మానించిన పార్టీ అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌ని 4 రాష్ట్రాలుగా విభజించాలని మాయవతి కాలంలో అసెంబ్లీ తీర్మానించినప్పటికీ తర్వాత 10 సంవత్సరాలకుపైగా రాష్ట్రంలో, కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న పార్టీ మాయావతి తీర్మానాన్ని అమలు చేయకపోవటం పచ్చి అవకాశవాదం.

1947లో దేశ విభజన జరిగిన సంఘటనల ప్రతిఫలాలను క్రమంగా మర్చిపోయి దేశ ప్రజలంతా మతాలకు, కులాలకు అతీతంగా భారత సమాజ నిర్మాణంలో జీవనం గడుపుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు మత రాజకీయ వాదులు అవకాశం దొరికినప్పుడల్లా తమ నిజస్వరూపాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. కానీ నేటి రాజకీయాల్లో మతాల పేరుతో ప్రజలను విభజిస్తూ రాజకీయాలు చేస్తున్నారు. రాజకీయాల కోసం ఇలాంటి పనికి రాని విన్యాసాలు చేయటం సమాజానికి హానికరం. మెజార్టీ, మైనార్టీ వాదనతో తమ రాజకీయాలను మరింతలోతుగా ప్రజల్లోకి చొప్పించి తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇలాంటి విధానం ప్రమాదకరం. కాశ్మీర్‌లో వీరు రగిలించిన మంటలు ఆరలేదు. మర్చిపోయిన ఖలిస్తాన్ నినాదం మళ్ళీ తెరమీదకు వచ్చింది. నార్త్ ‌యీస్ట్రన్ రాష్ట్రాలు సవ్యంగా లేవు. ప్రస్తుత పరిస్థితులు సమాజ శాంతికి, సామరస్యానికి ప్రమాదంగా ఉన్నాయని మేధావులు పదే పదే చెపుతున్నా ఇలాంటి వారు వారి మాటలను పెడచెవిన పెడుతున్నారు. దేశమంటే కేవలం మట్టికాదు, సరిహద్దులు కావు, దేశమంటే ప్రజలు అనేది ఇష్టమున్నా లేకున్నా అందరూ ఒప్పుకోవాలి. దేశంలో 99శాతం శ్రమచేసుకొని బ్రతికే వారు ఉండగా కేవలం ఒక్కశాతం మాత్రం దోపిడీదారులు ఉన్నారనేది వాస్తవం. దేశంలో సంపద సృష్టించే వారే కష్టజీవులు, కార్మికులు అని తరతరాలుగా వాస్తవ విషయాలను మేధావులు చెపుతున్నప్పటికీ మన దేశ పాలకులు దోపిడీదారులకే కొమ్ముకాస్తూ 99శాతం ప్రజలకు అన్యాయం చేస్తున్నారు.

మత రాజకీయాలు చేసేవారు తాము చేసే మెజారిటీ వాదాన్ని

> *దేశంలో 99శాతం శ్రమచేసుకొని బ్రతికే వారు ఉండగా కేవలం ఒక్కశాతం మాత్రం దోపిడీదారులు ఉన్నారనేది వాస్తవం. దేశంలో సంపద సృష్టించే వారే కష్టజీవులు, కార్మికులు అని తరతరాలుగా వాస్తవ విషయాలను మేధావులు చెపుతున్నప్పటికీ మన దేశ పాలకులు దోపిడీదారులకే కొమ్ముకాస్తూ 99శాతం ప్రజలకు అన్యాయం చేస్తున్నారు.*
>
> *మత రాజకీయాలు చేసేవారు తాము చేసే మెజారిటీ వాదాన్ని శ్రమ విషయంలో పరిశీలిస్తే 99శాతం ప్రజలను వదిలి కేవలం ఒకశాతంతో మైనార్టీలుగా ఉన్న దోపిడీదారులకు ఎందుకు ఊడిగం చేస్తున్నారో అర్థం చేసుకోవాలి. అలాంటి రాజకీయాలను తిప్పికొట్టాలి.*

శ్రమ విషయంలో పరిశీలిస్తే 99శాతం ప్రజలను వదిలి కేవలం ఒక శాతంతో మైనార్టీలుగా ఉన్న దోపిడీదారులకు ఎందుకు ఊడిగం చేస్తున్నారో అర్థం చేసుకోవాలి. అలాంటి రాజకీయాలను తిప్పికొట్టాలి. రాజకీయాల నుండి స్వార్ధ, అవినీతి, మత రాజకీయాలను వెలివేయటంలో, సమాజాన్ని ప్రజాస్వామ్య దేశంగా నిర్మించటానికి ప్రజలు ప్రధానపాత్ర పోషించాలి. మన చరిత్రకు మనమే వారసులం. మన భవిష్యత్తును నిర్మించుకుందాం.

కావున పార్టీ పిరాయింపుల చట్టం మార్చి సంఖ్యతో సంబంధం లేకుండా పార్టీ ఫిరాయించిన వెంటనే పదవికి అనర్హుడిగా ప్రకటించాలి. రాజకీయ నాయకులు పదవి చేపట్టే ముందు ఆ పదవి పూర్తి అయిన తర్వాత మధ్యలో అసహేతుకంగా పెరిగిన ఆస్తులను జాతీయం చేయాలి. అలాంటి అనేకమైన మార్పులను మేధావులతో చర్చించి రాజకీయాల ప్రక్షాళన జరిపి సమాజాన్ని కాపాడాలి. అందుకోసం ప్రజలు తమ గళాన్ని వినిపించాలి.

# దక్షిణాది దిగ్గజాల గర్జన

దేశ రాజధానిలోని రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశం భారత రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు, విధానాలకు కేవలం తలలూపేందుకో లేదా తమ రాష్ట్రాల నిధుల వాటాల కోసం వినతిపత్రాలు సమర్పించేందుకో ప్రాంతీయ నేతలు ఢిల్లీ వెళ్లే పాత రోజులకు ఈ సమావేశం స్వస్తి పలికింది. కేరళకు చెందిన వి.డి.సతీశన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన జోసెఫ్ విజయ్... ఈ నలుగురు నేతలు ఒకే కూటమిగా, ఒకే స్వరంతో ఢిల్లీ గడప తొక్కడం దేశ రాజధానిలో తీవ్ర కలకలం రేపింది. 'అద్భుతమైన నలుగురి కూటమి'గా అభివర్ణించబడుతున్న ఈ ఐక్యత, కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకపక్ష నాయకత్వానికి స్పష్టమైన హెచ్చరికలను పంపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణాది రాష్ట్రాలు ఒకే తాటిపైకి రావడం జాతీయ రాజకీయాల్లో ఒక నూతన శకానికి నాంది పలికింది.

ఈ నలుగురు నేతలు కేవలం నాలుగు వేర్వేరు రాష్ట్రాల ప్రతినిధులుగా కాకుండా, ఒకే ఐక్య వేదికగా నిలబడటం వెనుక బలమైన ఆర్థిక, రాజకీయ, రాజ్యాంగపరమైన కారణాలు ఉన్నాయి. వీరు ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగు దక్షిణాది రాష్ట్రాలు దేశ దిగువ సభ అయిన ప్రజల సభలో నూట నాలుగు స్థానాలను కలిగి ఉన్నాయి. ఇది మొత్తం స్థానాల్లో దాదాపు ఐదో వంతు భాగం. అలాగే, దేశ మొత్తం ఉత్పత్తిలో ఈ రాష్ట్రాల వాటా ఇరవై ఆరు శాతం కాగా, దేశానికి వస్తున్న మొత్తం ప్రత్యక్ష పన్నుల రాబడిలో ఈ ప్రాంతం నుండే దాదాపు ముప్పై శాతం లభిస్తోంది. ఇంతటి ఆర్థిక, రాజకీయ బలం ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పంపిణీ విధానాల వల్ల ఈ రాష్ట్రాలు తీవ్ర వివక్షకు గురవుతున్నాయనే భావన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. తాము కష్టపడి సంపాదించి దేశ ప్రగతికి ఇస్తున్న నిధులలో తగిన వాటా తిరిగి రాకపోవడంపై ఈ నేతలు సంయుక్తంగా నిలదీశారు.

ఈ కూటమి లేవనెత్తిన అత్యంత కీలకమైన, సున్నితమైన అంశం – నియోజకవర్గాల పునర్విభజన. జాతీయ ప్రయోజనాల కోసం దశాబ్దాలుగా జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసినందుకు, విద్య, వైద్యం, మానవ వనరుల రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు ప్రజల సభలో ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం పొంచి ఉంది. జనాభాను పెంచిన రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు, నియంత్రించిన రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇవ్వడం ఏ రకమైన న్యాయమని ఈ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన మిశ్రమ సూత్రం జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు తెరలేపింది. సగం సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన సగాన్ని ఆర్థిక సహకారం, అభివృద్ధి సూచీల ఆధారంగా కేటాయించాలనే ఆయన ప్రతిపాదన ప్రాంతీయ ఆందోళనను ఒక గంభీరమైన రాజ్యాంగ ప్రశ్నగా మార్చింది. ఇది కేవలం నిధుల పంపిణీకి సంబంధించిన గొడవ కాదు, దేశ సమాఖ్య నిర్మాణంలో దక్షిణాది ఉనికికి సంబంధించిన సమస్య అని ఆయన చాటిచెప్పారు.

ఈ కూటమిలోని ప్రతి నాయకుడికి ఒక విలక్షణమైన శైలి, ప్రత్యేకమైన బలం ఉన్నాయి. కేరళకు చెందిన వి.డి. సతీశన్ ఈ కూటమికి మేధోపరమైన, నైతిక బలంగా నిలిచారు. ఆరుసార్లు శాసనసభ్యుడిగా గెలిచిన ఆయన, అవినీతి రహిత పాలనకు నిదర్శనంగా నిలుస్తూ నైతిక విలువలతో కూడిన రాజకీయాల వాణిని వినిపించారు. ఇక కర్ణాటకకు చెందిన డి.కె. శివకుమార్ తిరుగులేని వ్యూహకర్త, సంస్థాగత బలమున్న నేత. గ్రామ స్థాయి నుండి పార్టీని నడిపించడంలో, సంక్షోభ సమయాల్లో వ్యూహాలు రచించడంలో ఆయన దిట్ట. కర్ణాటకలో తన రాజకీయ పక్షాన్ని క్లిష్ట పరిస్థితుల నుండి గట్టెక్కించిన ఘనత ఆయనది. తెలంగాణలో అధికార పీఠాన్ని కైవసం చేసుకుని, జాతీయ స్థాయిలో దక్షిణాది హక్కుల కోసం దూకుడుగా పోరాడుతున్న నేతగా రేవంత్ రెడ్డి నిలిచారు. వీరందరితో పాటు తమిళనాడు నుండి జోసెఫ్ విజయ్ చేరడం ఈ కూటమికి మరింత ప్రజాదరణను, ప్రజాకర్షణను తెచ్చిపెట్టింది. ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా, సాంప్రదాయ సిద్ధాంతాల చట్రాలను బద్దలు కొడుతూ తమిళనాడులో అతిపెద్ద శక్తిగా ఎదిగిన విజయ్ ఉనికి, తమిళ సమాజంలో జాతీయ నిర్మాణాలపై ఉన్న పాత అపోహలను తొలగించి, ఒక నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. భారతదేశంలో ప్రాంతీయ కూటములకు సిద్ధాంతాల కంటే వ్యక్తిగత ప్రతిష్టలు, ప్రాంతీయ అహాలు ఎక్కువనే విమర్శ ఉంది. గతంలో ఇలాంటి అనేక ప్రయత్నాలు అంతర్గత విభేదాల వల్ల స్వల్పకాలంలోనే విచ్ఛిన్నమయ్యాయి. కానీ, ప్రస్తుత 'దక్షిణాది చతుష్టయం' భిన్నమైనదిగా కనిపిస్తోంది. ఎందుకంటే వీరి ముందున్నది కేవలం రాజకీయ అధికారం కాదు, తమ రాష్ట్రాల మనుగడ మరియు రాజ్యాంగపరమైన హక్కుల రక్షణ. కేంద్రం అనుసరిస్తు న్న 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే కేంద్రీకృత విధానానికి వ్యతిరేకం గా, నిజమైన బహుళత్వ సమాఖ్య వ్యవస్థను పునరుద్ధరించడమే వీరి ఒకరి బలాలు మరొకరికి పూరకంగా మారుస్తూ, ఈ నలుగురు నేతలు ఒకరికొకరు అండగా నిలవడం భారత ప్రతిపక్ష రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడి.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రాంతీయ అసమ్మతులను చిన్నచిన్న రాయితీలతో లేదా రాజకీయ వ్యూహాలతో విడివిడిగా సర్దుబాటు చేస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు ఎదురుగా ఉన్నది కేవలం నిరసనకారులు కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న, స్పష్టమైన కార్యాచరణ కలిగిన ఒక పటిష్టమైన కూటమి. పాలక పక్షానికి ఉత్తరాదిన ఎంతటి బలమైన పునాది ఉన్నప్పటికీ, దక్షిణాదిలో వారి విస్తరణకు ఈ కూటమి ఒక పెద్ద అడ్డుగోడగా మారనుంది. ఈ నలుగురు నేతలు తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలను, అహంకారాలను పక్కనబెట్టి ఇదే విధమైన క్రమశిక్షణను, ఐక్యతను రాబోయే దశాబ్దకాలం పాటు కొనసాగిస్తే, భారత రాజకీయాల కేంద్ర బిందువు ఉత్తరాది నుండి దక్షిణాదికి మారడం ఖాయం. జనాభా ఆధిక్యత మాత్రమే దేశాన్ని శాసిస్తుందనే పాత నమ్మకాన్ని ఈ వ్యవస్థీకృత ఐక్యత సవాలు చేస్తోంది. ఈ నలుగురు నేతలు వేసిన మొదటి అడుగు అత్యంత విజయవంతంగా పడింది, కానీ ఇది నిరంతర ప్రయాణంగా మారి దేశ రాజకీయాలను ఏ విధంగా మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.దక్షిణాది దిగ్గజాల గర్జన

వెంకగారి భూమయ్య, 9848559863




# కార్పొరేట్‌కు దీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్

### తెలంగాణ విద్యా రంగంలో నూతన విప్లవానికి శ్రీకారం

### నేడు ఆరుట్లలో టిపిఎస్‌ను ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యా సంస్కరణల్లో భాగంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టిపిఎస్)ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరుట్లలో బుధవారం ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన పబ్లిక్ స్కూల్ తెలంగాణ విద్యా రంగంలో నూతన విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టనుంది. సిఎం రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం 9:30 గంటలకు ఆరుట్లకు చేరుకుని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్స్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను సిఎం పరిశీలించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసి, అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివారెడ్డి ల ప్రత్యేక పర్యవేక్షణలో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపుదిద్దుకుంది. ఇక్కడ నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించనున్నారు. విద్యతో పాటు






క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యతను కల్పిస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించనున్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన జరగనుంది. ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక రోల్ మాడల్‌గా నిలువనుందని విద్య అధికారులు చెబుతున్నారు.

#### క్రీడ మైదానాలు...

ఆధునిక వసతులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, విద్యార్థులకు విశాలమైన ప్లేగ్రౌండ్స్, ల్యాబ్స్, గాలి,వెలుతురు పుష్కలంగా ఉండే తరగతి గదులు, లైబ్రరీ, జిమ్, డైనింగ్ హాల్స్‌తో పాటు క్రికెట్, ఫుట్‌బాట్,వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, క్యారమ్స్ వంటి ప్రతి క్రీడకు సంబంధించిన మైదానాలను ఏర్పాటు చేశారు. ఆయా క్రీడలకు ప్రత్యేక శిక్షకులను కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచారు.

#### దశలవారీగా వంద పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు

ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌లో భాగంగా నాలుగు పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడతలో రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల, మంచాల పాఠశాలలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రజా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రంలో దశలవారీగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

#### టిపిఎస్‌లో 1814 విద్యార్థులు

ఆరుట్ల చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడానికి ప్రభుత్వం ఐదు స్కూల్ బస్సులను ఏర్పాటు చేసింది. దీంతో ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న పిల్లలను కూడా టిపిఎస్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్లో మొత్తం 1,814 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రీప్రైమరీ విభాగంలో 150 మంది, ప్రైమరీ స్కూల్లో 600 మంది, హైస్కూల్ రెండు బ్లాకులలో కలిపి 800 మంది, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 160 మంది, రెండో సంవత్సరంలో 104 మంది విద్యార్థులు ఉన్నారు.

#### అప్పుడే 'నో అడ్మీషన్' బోర్డ్

తల్లిదండ్రుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోలేక టిపిఎస్ 'నో అడ్మిషన్' బోర్డును పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఆరుట్లలో సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్ర విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## గాంధీ భవన్‌లో నేడు మంత్రి అజారుద్దీన్ 'ప్రజలతో ముఖాముఖి'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గాంధీ భవన్‌లో బుధవారం నిర్వహించనున్న 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో మంత్రి ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది సమర్థవంతమైన వేదికగా నిలిచిందన్నారు. గతంలో ప్రతి బుధవారం గాంధీ భవన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల కొంతకాలం నిలిచిపోయినప్పటికీ, ప్రజలకు మరింత చేరువ కావడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా తిరిగి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్ర జలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను నేరుగా మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## మెట్రోను కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారనేది అసత్య ప్రచారం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** విదేశీ అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తే తప్పేముందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. విదేశీ ముస్లింలతో ఈ దేశ ముస్లింలను ఎందుకు పోలుస్తున్నారని కాంగ్రెస్ ను ప్రశ్నించారు. మతాల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకే సర్‌ను వ్యతిరేకిస్తోందన్నారు. వాస్తవానికి ఈ దేశ పౌరుల ఓట్లను తొలగించే హక్కు ఏ ఒక్కరికీ లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా విదేశీ అక్రమ చొరబాటుదారుల ఓట్లను తొలగించాలా? వద్దా? అనే అంశంపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మెట్రో రెండో దశను అడ్డుకుంటున్నారని సీఎం చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కిషన్ రెడ్డి అడ్డుకోవాలని అనుకుంటే తెలంగాణకు ఇంత పెద్ద ఎత్తున నిధులు, ప్రాజెక్టులు ఎందుకు వస్తున్నాయో ఆలోచించాలని కోరారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, బిజెపికి కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరంలేదని అన్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు సైతం మోదీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులిస్తోందన్నారు. బిఆర్ఎస్ పార్టీలో మావోయిస్టు భావజాలం ఉన్న నేతలు ఉన్నారని కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉందని చెప్పారు. అలాంటి నేతలతోనే సమాజానికి పెను ప్రమాదమని అన్నారు. మావో భావజాలం, తుపాకీ గొట్టంతో సాధించేదేమీ లేదనే నిజాన్ని గ్రహించే మావోయిస్టు నేతలంతా ప్రభుత్వం వద్ద లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. మావోయిస్టు భావజాలాన్ని వీడకపోతే భవిష్యత్తులో వారికే నష్టమని బిఆర్ఎస్ లోని మావో భావజాల నేతలను హెచ్చరించారు. మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో వివిధ వర్గాలతో నేతలను కలిసి అనేక కార్యక్రమాలు చేపడుతున్న బండి సంజయ్ కుమార్ అందులో భాగంగా మానకొండూరు లోని ఓ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపి డాక్టర్లతో 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

## అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగాల భర్తీ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువత, పోలీస్ అభ్యర్థులపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, వారిపైన లాఠీఛార్జ్ చేయిడాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ఖండించారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులను వీధుల వెంట వెంటాడి వేటాడటం, అక్రమంగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, నిరంకుశత్వానికి నిదర్శనమని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఒకే ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, 'మెగా నోటిఫికేషన్లు', 'జాబ్ క్యాలండర్' అంటూ కోతలు కోసి, నిరుద్యోగ యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 20 వేలకు పైగా పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ, కేవలం 5 వేల పోస్టులతోనే చేతులు దులుపుకోవాలని చూడటం అన్యాయమన్నారు.

## రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ..

### యూరియా కోసం క్యూ అవసరం లేదు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ యూరియా సహా అన్ని ఎరువులను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా పంపిణీని పారదర్శకంగా, సులభతరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతుల సూచనలకు అనుగుణంగా ఫెర్టిలైజర్ యాప్‌లో నిరంతరం మార్పులు, చేర్పులు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 4.06 లక్షల మంది రైతులు ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకున్నారని, మొత్తం 13.22 లక్షల బస్తాలు బుక్ కాగా వాటిలో 11.18 లక్షల బస్తాలురైతులకు అందజేశామని వివరించారు. బుక్ చేసిన యూరియాలో 84.6 శాతం విజయవంతంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాల వారీగా యూరియా కొనుగోళ్లలో నిజామాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. డిజిటల్ యాప్ వినియోగంలో అక్కడి రైతులు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. స్మార్ట్ ఫోన్ లేని లేదా యాప్ వినియోగంపై అవగాహన లేని రైతుల కోసం ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవ అందుబాటులో ఉంటుందని చెప్పారు. రైతులు కాల్ చేస్తే వారి తరఫున యూరియా బుకింగ్ ప్రక్రియను సిబ్బంది పూర్తి చేస్తారని వివరించారు. యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్, పరిశ్రమలకు మళ్లింపు వంటి అక్రమాలను అరికట్టడానికే డిజిటల్ విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. భూమి లేని వ్యక్తులు యూరియా కొనుగోలు చేయకుండా, నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని, వాతావరణ పరిస్థితులపై రైతులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, లాభసాటి పంట అయిన ఆయిల్ పామ్ సాగును పరిశీలించాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించడం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### బిఆర్ఎస్ ప్రభుత్వ పాపమే కాంట్రాక్టర్ల అత్మహత్యలు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత ప్రభుత్వం నుంచి పెండింగ్ ఉన్న వేల కోట్ల రూపాయల బకాయిలను దశలవారీగా చెల్లిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బిల్డర్స్, కాంట్రాక్టర్లతో మంత్రుల నివాస సముదాయంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశమై, వారి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పెట్టి పోయిన బకాయిలో ఆర్ అండ్ బి శాఖలోనే దాదాపు రూ.4 వేల కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నాయని, యాదాద్రి దేవస్థానం నిర్మాణ పనులు చేపట్టిన సంస్థలకు సైతం ఇప్పటికీ రూ. 350 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని తెలిపారు. గత 30 నెలల్లో (కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్ అండ్ బి) కాంట్రాక్టర్లకు రూ.3 వేల కోట్లకు పైగా బిల్లులు విడుదల చేశామని, ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా నాగర్ కర్నూల్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి సహా ఆరుగురు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు తీవ్రంగా కలచివేశాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయంలోనే కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు జరిగాయన్నారు. ఈ నెల 18న ప్రతిపాదించిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విరమించుకోవాలని తెలంగాణ బిల్డర్స్, కాంట్రాక్టర్స్‌ను కోరినట్లు మంత్రి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో సమావేశం ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల సమస్యలపై సమగ్ర చర్చ జరిపి, మూడు నెలల వ్యవధిలో పెండింగ్ బకాయిల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి,బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు,పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## సినీ ప్రముఖులు, క్రికెటర్లకు టిసిఎ లీగల్ నోటీసులు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) నిర్వహిస్తున్న టిజి20 లీగ్ పూర్తిగా చట్టవిరుద్ధమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ఆరోపించింది. ఈ లీగ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) నుంచి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేస్తూ, ఇందులో భాగస్వామ్యమైన సినీ ప్రముఖులు, అంతర్జాతీయ క్రికెటర్లు, నిర్వాహకులకు లీగల్ నోటీసులు జారీ చేసినట్లు టిసిఎ ప్రధాన కార్యాదర్శి ధరం గురువారెడ్డి మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో వెల్లడించారు. బిసిసిఐ రాజ్యాంగంలోని రూల్31ను ఉల్లంఘిస్తూ టిజి20 లీగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ టోర్నీని ప్రమోట్ చేస్తున్న సినీ నటులు వెంకటేష్ నాయుడు, విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, భారత ఆటగాళ్లు తిలక్ వర్మ, మహమ్మద్ సిరాజ్‌లతో పాటు కోర్టు నియమించిన సింగిల్ మెంబర్ కమిటీ హెడ్ జస్టిస్ పి. నవీన్ రావు కూడా నోటీసులు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ లీగ్ కేవలం క్రికెట్ టోర్నమెంట్ కాదని, దీని వెనుక వందల కోట్ల రూపాయల రాజకీయ, రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆయన ఆరోపించింది. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు, ప్రజాప్రతినిధులు తమ బినామీ సంస్థల ద్వారా ఫ్రాంఛైజీలను కొనుగోలు చేశారని, భవిష్యత్తులో భారీ కాంట్రాక్టులు పొందేందుకు ఈ వ్యవహారాన్ని వేదికగా ఉపయోగిస్తున్నారని పేర్కొంది. అలాగే హెచ్‌సిఎలో ప్రస్తుతం అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని, హెచ్‌సిఎ అధ్యక్షుడిని హైకోర్టు ఇప్పటికే సస్పెండ చేసిందని, కార్యదర్శి ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని గురువారెడ్డి ఆరోపించింది. అమీర్‌పేట్ క్లబ్‌కు చెందిన కొందరు వ్యక్తులు అపెక్స్ కౌన్సిల్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారని పేర్కొంది. జిల్లాల ఆటగాళ్లకు 60 శాతం ప్రాతినిధ్యం కల్పించామని హెచ్‌సిఎ చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని ఆయన ఆరోపించారు. టిజి20 లీగ్ పేరుతో జరిగిన ఆటగాళ్ల వేలం, ఫ్రాంచైజీ ఫీజులు సహా అన్ని ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిధులపై సిబిసిఐడితో దర్యాప్తు జరిపి సంబంధిత బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయాలని ఆయన కోరారు.. రాష్ట్ర స్థాయిలో చర్యలు తీసుకోకపోతే సిబిఐ, ఇడి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

## చేతులెత్తేసిన మోక్షప్రద చిట్‌ఫండ్

### రూ.5 కోట్లకు పైగా బకాయిలు.. చైర్మన్ సహా నలుగురిపై కేసు-పరారీలో నిందితులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో మరో భారీ చిట్‌ఫండ్ మోసం వెలుగులోకి వచ్చింది. చిట్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టిన సభ్యులకు మెచ్యూరిటీ అనంతరం డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన ఆరోపణలపై మోక్షప్రద చిట్ ఫండ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఈ కేసును మీర్‌పేట్ పోలీసుల నుంచి సిసిఎస్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్‌కు బదిలీ చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం సాయినగర్ కాలనీకి చెందిన యెనుక రాఘవేంద్ర అనే ప్రైవేట్ ఉద్యోగి ఫిర్యాదు మేరకు ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు ప్రకారం, మోక్షప్రద చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అలే యాదగిరి, ఆయన భార్య పద్మ చిట్ పథకాల్లో చేరితే డబ్బు సురక్షితంగా ఉంటుందని, మెచ్యూరిటీ తర్వాత రెండు నెలల్లో చిట్ మొత్తం చెల్లిస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన రాఘవేంద్ర తన భార్య అనూహ్య పేరుతో రూ.20 లక్షల చిట్‌లో చేరారు. నెలకు రూ.26 వేల చొప్పున వాయిదాలు చెల్లిస్తూ అక్టోబర్ 2025 నాటికి మొత్తం చిట్‌ను పూర్తి చేశారు. మెచ్యూరిటీ అనంతరం చిట్ మొత్తం ఇవ్వాలని కోరగా, యాజమాన్యం విడతల వారీగా రూ.8 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.12 లక్షలు బకాయి పెట్టింది. తర్వాత బకాయి మొత్తానికి సంబంధించి రూ.12 లక్షల విలువైన నాలుగు చెక్కులను అందజేసినా, వాటిని బ్యాంకులో జమ చేయగా ఖాతాలో తగిన నిధులు లేవని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో బాధితుడు మళ్లీ యాజమాన్యాన్ని సంప్రదించగా, వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ చిట్‌ఫండ్ సంస్థ ద్వారా తనతో పాటు మరెందరో సభ్యులు మోసపోయినట్లు, సంస్థ వివిధ చందాదారులకు సుమారు రూ.5 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసిందని రాఘవేంద్ర తెలిపారు.ఈ నేపథ్యంలో చైర్మన్ అలే యాదగిరి, వైస్ చైర్మన్ విక్రమ్, మేనేజర్ కిషన్‌రావు, పద్మపై మీర్‌పేట్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 318(4), చిట్ ఫండ్స్ చట్టం 1982లోని సెక్షన్ 79, తెలంగాణ డిపాజిటర్ల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ చట్టం సెక్షన్ 5 కింద కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కోసం కేసును సిసిఎస్, డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేయగా, అక్కడ క్రైమ్ నంబర్ 123/2026గా తిరిగి నమోదు చేశారు. కేసు దర్యాప్తును ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాస్‌కు అప్పగించారు. పెట్టుబడిదారుల డబ్బులను తిరిగి చెల్లించకుండా మోసం చేసిన చిట్‌ఫండ్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల ఉపవాస దీక్షకు జెఎసి సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రిటైర్డ్ ఉద్యోగులకు గత కొన్ని ఏళ్ల నుండి రావాల్సిన బకాయిలను ఆర్‌టిసి సంస్థ చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అందుకు నిరసనగా 18వ తేదీన విశ్రాంతి ఉద్యోగుల సారధ్య కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఉపవాస దీక్షకు జెఎసి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్ సుద్దాల సురేష్, కో కన్వీనర్ బి.యాదగిరి తెలిపారు. అలాగే జెఎసి భాగస్వామ్య సంఘాల విశ్రాంత ఉద్యోగులు కూడా ఈ దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక బకాయిలను చెల్లించే విధంగా తక్షణం చర్యలు తీసుకోవాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు.

#### రిటైర్డ్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు..

- 2017 వేతన సవరణ బకాయిలు రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, టెర్మినల్ లీవ్స్ డబ్బులు చెల్లించాలి.
- రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.
- రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య ఖర్చులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.4 లక్షల నుండి రూ.6 లక్షల కు అదనపు రుసుము లేకుండా పెంచుటకు ఇటీవల జరిగిన ఈడిల కమిటీ అంగీకరించినందున వెంటనే సర్క్యులర్ విడుదల చేయాలి.
- 2021 వేతన సవరణ బకాయిలు విశ్రాంత ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- తార్నాక ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించి, రెండు నెలలకు సరిపడే మందులు ఒకేసారి పంపిణీ చేయాలి.

**గద్వాల మున్సిపాలిటీ కార్యాలయం, జోగులాంబ గద్వాల జిల్లా.**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

Tr.Notice.E1/GDL/ENG/2025-26, Dated: 15.06.2026

| క్ర.సం. | NIT No. | పనుల సంఖ్య |
|---|---|---|
| 01 | E1/01/2025-26 | 01 |

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 16.06.2026 ఉ. 10.30గం.ల నుండి,
ప్రైస్ బిడ్ ప్రారంభ తేది : 18.06.2026 సా.4.00గం.ల వరకు.
మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @https://tender.telangana.gov.inలో చూడవచ్చు మరియు ఏవైనా ఇతర వివరాలకు ఫోన్ నెం. 9849907791ను సంప్రదించవచ్చు.
DIPR R.O. No. : 4306-PP/CL/ADVT/2026-27, Date: 16-06-2026
సం/- కమిషనర్, గద్వాల మున్సిపాలిటీ.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గాజులరామారం సర్కిల్-57**

**NIT No.& Date:** 08/DB/EE/Gajularamaram Circle-57/CMC/2026-27, **పని పేరు:** LED లైట్ల సేకరణ మరియు AB కేబుల్స్ సేకరణ (2 పనులు), **అంచనా విలువ:** రూ.10.02 లక్షలు, **ప్రారంభ తేది:** 17.06.2026 మ.2.00గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 24.06.2026 మ.2.00గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 7893066262, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.
DIPR R.O. No. : 4344-PP/CL/ADVT/2026-27, Date: 16-06-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని వివరణ | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 15/EE/ Cir-36/KZ/ GHMC/2026-27, Dt: 16-06-2026 | 1 నెం. - సివిల్ పని | రూ. 125.00 లక్షలు | 1 పని కొరకు ప్రారంభ తేది: 17.06.2026 సా.4:00గం.ల నుండి / ఆఖరి తేది: 20.06.2026 సా.4:00గం.ల వరకు. | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, కెజెడ్, జిహెచ్ఎంసి, ఖైరతాబాద్. సెల్: 9989930414 |
| | 4 నెం.లు - సివిల్ పనులు | | 4 పనుల కొరకు ప్రారంభ తేది: 18.06.2026 సా.4:00గం.ల నుండి / ఆఖరి తేది: 25.06.2026 సా.4:00గం.ల వరకు. | |
| మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.in లో చూడవచ్చు. | | | | కమిషనర్, జిహెచ్ఎంసి |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36,(కెజెడ్) జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 4378-PP/CL/ADVT/2026-27, Date: 16-06-2026



## జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ముదుమాల్‌లో ముమ్మరంగా విద్యార్థుల చేరిక

**ప్రజాపక్షం/కృష్ణ :** 2026–27 విద్యా సంవత్సరంకు గాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముదుమాల్‌లో మంగళవారం ఆరవ తరగతిలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరారు. ముఖ్యంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముదుమాల్ ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులు చేరగా, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మురారిదొడ్డి ప్రధానోపాధ్యాయులు ఈరన్న గౌడ్, ఆధ్వర్యంలో ఆరుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా నూతనంగా పాఠశాలలో చేరడానికి వచ్చిన విద్యార్థులను పాఠశాల విద్యార్థులు చప్పట్లతో స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులను చేర్పడానికి కృషి చేసిన దండు శేఖర్, ఈరన్న గౌడ్ లను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానం చేయడం జరిగింది. అనంతరం పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి పుస్తకాలను, నోట్సు, పుస్తకాలను అందజేసి విద్యార్థి తల్లిదండ్రులతో ఉన్నత పాఠశాలలో చదువు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం కురుమయ్య, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, మాధవి, రమేష్, తిమ్మప్ప, హేమ, మీనా కుమారి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా లింగమయ్య జాతర

**ప్రజాపక్షం/మక్తల్ :** మండలంలోని పస్పుల గ్రామంలో మంగళవారం లింగమయ్య జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిష్ణ నది నుంచి తీసుకువచ్చిన జలాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయం వద్ద ఉన్న బావిలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామంలోని పోల మవ్వ ఆలయం వద్ద పూజలు చేపట్టి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, నర్సింహులు, ఉపసర్పంచ్ హోటల్ రవి, మాజీ సర్పంచ్ దత్తప్ప, వరారెడ్డి, వార్డు మెంబర్ చింతకాయల ఆంజనేయులు, శివ కుమార్, లింగప్ప, పస్పుల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ కేసు నమోదు చేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

### మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించిన బాధితులు




**ప్రజాపక్షం/ధన్వాడ :** తనపై అక్రమ కేసు నమోదు చేసిన ధన్వాడ ఎస్సైపై తగు చర్యలు తీసుకోవాలని బాధితుడు మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించిన సంఘటన నెలకొంది. వివరాల ప్రకారం ధన్వాడ మండలం ఎంనోన్ పల్లి గ్రామానికి చెందిన తెలుగు హనుమంతు, ఆందజనేయులు ఇద్దరు కలిసి తమ పొలంకు వెళుతున్న క్రమంలో పక్క పొలం వారు హన్మంత్, ప్రశాంత్, సాంతప్ప ముగ్గురు కలిసి నన్ను మా అన్నయ బూతులు తిడుతూ గొడ్డలితో దాడి చేశారు. మేము ప్రాణ భయంతో 07 జూన్ 2026 రోజు ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. దెబ్బలు, గాయాలతో బాధపడుతున్న నన్ను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల అనంతరం మా గ్రామానికి తిరిగి రాగా ధన్వాడ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి నా కేసు గురించి విచారణ అడగగా దానికిగాను ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ 07 జూన్ 2026 రోజు నాపై, మా అన్నపై కేసు నమోదు కావడం జరిగిందని తెలిపారు. నేను, మా అన్న కలిపి ఆ ముగ్గురుపై దాడిచేసినట్లు తప్పుడు ఫిర్యాదు మేరకు ఎస్సై తమ పై కేసు నమోదు చేయడం జరిగింది. ఇక్కడ ఎస్సై వాళ్లతో కుమ్మక్కై తప్పుడు కేసును నాపై నమోదు చేసినందుకుగాను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సంప్రదించడం జరిగిందని బాధితులు తెలిపారు. ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ పై చట్టరీత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

## అనుమానాస్పద వ్యక్తుల గురించి సమాచారం ఇవ్వండి : కమలాకర్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో అనుమానాస్పద స్థితిలో కలిగి ఉన్న వ్యక్తుల గురించి తమకు సమాచారం అందించి దేశ భద్రతతో భాగం కావాలని జడ్చర్ల సిఐ కమలాకర్ కోరారు. మంగళవారం నాడు మహబూబ్ నగర్ జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా (ఆర్ఎఎఫ్) బలగాలతో జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కావేరమ్మపేట, సెజ్ ప్రాంతాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) బలగాలు, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ చేపట్టిన అనంతరం పోలీసు అధికారులు మాట్లాడుత ఫ్లాగ్ మార్చ్‌లో ఆర్ఎఎఫ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీసులు నిరంతరం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. అరికట్టడం, ప్రజల్లో భద్రతా భావనను మరింత బలోపేతం చేయడమే ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంతా పనిచేస్తే, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లేష్ జయప్రద తదితరులు పాల్గొన్నారు.



# వైద్యుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

### రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మాత్తుగా సందర్శించి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన, ఆయన, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా రంజిత్ కుమార్, కిష్టమ్మ అనే ఇద్దరు ఉద్యోగులు చాలా రోజులుగా విధులకు హాజరు కాకుండా, రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సదురు సిబ్బందికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.
ఆసుపత్రిలో వివిధ రిజిస్టర్లను సక్రమంగా అప్‌డేట్ చేయకపోవడంపై అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో మారాలి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలను, ఉచిత సదుపాయాలను, ఉచిత మందులను సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.రాబోయే నెల రోజుల్లోగా సిబ్బంది అంతా తమ పనితీరును మెరుగుపరుచుకోకుంటే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ సందర్భంగా హెచ్చరించారు.




## ఎల్ఐసి ఏజెంట్లకు అండగా బిఎంఎస్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** భారతీయ జీవిత బీమా రంగంలో పనిచేస్తున్న ఇన్సూరెన్సు ఏజెంట్లకు భారతీయ మజ్దూర్ ఏజెంట్లకు భారతీయ మజ్దూర్ సంఘం బిఎంఎస్ అండగా ఉంటుందని బిఎంఎస్ జోనల్ జనరల్ సెక్రెటరీ బాలస్వామి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవనంలో బిఎంఎస్ అడక్ కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో వారు మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా బిఎంఎస్ దేశంలోని వివిధ రంగాలో కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ కార్మికుల ప్రయోజనాలను కాపాడుతున్న ట్రేడ్ యూనియన్ బిఎంఎస్ అని వారి పేర్కొన్నారు. 1955 జులైలో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో స్థాపించడం జరిగిందని వారు పేర్కొన్నారు.అంచులు అంచులుగా ఎదుగుతూ భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సంగ్ (బిఎల్ఐఎఎస్) బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటయ్య, ఆల్ ఇండియా ఇసి మెంబర్ రంగ రాములు, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జోనల్ ఇసి మెంబర్ కృష్ణ వర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అడక్ కమిటీ చైర్మన్ నిరంజన్, జనరల్ సెక్రెటరీ తాళ్ల సురేష్, కోశాధికారి కర్ణ జంగయ్య, వైస్ చైర్మన్లు, ఈ తిరుతపయ్య యాదవ్, నిరంజన్ గౌడ్, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, సీనియర్ ఏజెంట్లు దస్తగిరి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జములమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**ప్రజపక్షం/వనపర్తి టౌన్ :** రాబోయే రోజుల్లో జములమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, మరింతగా కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మృగశిర కార్తీని పురస్కరించుకుని మంగళవారం వనపర్తి పట్టణంలోని 23వ వార్డులో వెలిసిన జములమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రికి బీఆర్ఎస్ నాయకులు మెకానిక్ శ్రీను, ఉంగ్లం తిరుమల్, నందిమల్ల శారదా , అశోక్, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవతలు పట్టణ ప్రజలకు రక్షణ కవచాలు లాంటివారన్నారు. గతంలోనే ఈ దేవాలయ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఆలయ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారు. వనపర్తి పట్టణ ప్రజలందరూ జములమ్మ దేవత ఆశీస్సులతో పాడిపంటలు, సుఖసంతోషాలు, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి వాకిటి, బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, సబ్బిరెడ్డి, యుగంధర్ రెడ్డి, శ్రీనివాస్, నరసింహ, వీర సాగర్, సూర్యవంశం, గిరి, చిట్యాల రాము, పెద్దముక్కల రవి, ఇమ్రాన్, మునికుమార్, చెన్నారెడ్డి, సబ్బిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎంట్ల శ్రీను, గౌనికాడి యాదయ్య, తోట శ్రీను, కుమ్మరి రామస్వామి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**ప్రజాపక్షం/దామరగిద్ద :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపిఎస్ దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని దామరగిద్ద ఎస్ఐ నరేష్ ను అడిగి తెలుసుకోని పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. బాధితులకు ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందించాలని ఏవైనా సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌సైట్ ఫైర్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. అర్ధరాత్రి వేళ గ్రామాలలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో సమరస్యంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యలపై సిబ్బంది వేగంగా స్పందించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ సమయపాలన పాటించాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందించాలని సూచించారు. రాత్రి సమయంలో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ కల్పించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు చేరువలో ఉంటూ మెరుగైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.

## సర్పంచ్‌ని సన్మానించిన రిటైర్డ్ డిజిపి



**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని ఉప్పలపాడు సర్పంచ్ ఖలీల్ ను రిటైర్డ్ డి జి పి పూర్ణచందర్ హైదరాబాద్ పట్టణంలోని రవీంద్రభారతిలో మంగళవారం బిసి టైమ్స్ బిసి సమాజ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు గా ఎన్నికైన ముస్లింలకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ ఈ సన్మానానికి అచ్చంపేట నియోజకవర్గం నుండి నేనొక్కన్నే ఎన్నికల కావడంతో ఎంతో గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. నా విజయానికి కృషి చేసిన ఉప్పలపాడు గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఎస్‌సి టాపర్లకు 'క్లాస్మేట్' నగదు పురస్కారం

**ప్రజాపక్షం/రేవల్లి :** క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 2025–26 విద్యసంవత్సరం ఎస్సెస్సీ టాపర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.1,116 నగదుతో పాటు మెడల్, సర్టిఫికెట్ ను బహూకరించారు. క్లాస్మేట్ క్లబ్ మండల అధ్యక్షుడు, ఎంఇఒ ఎం.బాల్ రెడ్డి, ఫౌండర్ వాస రాఘవేందర్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు దర్శి రాజయ్య, పోల శ్రీనివాసులు, క్లబ్ ప్రతినిధి అంబ శంకర్, రిటైర్డ్ జిహెచ్ఎం చిదిరి వెంకట శెట్టి, నాగపూర్ ఇన్‌చార్జీ హెచ్ఎం. శ్రీనివాస రెడ్డి, రేవల్లి కాంప్లెక్స్ హెచ్ఎం ప్రసాద్, ఎస్‌టిజి జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, యుటిఎఫ్ అధ్యక్షుడు కృష్ణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ముద్దు... ప్రైవేట్ పాఠశాల వద్దు

### ఎంఇఒ శివప్రసాద్

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంగ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం నూతన సంవత్సరం 2026–27 విద్యా సంవత్సరానికి గాను మండల పాఠశాలలు పునఃప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు నాణ్యమైన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన కార్యక్రమాన్ని పాటిస్తూ అమలు చేస్తూ జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో పాటుగా మానవపాడు మండల విద్యాశాఖ అధికారులు ఎంఇఒ శివప్రసాద్ నేడు 22 పాఠశాలలకు విద్యార్థులకు 4 వేల 9వందల 5 పుస్తకాలు పంపిణీ చేయ్యడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివప్రసాద్ మాట్లాడుతూ నేడు మద్దూర్ గ్రామ యుపిఎస్ పాఠశాల ప్రేయర్‌లో పాల్గొన్న అనంతరం కలుకుంట్ల గ్రామ యుపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్‌బుక్స్ పంపిణీ చేయ్యడం జరిగింది. ప్రభుత్వ బడులలోనే చేర్పించే విధంగా విద్యార్థులకు మంచి భవిష్యత్తు విద్యాబోధనలు చెప్పి విద్యా రంగంలో వారిని అభివృద్ధి చేసి విధంగా మేము మా ఉపాధ్యాయులు కలిసి ఒక ప్రణాళిక పద్ధతిగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విధంగా దిశా నిర్దేశా మార్గాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపించడం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యతతో కూడిన ఉచిత విద్యను గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు వారికి అందేలా చూడాలన్నారు.



## హర్ ఘర్ జల్‌లో భాగంగా మిషన్ భగీరథ వాటర్ ఉత్సవాలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలు చేస్తున్న హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో వాటర్ ఉత్సవాలను గోపాల్‌దిన్నే గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మిషన్ భగీరథ నీటి ట్యాంక్ వద్ద పైపులకు రక్ష కట్టి నీటి సంరక్షణ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయితీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి నీటి పరిరక్షణ, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు దొడ్ల కవిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, తాగునీటి వనరులను కాపాడుకోవాలని సూచించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టి భవిష్యత్ తరాలకు తాగునీటి బాధ్యత అని అన్నారు. సమావేశంలో గ్రామానికి తాగునీటి సరఫరా సేవలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న వాటర్ మెన్‌లు రాజన గౌడ్, శేఖర్ యాదవ్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ విశ్వనాథం, గ్రామ కార్యదర్శి కరుణాకర్, ఉపసర్పంచు వెంకటయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు చంద్రయ్య, బక్కయ్య, గ్రామ రైతులు, మహిళలు, అంగన్వాడీ , ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వైద్య చికిత్స కోసం ఎల్ఒసి పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/అయిజ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మండల కేంద్రంలో పుల్లికల్ గ్రామానికి చెందిన కురువ తిమ్మప్ప అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారికి మెరుగైన చికిత్స కోసం మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రంగాపూర్ ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీపై సమగ్ర విచారణ

### కలెక్టర్‌కు బిజెపి నేతల వినతి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో ఉన్న ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ పై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు రంగాపూర్ ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ, షేర్‌పల్లి బ్రిడ్జిని పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ని కలిసి పలు ప్రజా సమస్యల పై కలెక్టర్ కి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఏబిడి లిక్కర్ ఫ్యాక్టరీలో కార్మికుల భద్రత, శ్రమకు తగ్గ కార్మికుల వేతనాలు అందజేయాలని, పర్యావరణం జాగ్రత్తలు తీసుకోని కారణంగా లిక్కర్ ఫ్యాక్టరీ పరిసరాలో లిక్కర్ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే వ్యర్థాలతో దుర్వాసన అదేవిధంగా పంటలు దెబ్బతినే పరిస్థితి ఉంది. అవసరానికి మించి కృష్ణ నీటిని హై స్పీడ్ మోటార్లతో నీటిని దుర్వినియోగం చేస్తున్నందున లిక్కర్ ఫ్యాక్టరీ పై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, పెద్దేర్ పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతి నాయుడు, బిజెపి రూరల్ మండల అధ్యక్షుడు నాగరాజా యాదవ్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర్ గౌడ్ పాల్గొని కలెక్టర్ కి విజ్ఞాపన పత్రాన్ని అందజేయడం జరిగింది. అదేవిధంగా శేరుపల్లి దగ్గర ఉన్న బ్రిడ్జిని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వర్షం వస్తే కొల్లాపూర్, పెబ్బేర్ ప్రధాన రహదారి లో వాహనాలు వెళ్లే పరిస్థితి లేనందున ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. కావున తక్షణమే శేరుపల్లి బ్రిడ్జిని పూర్తి చేయాలని అదేవిధంగా చెలిమిళ్ళ యుపిఎస్ స్కూల్ అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ కి కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ పై అంశాల పై తగు విచారణ చేస్తానని అసంపూర్తిగా ఉన్నటువంటి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయిస్తానని కలెక్టర్ ఆదర్శ్ సురభి హామీ ఇచ్చారు. అదేవిధంగా యుపిఎస్ చెలిమిళ్ళ స్కూల్ పూర్తిస్థాయిలో నిర్మిస్తామని వారన్నారు.



## నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం

### అయ్యవారిపల్లి జడ్పీహెచ్ఎస్ లో పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/పెబ్బేరు :** నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా అయ్యవారిపల్లి గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తూ పుస్తకాలు పంపిణీ చేపట్టారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వక్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు అస్కాని కురుమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ సుగుణ గౌడ్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన నాగరపు బీచుపల్లి యాదవ్

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం నాటవెల్లి గ్రామానికి చెందిన నాగరపు బీచుపల్లి యాదవ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా రెండవసారి ఎన్నకైన సందర్భంగా మంగళవారం నాటవెల్లి గ్రామ సర్పంచ్ బొందల ప్రశాంత్ రానా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మీ పని తీరును చూసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి గుర్తించి రెండోసారి మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజ్ కుమార్, గ్రామ అధ్యక్షులు వెల్గొండా ఆంజనేయులు, మాజీ వార్డు మెంబర్ రాములు, వాజిద్, చాంద్ పాషా, పాండు పాషా,నాగేంద్ర, చెన్నయ్య, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నేడే మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు మహిళా సంఘాల బస్సులకు జెండా ఊపి ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు మంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి కృష్ణయ్య పర్యటన వివరాలను విడుదలచేశారు. పర్యటనలో భాగంగా చిన్నంబావి మండల కేంద్రంలో మండల మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సును మంత్రి జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం వీపనగండ్ల మండలం గోపాల్‌దిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అదే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వివరించారు. తదుపరి వీపనగండ్ల మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన ఎక్స్ రే ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అటకెక్కిన 'ఓత్ ఆఫ్ ఎలిజియన్స్'

## లంచం లేనిదే పనులు చేయని అధికారులు – ఎసిబి తనిఖీల్లో దర్శనమిస్తున్న నోట్ల కట్టలు
## కిలోలకొద్ది బంగారు ఆభరణాలు.. వెండి సామాగ్రి – రూ.వందల కోట్ల విలువైన భూముల పత్రాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ బాధ్యతలు చేపట్టేటప్పుడు ప్రమాణం చేసే ఓత్ ఆఫ్ ఎలిజియన్స్‌ను కొందరు మరిచిపోతున్నారు. అధికారం అంటే సేవతో కూడిన బాధ్యత అని అర్థం చేసుకోవడం లేదు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో జీతాలు పొందుతున్నామనే భావన వారి స్పృహలోకి రావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి చుక్కలు చూపిస్తూ రెడ్‌టేపిజం పెంచిపోషిస్తున్నారు. లంచం లేనిదే ఫైళ్లు కదలని పరిస్థితులను అవినీతి అధికారులు కల్పిస్తున్నారు. అడ్డదారిలో ఆర్జిస్తున్న సంపాదనతో పాటు వ్యాపారాల్లో వాటాలు దండుకుంటున్నారు. అడపాదడపా ఎసిబి చేపడుతున్న తనిఖీల్లో నోట్ల కట్టలు.. కిలోల కొద్ది బంగారు ఆభరణాలు.. కిలోల్లో వెండి సామాగ్రితో పాటు రూ.కోట్ల విలువైన భూముల పత్రాలు దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలోనే బల్దియా, పోలీస్, రెవెన్యూ, జలమండలి, హెచ్ఎండీఏ, విద్యుత్, విద్య, వైద్యం.... ఇలా ఏ శాఖలో చూసినా లంచావతారాలు పేట్రేగిపోతున్నారు.

ఇటీవల ప్రభుత్వ అధికారుల ఇండ్లల్లో ఏసిబి చేపడుతున్న దాడుల్లో రూ.కోట్లలో ఆస్తులు బయటపడుతున్నాయి. చాంతాడు బాగోతంలా అవినీతి జలగల ఆస్తులు వెలుగులోకి వస్తున్నాయి. పోలీస్, బల్దియా, రెవెన్యూ, జలమండలి, హెచ్ఎండీఏ, విద్య, వైద్యం... తదితర శాఖల్లో ఫోకల్ పోస్టింగుల్లో తిష్టవేస్తున్న అధికారులు రోజుకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఇంటికి తీసుకువెళుతున్నారంటే పరిస్థితి ఎలా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో అధికారి ఖరీదైన ఆహార్యం రూ.లక్షల్లో ఉంటుంది. కొందరు అధికారులు సామాన్యులు వస్తే సమయం కూడా ఇవ్వడం లేదు. తమ హోదాకు తగ్గట్లుగా ఉన్నవారు.. వారి పనులు రూ.కోట్లలో ఉంటే ముందుగా అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు. ఇక మీడియాలో కథనాలు వస్తే డోంట్‌కేర్ అంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వారి పంచన చేరుతున్న సదరు అవినీతి అధికారులు ఎవరినీ లెక్కచేయడం లేదు. గతంలో లంచాలు తీసుకునేందుకు కొద్దిగా జంకేవారు. ప్రస్తుతం బహిరంగంగానే లంచం గురించి బేరాలాడుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం నారాయణగూడ సర్వే భవన్ డిప్యూటీ డైరెక్టర్ నరహరి అవినీతి అక్రమాల లెక్క రూ.కోట్లలో ఉండటంతో మరోమారు ప్రభుత్వ అధికారులు అక్రమ సంపాదన గురించి చర్చజరుగుతోంది. అవినీతి అధికారుల ఇంట్లో ఏసిబీ దాడులు చేస్తూ అక్రమంగా సంపాదించిన రూ.కోట్ల ఆస్తులను ప్రజలకు తెలియపరుస్తున్నా.. అక్రమార్కులకు ఎటువంటి భయం కలగడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 100 వరకు ఏసిబి దాడులు జరిగాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజాప్రభుత్వం వచ్చిన కొత్తలో కొందరిపై ఏసిబి కొరడా ఝులిపించింది. హెచ్ఎండీఏ అధికారి ఇంటిపై జరిగిన దాడిలో విస్తుపోయే ఆస్తులు వెలుగుచూశాయి. లంచావతారాల చిట్టా రూపొందించామని.. రోజుకు ఒక అధికారి ఊచలు లెక్కించక తప్పదని ప్రచారం జరిగినా.. అంతా సద్దుమణిగింది. ఇటీవల మళ్లీ లంచావతారాలపై ఏసిబి కొరడా ఝులిపిస్తుండటంతో ప్రజల డబ్బులు వెలుగులోకి వస్తున్నది. ఏదేమైనా అవినీతి అధికారులకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సమస్యల పరిష్కారానికి 'వన్ డే– వన్ వార్డు'
### సిఎంసి కమిషనర్ డాక్టర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమస్యల పరిష్కారం కోసమే 'వన్ వార్డు వన్ డే' కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన అన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్(సిఎంసి) కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌తో కలిసి కమిషనర్ మంగళవారం గాజులరామారం సర్కిల్57 పరిధిలోని మహదేవపురం వార్డు277లో 'వన్ డే– వన్ వార్డు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కైలాస్ హిల్స్ పార్కులో జరిగిన ఈ సమావేశంలో పలు కాలనీల నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి కైలాస్ హిల్స్, మహదేవపురం, షిర్డీ హిల్స్, బాలయ్యనగర్, యండమూరి లేఅవుట్, పిఎన్ఆర్ ఓయాసిస్, ప్రాగా టూల్స్ కాలనీ, రవి నారాయణరెడ్డి నగర్, కైసర్ నగర్, డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ, గల్లీ పోచమ్మ బస్తీ ప్రాంతాల నుంచి మొత్తం 10 వినతులు అందాయి. సిసి, బిటి రోడ్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, వీధిదీపాల మరమ్మతులు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, వర్షపు నీటి కాలువల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని నివాసులు కోరారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి కైలాస్ హిల్స్ ఆర్‌డబ్ల్యూఏ నుంచి పారికి చెరువు ఇన్‌లెట్ వరకు భూమి సేకరించి వర్షపునీటి డ్రెయిన్ అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ తరపున భవన అనుమతులు, పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, 100 అడుగుల రహదారి, బాలయ్యనగర్‌కు వెళ్లే రహదారిపై ఆక్రమణల తొలగింపు అంశాలపై మరో రెండు వినతులు సమర్పించారు. పారిశుద్ధ్య విభాగానికి కైలాస్ హిల్స్, పిఎన్ఆర్ ఓయాసిస్, ప్రాగా టూల్స్ కాలనీ ప్రతినిధులు తమ కాలనీల అంతర్గత రహదారుల శుభ్రత కోసం ప్రస్తుతం ఉన్న పారిశుద్ధ్య కార్మికులను పునర్విభజించాలని కోరారు. ఎంటమలాజీ విభాగానికి షిర్డీ హిల్స్, మహదేవపురం, బాలయ్యనగర్ ప్రాంతాల్లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ కోసం ఫాగింగ్, ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. షిర్డీ హిల్స్, కైలాస్ హిల్స్, మహదేవపురం కాలనీల ప్రతినిధులు పారికి చెరువులో విస్తరించిన వాటర్ హయాసింథ్‌ను తొలగించాలని, చెరువులోకి చేరుతున్న మురుగునీటి ప్రవాహాన్ని మళ్లించాలని కోరారు. ఈ చెరువు కూకట్‌పల్లి జోన్‌లోని ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు వేగవంతం
### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరద ముప్పు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తా, జలమండలి ఇడిఎస్.పంకజ, ఎంఎంసి చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, ఉప్పల్ జోన్ హైడ్రా ఎస్ఎఫ్ఓ మోహన్‌రావు తదితర అధికారుల బృందంతో కలిసి మంగళవారం ఆయన రామంతాపూర్ మోడ్రన్ బేకరీ, దేవేందర్ నగర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించారు. రామంతాపూర్ రోడ్‌లోని మోడ్రన్ బేకరీ సమీపంలో భారీవర్షాలు కురిసినప్పుడు నీరు నిలిచే ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. వర్షాల సమయంలో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నీరు నిల్వ ఉండకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలను, డ్రైనేజీ వ్యవస్థ పనితీరును అధికారులు కమిషనర్‌కు వివరించారు. లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడ చేపట్టాల్సిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత రామంతాపూర్ దేవేందర్ నగర్ రోడ్ వెంట ఉన్న ప్రధాన నాలాను కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. నాలా నీటి ప్రవాహ సామర్థ్యం, ప్రస్తుతం కొనసాగుతున్న పూడికతీత, నిర్వహణ పనుల పురోగతిని సమీక్షించారు. వర్షాకాలంలో నాలాలు పొంగకుండా, ఎలాంటి అవరోధాలు లేకుండా నీటి ప్రవాహం సజావుగా సాగేలా చూడాలని స్పష్టం చేశారు. వరద ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వశాఖలు పరస్పర సమన్వయంతో, అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

## 'సిఎం ప్రజావాణి' 631 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని 'మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్'లో మంగళవారం నిర్వహించిన 231వ 'సిఎం ప్రజావాణి' కార్యక్రమంలో మొత్తం 631 దరఖాస్తులు అందాయి. ఇందులో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 278, ఇందిరమ్మ ఇండ్ల కోసం 204, రెవెన్యూ శాఖకు సంబంధించి 67, ప్రవాసి ప్రజావాణికి 04 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 78 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించి, ఎండార్స్‌మెంట్ చేసి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో ఎసిపి ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దుబాయి డిపోర్టేషన్‌లో చిక్కుకున్న హైదరాబాద్ వాసికి విముక్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దుబాయిలో డిపోర్టేషన్‌లో చిక్కుకున్న హైదరాబాద్‌లోని ఆల్వాల్‌కు చెందిన అభిషేక్‌ను ఎంబిసి సహకారంతో సిఎం ప్రవాసి ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి హైదరాబాద్‌కు క్షేమంగా రప్పించారు. తనను క్షేమంగా హైదరాబాద్‌కు రప్పించినందుకు అభిషేక్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో చిన్నారెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ప్రతినిధి పద్మ రాణి క్రి, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు : విక్రమ్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నాయని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్న, అవి కేవలం పేపర్లకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రం రజక, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మధు యాదవ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు సంపత్ నాయుడు, సాయితో పాటు బిసి విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

## మెట్రో విస్తరణపై బిజెపి, బిఆర్ఎస్ స్పష్టత ఇవ్వాలి : చరణ్ కౌశిక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశంలో బిజెపి, బిఆర్ఎస్‌లు రాజకీయాలు మానుకుని ప్రజలకు స్పష్టత ఇవ్వాలని టిజిఎల్‌డిఎ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకప్పుడు దేశంలో రెండో స్థానంలో ఉన్న మెట్రో ప్రాజెక్టు బిఆర్ఎస్ పాలనలో 9వ స్థానానికి పడిపోయిందన్నారు. మెట్రో విస్తరణకు సంబంధించి కేంద్రాన్ని ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం బిఆర్ఎస్ నాయకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ మెట్రోకు కేంద్రం 50 శాతం నిధులు కేటాయించిందని చెబుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, అందుకు సంబంధించిన ఆధారాలతో ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు.

## ఫర్టిలైజర్ సేల్స్ యాప్‌తో రైతులకు మెరుగైన సేవలు
### రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి(డిఎఓ) శైలజ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఫర్టిలైజర్ సేల్స్ యాప్ రైతులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి(డిఎఓ)ఎస్.శైలజ అన్నారు. మంగళవారం డిఎఓ ఎస్.శైలజ,సహాయ వ్యవసాయ సంచాలకురాలు కె.పద్మజ, వ్యవసాయ అధికారి హరినాథ్, మహేశ్వరం మండల వ్యవసాయ అధికారి డి.నాగమణితో కలిసి మహేశ్వరం మండలంలోని మహేశ్వరం ఎఆఎస్ కె,పద్మావతి ఫర్టిలైజర్స్ ఎరువుల విక్రయ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్స్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ అమలును పరిశీలించి, ఎరువుల విక్రయ విధానాన్ని సమీక్షించారు. ఎరువుల దుకాణాలకు వచ్చిన రైతులతో అధికారులు ప్రత్యక్షంగా మాట్లాడి నూతన యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శైలజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఫర్టిలైజర్ సేల్స్ యాప్ రైతులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఎరువుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సమర్థతను పెంపొందిస్తుందని తెలిపారు. అదేవిధంగా, డీలర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు.

## ఐకెవైసి తప్పనిసరిగా చేయించాలి
### రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎల్.పి.జి కనెక్షన్ వినియోగించడం ద్వారా ప్రత్యక్ష లబ్ది పొందుతున్న లబ్ధిదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె వనజాత తెలిపారు. పౌరసరఫరాల శాఖ కమీషనర్,పౌరసరఫరాల శాఖ వారి సూచనల మేరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ (బిబిఎ) తప్పనిసరి చేస్తూ ఎల్‌పిజి వినియోగదారులకు పలు సూచనలు చేశారు. ఎల్‌పిజి కనెక్షన్ వినియోగించడం ద్వారా ప్రత్యక్ష లబ్ది పొందుతున్న లబ్ధిదారులు ఇకెవైసి చేయించుకోవడం ద్వారా వారి భవిష్యత్ లబ్దిని కోల్పోకుండా ఉంటారన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన స్కీం లబ్ధిదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఇంతవరకు ఇకెవైసి చేయించుకోని ఎల్‌పిజి లబ్ధిదారులు, వినియోగదారులు 30 జూన్‌లోగా చేయించాలని వనజాత స్పష్టం చేశారు.

## మంచాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేధం
### ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ముఖ్యమంత్రి రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో పర్యటించనున్న నేపథ్యంలో, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా డ్రోన్లు, ఇతర వైమానిక పరికరాలను ఎగురావేయడం పట్ల నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగిందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి అందిన భద్రతా సూచనల మేరకు, ఉగ్రవాద, సంఘ విద్రోహ శక్తులు డ్రోన్లు, ఇతర వైమానిక పరికరాలను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రత, శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోబడింది సిపి వివరించారు. జులై 17 న మంచాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు, పారా గ్లైడర్లు తోపాటు రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగరవేత పూర్తిగా నిషేధించబడిందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని,ప్రజల అవగాహన కోసం వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాల నోటీసు బోర్డుల ద్వారా ప్రచారం చేయబడుతుందన్నారు. నిషేధిత ప్రాంతంలో ఎటువంటి డ్రోన్లు లేదా ఇతర వైమానిక పరికరాలను వినియోగించకుండా ఉండాలని సిపి తరుణ్ జోషి విజ్ఞప్తి చేశారు.

## రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ ముఖ్యం
### తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ ఎంతో ముఖ్యమైందని, త్వరగా భూసేకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యానాథ్ దాస్‌తో వీర్లపల్లి శంకర్ భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ త్వరగా చేస్తే ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీటి సమస్య తీరినట్లే అవుతుందని వివరించారు. షాద్‌నగర్ ప్రాంతం ఎంతో ఎత్తులో ఉన్నందున సాగునీరు, తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ వస్తే సమస్యలు తీరడంతోపాటు అభివృద్ధి సాధించేందుకు అస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారుతో జరిగిన భేటిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు షాద్‌నగర్ మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్దార్థ పాల్గొన్నారు.

### లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తాం..



లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేస్తున్నారని ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్ వివరించారు. మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి రిజర్వాయర్ నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందునాయక్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ కోసం ఇప్పటికే నిధులు మంజూరు చేయించారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వివరించారు.

## చిన్నారుల భవిష్యత్‌కు అంగన్‌వాడీలే పునాదులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** చిన్నారుల భవిష్యత్‌కు అంగన్‌వాడి కేంద్రాలే పునాదని కొత్తూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. మంగళవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలోని అంగన్‌వాడి స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం పంపిణీ చేయడంతోపాటు అన్నప్రసాదం ప్రారంభించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలేనని ప్రతి చిన్నారిని తల్లిదండ్రులు విధిగా పంపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపతిరెడ్డి, అంగన్‌వాడి టిచర్స్ మామిడి ఇందిరమ్మ, కమ్మరి జ్యోతి, గ్రామస్తులు దేశాల జైపాల్, సహదేవ్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

## నాణ్యాతా ప్రమాణాలు పాటించాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిటి రోడ్డు పనులు చేపట్టుతున్న నేపథ్యంలో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని, కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రతలు తీసుకుని పనులు పూర్తిచేయాలని హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం కోసం కాలనీల అభివృద్ధికి పనుల్లో జాప్యం లేకుండా అధికారులు పర్యవేక్షణ జరపాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ప్రదీప్, సభ్యులు రామకృష్ణ, జగదీష్, రమణ, గోవింద చారి, అప్పారావు, మధుసుదన్ తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్ఓను సన్మానించిన రైతులు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామ మాజీ సర్పంచ్ బండిమీది కృష్ణ, మాజీ వార్డు సభ్యులు ఎట్టి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఇబ్రహింపట్నం ఆర్డిఓగా పని చేసి బదిలీపై జిల్లా డిఆర్ఓగా నియమితులైన సంధర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రైతులు గురక రవికుమార్, మండల నర్సింగ్, కోప్పుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరం మండల కమిటీ



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల ఉప సర్పంచ్‌లు ఫోరం మండల నూతన కమిటీని మండల కేంద్రంలోని సాయిశరణం గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకన్నారు. అధ్యక్షుడిగా మచ్చ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా విస్లావత్ రాజు, ప్రధానకార్యదర్శిగా దెంది మధుకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా గౌర నాగరాజు, అనమోని రవీందర్, ట్రెజరిగా రెడ్డమోని శిరిష, వెంకటేశ్‌యాదవ్, కమిటీ సభ్యులుగా కుమ్మరిగూడే మంగ కృష్ణ, గౌర లక్ష్మణ్, నాయిని శ్రీకాంత్, కాలే అనిత రమేశ్, మల్లమ్మ, సువర్ణ వెంకటయ్య ఎన్నుకున్నారు.

## సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎసిపి కాశిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం ఎసిపి పి.కాశిరెడ్డి అన్నారు. మంగళవారం సిపి ఆదేశాల మేరకు వనస్థలిపురం సెక్టార్2లోని గ్రీన్ మెడోస్ కాలనీలో మీ సురక్ష ఎన్యుమరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి కాశిరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలు అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఇంట్లో పని చేసే వారి పూర్తి వివరాలు ఉంటేనే పనిలో తీసుకోవాలని, వారి పట్ల ఎలాంటి అజాగ్రత వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు జాటావత్ రవి నాయక్, అనిల్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలు అపలేరు

**ప్రజాపక్షం/కేశంపేట:** అరెస్టులతో ఉద్యమాలను అపలేరని ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షుడు జర్పుల రాజునాయక్ అన్నారు. లంబాడి ఉద్యోగుస్తులపై జరుగుతున్న ఎసిబి దాడులను ఖండిస్తూ నేడు ఏసిబి కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాకు వెళ్తున్న ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులను పోలీసులకు అరెస్టులు చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు.

## నందివనపర్తి ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఉన్న 33 బై 11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు. రైతులు, పౌల్ట్రీ నిర్వాహకులు సహకరించాలని కోరారు.

# జవాబుదారీపై మోదీ సర్కార్ విఫలం

• ప్రధాన్ రాజీనామాను కోరకపోవడమే అందుకు నిదర్శనం • ఈ ప్రభుత్వం తన వైఫల్యాలను ఇంకెంత కాలం కప్పిపుచ్చుతుంది: ప్రశ్నించిన కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ :** పరీక్షల నిర్వహణలో అనేక అక్రమాలు జరిగినప్పటికీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని చెప్పకపోవడం ద్వారా బిజెపి ప్రభుత్వం జవాబుదారీతనం విషయంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈనెల 21న జరగనున్న నీట్ పిజి 2026 రీ ఎగ్జామ్‌కు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై ఆంక్షలు విధించడంపై కూడా ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. నీట్ రీఎగ్జామ్ కోసం మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా టెలిగ్రామ్‌ను నిలిపివేసింది. లక్షలాది మంది యువత భవిష్యత్తును అడ్డుకున్న తన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను మోదీజీ ముందుగా డిమాండ్ చేయాలి ఖర్గే ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'భారత వైమానిక దళాన్ని రంగంలోకి దించడం, టెలిగ్రామ్‌ను నిలిపివేయడం, లేదా పేపర్ లీక్ మాఫియాను కాపాడేందుకు చిన్న చేపలను (చిన్న స్థాయి వ్యక్తులను) పట్టుకోవడం కావచ్చు... ఇవన్నీ మోదీ ప్రభుత్వం చేయాల్సి వస్తోందని ఎద్దేవా చేసింది. ఎందుకంటే గత 10 ఏళ్లలో 90 సార్లు పేపర్ లీక్ ఘటనలు జరిగాయని, ఈ మోసం, అవినీతి కారణంగా 9 కోట్ల మంది యువత ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రభుత్వం తన వైఫల్యాలను ఇంకెంత కాలం కప్పిపుచ్చుతుంది అని కాంగ్రెస్ అధినేత ప్రశ్నించారు. పరీక్షల అక్రమాల కారణంగా దాదాపు అరడజను మంది యువకులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తిందని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. 'మోదీజీ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. నియామక పరీక్షలకు తమ పిల్లలను సిద్ధం చేయడానికి ఏళ్ల తరబడి అప్పులు చేసిన తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నారు. కానీ, ఒకదాని తర్వాత ఒకటిగా నీట్, ఎస్ఎస్‌సి, యుజిసినెట్, క్యూట్, ఇతర పరీక్షల పేపర్లు లీక్ అవుతూనే ఉన్నాయి' అని ఆయన అన్నారు. పరిస్థితి ఎంతలా దిగజారిందంటే, సిబిఎస్ఇ ఫలితాల్లో జరిగిన భారీ మోసాన్ని బయటపెట్టాల్సిన పరిస్థితి ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏర్పడిందని ఖర్గే పేర్కొన్నారు. అత్యంత విశ్వసనీయతకు చిహ్నంగా భావించే యుపిఎస్‌సి పరీక్షపై కూడా ఆరోపణలు వస్తున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని చైతన్యవంతులైన యువత ఒకే ఒక్క విషయాన్ని డిమాండ్ చేస్తున్నారని, అదే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని అన్నారు. ఇది జవాబుదారీతనానికి మొదటి పరీక్షగా మారిందని, దురదృష్టవశాత్తు, బిజెపి ఈ పరీక్షలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు.

# టెలిగ్రామ్‌పై 22 వరకు ఆంక్షలు



**న్యూఢిల్లీ :** ప్రశ్నాపత్రం లీక్‌ల పేరుతో జరుగుతున్న మోసాలు, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించింది. 2026 జూన్ 22 వరకు దేశంలో టెలిగ్రామ్ సేవల పరిమితం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నీట్‌యుజి 2026 రీ ఎగ్జామ్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) చేసిన సిఫార్సుల మేరకు, సమాచార సాంకేతిక చట్టం2000లోని సెక్షన్ 69'ఎ' కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల21న జరగనున్న నీట్ రీ ఎగ్జామ్ రోజుతో పాటు ఆ తర్వాతి రోజు వరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయి. పరీక్షలు రాసే విద్యార్థులను మోసం చేస్తున్న గ్రూపులు టెలిగ్రామ్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టిఎ వెల్లడించింది. అయితే టెలిగ్రామ్‌లో ఇప్పటికే పంపిన సందేశాలను తర్వాత సవరించే సదుపాయాన్ని కూడా జూన్ 30 వరకు భారతదేశంలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పరీక్ష ముగిసిన తర్వాత అసలు ప్రశ్నాపత్రాలను పాత సందేశాల్లో జతచేసి, అవి ముందుగానే లీక్ అయ్యాయని తప్పుడు ఆధారాలు సృష్టించే ఘటనలు ఇటీవల పెరిగినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు నిర్వాహకులు పరీక్ష అనంతరం అసలు ప్రశ్నాపత్రాన్ని పాత పోస్టుల్లో జత చేసి, వాటి స్క్రీన్‌షాట్లను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపింది. టెలిగ్రామ్‌ను విద్య, ఉద్యోగ, వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించే లక్షలాది మంది వినియోగదారులకు ఈ నిర్ణయం కొంత అసౌకర్యం కలిగించవచ్చని ఎన్‌టిఎ అంగీకరించింది. అయితే పరీక్షల పారదర్శకత, భద్రత కోసం ఈ చర్యలు తప్పనిసరి అయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్ యుజి 2026 పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ పరీక్షను రద్దు చేశారు. దీంతో లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఈ నేపథ్యంలో జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రీఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు వార్తలు వచ్చాయి. అయినా సరే రీటెస్ట్ పేపర్ కూడా లీక్ అయిందంటూ వదంతులు వ్యాపించాయి. వాటిని ఇప్పటికే ఎన్‌టిఎ ఖండించింది.

### నీటి విడుదలకు రైల్‌పట్టాలపై

# రైతులు బైఠాయింపు

**జైపూర్ :** పంచానా డ్యామ్ నుండి కాలువల్లోకి నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నీటి విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ, మంగళవారం జైపూర్‌లోని ఖండీప్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఢిల్లీ–ముంబై రైల్వే ట్రాక్‌పై పెద్ద సంఖ్యలో రైతులు బైఠాయించినట్లు పోలీసులు తెలిపారు. రాబోయే ఖరీఫ్ పంట సాగు కోసం తమ కమాండ్ ఏరియాకు తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, సవాయి మాధోపూర్ జిల్లాలో మధ్యాహ్నం రైతులు సమావేశమయ్యారు. అయితే ఆందోళనకారులు రైల్వే గేటు మూసివేయకుండా అడ్డుకున్నారని, దాదాపు గంటన్నర పాటు ట్రాక్‌లను దాటుతూనే ఉన్నారని, దీంతో భద్రత, శాంతిభద్రతలపై ఆందోళనలు తలెత్తాయని పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే, పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని చక్కదిద్దడానికి నిరసనకారులతో చర్చలు ప్రారంభించారు. రద్దీగా ఉండే ఈ రైలు మార్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు తగినంత బలగాలను మోహరించినట్లు పోలీసులు తెలిపారు. నిరసన ఉధృతంగా ఉన్న సమయంలో ఏ రైలూ ఆ మార్గంలో వెళ్లకపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగలేదని, పరిస్థితిని అదుపులోకి తెచ్చిన తర్వాత ఒక ఎక్స్‌ప్రెస్ రైలు సురక్షితంగా ఆ మార్గాన్ని దాటిందని వారు తెలిపారు. మహస్వా, రైలా వంటి సమీప గ్రామాల నుంచి గుమిగూడిన నిరసనకారులు, త్వరగా నీటిని విడుదల చేయకపోతే తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, దానిని పర్యవేక్షిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఇరుపక్షాల వాదనలు వినను్న లోక్‌సభ స్పీకర్

ఆ తరువాతే చీలిక వర్గానికి గుర్తింపునిచ్చే అంశంపై నిర్ణయం



**న్యూఢిల్లీ :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన టిఎంసి ఎంపిల వాదనలతో పాటు మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం వాదనలను కూడా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వింటారని వర్గాలు తెలిపాయి. ఆ తరువాతే టిఎంసి చీలిక వర్గానికి గుర్తింపు ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా, మమతా నేతృత్వంలోని టిఎంసి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం నాడు ఇడి విచారణ జరుపుతున్న సమయంలోనే, వారి నాయకుడు అభిషేక్ బెనర్జీని కేవలం రెండు గంటల ముందస్తు నోటీసుతో బిర్లాతో సమావేశానికి పిలిచారు. సోమవారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు స్పీకర్ కార్యాలయం నుండి బెనర్జీకి ఒక ఇ–మెయిల్ వచ్చిందని, సాయంత్రం 4 గంటలకు బిర్లాను కలవమని అందులో కోరారని టిఎంసి వర్గాలు తెలిపాయి. ఆ వెంటనే, స్పీకర్ కార్యాలయం పార్టీ ఎంపి కీర్తి ఆజాద్‌కు ఫోన్ చేసి ఆ ఇ–మెయిల్ గురించి తెలియజేసింది. దీనికి ప్రతిస్పందనగా, బెనర్జీ అన్ని దర్యాప్తు సంస్థలకు సహకరించడానికి కట్టుబడి ఉన్నారని, కోల్‌కతాలోని సిజిఒ కాంప్లెక్స్‌లో ఉన్న ఇడి కార్యాలయంలో జరుగుతున్న దర్యాప్తుకు సహకరిస్తున్నారని ఆజాద్ స్పీకర్ కార్యాలయానికి తెలియజేశారని వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత రోజు, ఆజాద్ స్పీకర్‌ను కలిసి ఇ–మెయిల్ గురించి తెలియజేశారు. విచారణ అనంతరం బెనర్జీ అర్ధరాత్రి సమయంలోనే తిరిగి వచ్చారని ఆ వర్గాలు తెలిపాయి. దాదాపు 20 మంది టిఎంసి ఎంపిలు పెద్దగా ప్రాచుర్యం లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లో విలీనమవుతున్నట్లు ప్రకటించి, తదనంతరం తమను అసలైన టిఎంసిగా గుర్తించాలని కోరతామని చెప్పిన నేపథ్యంలో ఈ సమాచారం వెలువడింది. అయితే పెద్దగా ప్రాచుర్యం లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లో ప్రతిపాదిత విలీనం తర్వాత, ఫిరాయించిన నాయకులను ఒక ప్రత్యేక వర్గంగా గుర్తించాలన్న డిమాండ్‌పై బిర్లా న్యాయ సలహా కోరే అవకాశం ఉందని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. సాధారణంగా జులై మూడో వారంలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే ఈ వర్గం డిమాండ్‌పై ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటారని వారు తెలిపారు. చీలిక వర్గానికి గుర్తింపు లభిస్తుందా లేదా అనే నిర్ణయం, ఒక సీనియర్ న్యాయాధికారిని సంప్రదించిన తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఇచ్చే లిఖితపూర్వక అభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది. స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేసినప్పుడు, అది న్యాయ సమీక్షకు నిలబడేలా ఉండేందుకు న్యాయ సలహా కోరతారని ఆ వర్గాలు తెలిపాయి.


ఫారం-VI

(నియమం-19 లోని ఉప-నియమం(1)
మరియు చట్టం-30/2013 లోని సెక్షన్-11(1) చూడండి)

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్. జి/542/2026 — తేది: 10.06.2026
సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్ నెంబర్. బి/1415/2026 — తేది: 03.06.2026
గజెట్ నంబర్ -వికెబి : 63/2026 — తేది: 10.06.2026

వికారాబాద్ జిల్లా, దౌలతాబాద్ మండలం, కొడీడ్ గ్రామంలో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (Lift Irrigation Scheme) పరిధిలో, దౌలతాబాద్ చెరువు నుండి కొడంగల్ వద్ద గల లిఫ్ట్ పాయింట్ వరకు 'గ్రావిటీ కాలువ -II' నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టడం అనే ప్రజా ప్రయోజనం కోసం మొత్తం **9 ఎకరాల 15 గుంటల** భూమి అవసరమని తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్‌కు భావన కలిగినందున. ఈ భూమిని కార్యనిర్వాహక ఇంజనీర్, సాగునీటి విభాగం-9, కొడంగల్ వారి పేరిట సేకరించాల్సి ఉంది.

తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల మరియు CAD శాఖ, భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో సరియైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013లోని అధ్యాయాలు I & II కింద ఉన్న నిబంధనల నుండి, చట్టంలోని అధ్యాయం IIIAలోని సెక్షన్ 10A(b) కింద, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంకి మినహాయింపునిస్తూ, తేదీ:12.02.2025న జి.ఓ.ఎం.ఎస్.నెం.3 ను జారీ చేసింది. అందువల్ల, సదరు చట్టంలోని అధ్యాయాలు I & II కింద ఉన్న కార్యకలాపాలన్నీ చేపట్టబడలేదు. ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునఃస్థాపన ప్రయోజనార్థం, వికారాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గారు నిర్వాహకులుగా నియమించబడ్డారు.

కావున, వికారాబాద్ జిల్లా, దౌల్తాబాద్ మండలం, కొడీడ్ గ్రామంలో చేపట్టనున్న పై ప్రాజెక్టు నిమిత్తం సుమారు **Ac.9.15 gts** (అంటే ప్రామాణిక కొలతల ప్రకారం 3.7939285 హెక్టార్లు) విస్తీర్ణం కలిగిన, దిగువన వివరించిన భూమిని సేకరించనున్నట్లు దీని ద్వారా తెలియజేయడమైనది.

జిల్లా : వికారాబాద్ — మండలం : దౌల్తాబాద్ — గ్రామము : కొడీడ్

| క్రమ సంఖ్య | సర్వే నెం. | భూమి స్వభావం | భూమి వర్గీకరణ | భూసేకరణ క్రింద తీసుకోబడిన విస్తీర్ణం (ఎకరములలో) | పట్టాదారుని పేరు | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు: రకం | సంఖ్య | నిర్మాణాలు: కట్టడము | స్వభావ విస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 37/ఈ | లావుని పట్టా | మెట్ట | 0.01 | మాల చంద్రప్ప S/o ఆశ | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 2 | 37/రు1 | లావుని పట్టా | మెట్ట | 0.16 | మాల ఫకీరప్ప S/O సాయప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 3 | 37/ఉ | లావుని పట్టా | మెట్ట | 0.15 | మంగమ్మ బర్ల W/O బిచ్చన్న | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 4 | 37/ఐ | లావుని పట్టా | మెట్ట | 0.09 | హరిజన సుందరమ్మ W/o అర్జునప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 5 | 37/ఏ | లావుని పట్టా | మెట్ట | 0.13 | కొండని హనుమంతు S/o భీమప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 6 | 37/ఒ | లావుని పట్టా | మెట్ట | 0.10 | చాకలి పుష్పమ్మ W/o ఈశ్వరయ్య | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 7 | 37/ఒ1 | లావుని పట్టా | మెట్ట | 0.10 | చాకలి విజయ కుమార్ S/o ఇస్తప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 8 | 37/అం 1/1/1 | లావుని పట్టా | మెట్ట | 0.01 | మైకలి పెద్ద భీమప్ప S/o సాయన్న | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 9 | 37/ఓ | లావుని పట్టా | మెట్ట | 0.17 | చంద్రమ్మ W/o మాల హన్మప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 10 | 37/చ | లావుని పట్టా | మెట్ట | 0.05 | కర్రె చెన్నమ్మ W/O ఫకీరప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 11 | 37/ఏ1 | లావుని పట్టా | మెట్ట | 0.02 | కొండని హనుమంతు S/o భీమప్ప | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 12 | 37 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.21 | ప్రభుత్వ భూమి | నీటూర్ శివారు | సర్వేనెం. 34 | సర్వేనెం. 35 | మాటూర్ శివారు | - | - | - | - |
| 13 | 120/అ /2/1/1 | పట్టా | మెట్ట | 1.05 | ఖలీల్ రెహమాన్ S/o లతీఫ్ సాబ్ | సర్వేనెం. 123 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 119 | సర్వేనెం. 121 | మామిడి చెట్లు | 20 | - | - |
| 14 | 120/అ /2/1/2 | పట్టా | మెట్ట | 0.15 | అబ్దుల్ ఖాజా నిజాముద్దీన్ S/o అబ్దుల్ లతీఫ్ ఖాన్ | సర్వేనెం. 123 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 119 | సర్వేనెం. 121 | - | - | - | - |
| 15 | 120/అ | పట్టా | మెట్ట | 0.34 | కుర్వ మాసాని వెంకటప్ప S/o నాగప్ప | సర్వేనెం. 123 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 119 | సర్వేనెం. 121 | - | - | - | - |
| 16 | 121/U/2, 121/EE | పట్టా | మెట్ట | 1.09 | దౌల్తాబాద్ నాగప్ప S/o సాయప్ప | సర్వేనెం. 122 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 120 | మాటూర్ శివారు | - | - | - | - |
| 17 | 121/A/ 4 | పట్టా | మెట్ట | 0.13 | దౌల్తాబాద్ నాగేంద్రప్ప S/o నాగప్ప | సర్వేనెం. 122 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 120 | మాటూర్ శివారు | - | - | - | - |
| 18 | 121ఇ1/ 1/1/1 | పట్టా | మెట్ట | 0.07 | కుర్వ అశోక్ S/o కుర్వచిన్న కాశప్ప | సర్వేనెం. 122 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 120 | మాటూర్ శివారు | మామిడి చెట్లు | 20 | 1-బోరు బావి | - |
| 19 | 121/AA /1/1 | పట్టా | మెట్ట | 0.11 | తుపుడు భగవంతు S/o సాయప్ప | సర్వేనెం. 122 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 120 | మాటూర్ శివారు | - | - | - | - |
| 20 | 121ఇ1 1/1/2 | పట్టా | మెట్ట | 0.20 | కుర్వ పద్మమ్మ w/o కుర్వ పెద్ద కాశప్ప | సర్వేనెం. 122 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 120 | మాటూర్ శివారు | - | - | - | - |
| 21 | 121/అ/ 3 | పట్టా | మెట్ట | 0.06 | దౌల్తాబాద్ కనకప్ప S/o నర్సయ్య | సర్వేనెం. 122 | దౌల్తాబాద్ శివారు | సర్వేనెం. 120 | మాటూర్ శివారు | - | - | - | - |
| 21 | 122 | పట్టా | మెట్ట | 1.15 | తూపుడు సాయమ్మ W/o కనకప్ప, అర్జునప్ప S/o ఆశప్ప, తుప్పుడు పకీరప్ప S/o హనుమయ్య, తుప్పుడు అనంతమ్మ w/o సాయిలూ, అర్జునప్ప S/o ఆశప్ప, దౌల్తాబాద్ నాగేంద్రప్ప S/o నాగప్ప, కుర్వ అశోక్ S/o కుర్వచిన్నా కాశప్ప, నీలమ్మ W/O కనకప్ప, గండీడ్ దేవేందర్ S/o బిచ్చప్ప | సర్వేనెం. 34 | సర్వేనెం. 121 | సర్వేనెం. 123 | మాటూర్ శివారు | - | - | - | - |
| మొత్తం విస్తీర్ణం | | | | 9.15 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో సరియైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 (చట్టం సంఖ్య 30/2013) లోని సెక్షన్ 11(1) నిబంధనల ప్రకారం, సంబంధిత వ్యక్తులందరికీ ఈ ప్రకటన జారీ చేయబడింది.

భూమి యొక్క ప్రణాళికను వికారాబాద్ జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ కార్యాలయంలో లేదా తాండూరు డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏదేని పనిదినం నాడు పనివేళల్లో పరిశీలించవచ్చు. సదరు చట్టంలోని సెక్షన్-12లో నిర్దేశించిన విధంగా, తమ పనిని సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమి యొక్క లెవెల్స్ తీసుకోవడానికి, ఉపరితలం క్రింద తవ్వడానికి లేదా బోరు వేయడానికి మరియు ఇతర అన్ని పనులను చేయడానికి తాండూరు డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారికి మరియు ఆమె సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్-కమ్-అప్రోప్రియేట్ గవర్నమెంట్ అధికారం ఇస్తోంది.

ఈ చట్టంలోని సెక్షన్ 11(4) ప్రకారం, సంబంధిత నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి, కలెక్టర్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా, ఏ వ్యక్తియు ఆ భూమికి సంబంధించి ఎటువంటి లావాదేవీని (అంటే అమ్మకం/కొనుగోలు మొదలైనవి) జరపకూడదు లేదా జరిపించకూడదు; అలాగే ఆ భూమిపై ఎటువంటి అడ్డంకులను సృష్టించకూడదు.

ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజుల లోపల, చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం, ఆసక్తి గల వ్యక్తి సముపార్జనపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని జిల్లా కలెక్టర్ గారికి సమర్పించవచ్చు.

సం/- తహశీల్దార్, దౌల్తాబాద్ మండలం
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి/ భూసేకరణ అధికారి, తాండూర్ డివిజన్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వికారాబాద్ జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా

DIPR RO NO. 309/LA/PP/Advt/Agency/2026-27


### భారత నావికుల మృతిపై

# ట్రంప్‌తో మోదీ చర్చించాలి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ :** ఫ్రాన్స్‌లో జరుగుతున్న జి7 శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా నౌకలపై జరిపిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రస్తావించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, ట్రంప్ బుధవారం ఫ్రాన్స్‌లో జరిగే జి7 సమావేశాల సందర్భంగా సమావేశం కానున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో వాషింగ్టన్‌లో జరిగిన సమావేశాల తర్వాత ఇద్దరు నాయకుల మధ్య ఇదే తొలి సమావేశం. హోర్ముజ్ జలసంధిలో అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకున్న వాణిజ్య నౌకలలోని భారతీయ నావికులు మరణించడంపై ఆందోళనల నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది. కాగా, మంగళవారం విలేకరులతో ప్రియాంక మాట్లాడుతూ మోదీ తప్పకుండా అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన విషయాన్ని ప్రస్తావించాలని తాను భావిస్తున్నానన్నారు. జరుగుతున్న దాని గురించి మనం మరింత బహిరంగంగా మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. ఆపరేషన్ సింధూర్, న్యూఢిల్లీపై వాషింగ్టన్ భారీ సుంకాలను విధించిన నిర్ణయం తర్వాత భారత్–అమెరికా సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో, ట్రంప్, మోదీల మధ్య జరగనున్న ఈ సమావేశం మొట్టమొదటి ముఖాముఖి సంభాషణ కానుంది. ఇద్దరు నాయకులు ఇప్పటికే రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. అలాగే, ఫిబ్రవరిలో ఒక మధ్యంతర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాపై అంగీకరించారు, దీనిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. హోర్ముజ్ జలసంధిలో తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘించినా, ఇరాన్ చమురును అక్రమంగా రవాణా చేసినా సహించబోమని భారత్‌కు తెలియజేసినట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో ప్రియాంక గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# నాపై దాడి.. ఆర్‌ఎస్‌ఎస్ పనే

సమస్య నుండి దృష్టిని మళ్లించడానికి, విద్యార్థుల గొంతుకను అణచివేయడానికి చేసిన ప్రయత్నం : అభిజీత్ దీప్కే

**నాగ్‌పూర్ :** తనపై సోమవారం నాడు జరిగిన దాడి వెనుక కొంత మంది ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తులు ఉన్నారని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. వారు దాడి చేయడం కొత్తేమీ కాదన్నారు. తనపై జరిగిన దాడి అసలు సమస్య నుండి దృష్టిని మళ్లించడానికి, విద్యార్థుల గొంతుకను అణచివేయడానికి చేసిన ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. జైపూర్‌లో జరిగిన నిరసనలో, తన మద్దతుదారులు తనను భుజాలపై మోసుకెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు తనను పలుమార్లు చెంపదెబ్బ కొట్టారని డిప్కే ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో జరిగిన నీట్ యుజి పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ, అభిజీత్ డిప్కే మంగళవారం నాగ్‌పూర్‌లోని సంవిధానం చౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అంకు ముందు ఆయన మంగళవారం ఉదయం నాగ్‌పూర్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వానికి లేదా వారి భావజాలానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడినప్పుడు వారు ఇలాగే చేస్తారని, ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. తనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు ఉన్నాయని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశానని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ, అందుకేనా నాపై దాడి చేశారు? అని డిప్కే ప్రశ్నించారు. 'మేము మా సమస్యల నుండి పక్కకు తప్పుకోము; మీరు ఎంతైనా దాడి చేయండి. మేము శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా నిరసన కొనసాగిస్తాము. కోటి మందికి పైగా విద్యార్థులు అన్యాయానికి గురవుతున్న ప్రధాన సమస్య నుండి మేము వెనక్కి తగ్గము; దీనికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలి' అని ఆయన అన్నారు. కానీ తాను భయపడనన్నారు.గాంధీజీ, అంబేద్కర్ మార్గంలో నడుస్తున్నామని, ఇది తమ సత్యాగ్రహమని, దీప్కే స్పష్టం చేశారు.

**ఎన్నికల్లో పోటీ చేయం**

ఇదిలా ఉండగా, తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపడం లేదని దీప్కే స్పష్టం చేశారు. అలాగే, నీట్‌యుజి పరీక్షల నిర్వహణలో తలెత్తిన గందరగోళం తర్వాత దేశంలోని విద్యార్థులను సంప్రదించనందుకు లేదా వారిని పరామర్శించనందుకు ప్రధాని నరేంద్ర మోదీని ఆయన విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ నాగ్‌పూర్ నగరంలో సిజెపి చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి ముందు దీప్కే విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిజెపి ఎన్నికల్లో పోటీ చేస్తుందా అని అడిగినప్పుడు, 'మేము ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయాలి? అంటే, తమ హక్కుల కోసం పోరాడటానికి ఈ దేశంలోని ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోటీ చేయాల్సి వస్తే... అది ఎలా సాధ్యమవుతుంది?' అని ప్రశ్నించారు.

### తొలి దశ జనగణన

# 23 రాష్ట్రాలు, యుటిల్లో పూర్తి

**న్యూఢిల్లీ :** జనగణన (2027) తొలి దశలో భాగంగా ఇళ్ల జాబితా, గృహ గణన (హెచ్‌ఎల్‌ఒ) ఇప్పటి వరకు 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయిందని మంగళవారం ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేరళ, నాగాలాండ్‌లో 15 రోజుల స్వీయ గణన ప్రక్రియ కొనసాగుతోందని, దీని తర్వాత జులై 1న క్షేత్రస్థాయి కార్యకలాపాలు ప్రారంభమై 30 వరకు కొనసాగుతాయని ఆ ప్రకటన పేర్కొంది. ఈ దశకు సంబంధించిన క్షేత్రస్థాయి కార్యకలాపాలు మంగళవారం హిమాచల్ ప్రదేశ్‌లో ప్రారంభం కాగా, గుజరాత్, జమ్ముకశ్మీర్, లఢాఖ్, పుదుచ్చేరి, ఉత్తర ప్రదేశ్‌లలో ఇప్పటికే కొనసాగుతున్నాయి. 'స్వీయ గణనను పూర్తి చేసుకున్న నివాసితులు, హెచ్‌ఎల్‌ఒ ప్రక్రియను పూర్తి చేయడానికి క్షేత్రస్థాయి పర్యటన సమయంలో తమకు జారీ అయిన స్వీయ గణన ఐడిని సిద్ధంగా ఉంచుకుని, దానిని గణన అధికారికి చూపించవలసిందిగా కోరడమైనది. స్వీయ గణనను ఎంచుకోని కుటుంబాలను, గణన అధికారులు ఇంటింటికీ వెళ్లి చేసే పర్యటనల సమయంలో లెక్కిస్తారు' అని ఆ ప్రకటన తెలిపింది. స్వాతంత్ర్యం తర్వాత ఎనిమిదవ సారి రూ. 11,718 కోట్ల జనాభా గణన ప్రక్రియ రెండు దశల్లో జరుగుతోంది. మొదటి దశను గృహాల జాబితా, గృహ గణన అని, రెండవ దశను జనాభా గణన అని పిలుస్తారు. ఏప్రిల్ 1న ప్రారంభమై సెప్టెంబర్ 30 వరకు కొనసాగే ఈ గృహాల జాబితా, గృహ గణన, జనాభా గణనకు ఒక పటిష్టమైన చట్రాన్ని అందించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని నిర్మాణాలు, ఇళ్లు, కుటుంబాలను క్రమపద్ధతిలో జాబితా చేస్తారు. మొట్టమొదటిసారిగా, ఈ ప్రక్రియ డిజిటల్‌గా జరగనుంది. సమాచారాన్ని సేకరించడానికి గణన అధికారులు ఒక ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగిస్తారు. గృహాల జాబితా క్షేత్రస్థాయి కార్యకలాపాల సమయంలో, గణన అధికారులు ప్రతి ఇంటిని, భవనాన్ని స్వయంగా సందర్శించి, పౌరులను వారి ఇళ్లలోని ప్రాథమిక సౌకర్యాలు, కుటుంబ పెద్ద పేరు, లింగం వంటి సమాచారం, యాజమాన్య స్థితితో పాటు ఇతర విషయాల గురించి 33 ప్రశ్నలు అడుగుతారు. మొట్టమొదటిసారిగా, ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఒక వెబ్‌సైట్‌లో పౌరుల కోసం స్వీయగణన వేదికను కూడా ఏర్పాటు చేశారు.

### టిఎంసి తిరుగుబాటు ఎంపిలను చేర్చుకునేందుకు

# ఎన్‌సిపిఐ సిద్ధంగా ఉంది

ఎంపి కకోలి ఘోష్ దస్తీదార్



**న్యూఢిల్లీ :** తమ పార్టీకి చెందిన అసమ్మతి లోక్‌సభ సభ్యులందరినీ పార్టీలో చేర్చుకోవడానికి 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (ఎన్‌సిపిఐ) అంగీకరించిందని తిరుగుబాటు తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి కకోలి ఘోష్ దస్తీదార్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తింపు పొందిన ప్రత్యేక వర్గంగా ఏర్పడిన అసమ్మతి టిఎంసి ఎమ్మెల్యేలతో, ఈ తిరుగుబాటు ఎంపిలకు ఎటువంటి సంబంధం లేదని కూడా దస్తీదార్ స్పష్టం చేశారు. తమ తదుపరి కార్యాచరణ గురించి అడిగినప్పుడు, బెంగాల్‌లోని బరాసత్ నియోజకవర్గానికి చెందిన ఈ ఎంపి మాట్లాడుతూ, ముందుగా తాము ఒక స్థిరమైన స్థితికి వచ్చి, ఆ తర్వాత మరో పార్టీలో విలీనం అయ్యేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. 'మాకు ఇప్పటికే సానుకూల స్పందన లభించింది. మమ్మల్ని చేర్చుకోవడానికి ఎన్‌సిపిఐ ఆసక్తితో ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలోని ఎన్‌డిఎతో కలిసి మేము పనిచేస్తాము' అని పార్లమెంట్ భవన సముదాయం వద్ద మంగళవారం విలేకరులతో దస్తీదార్ అన్నారు. తమ వర్గం బలం గురించి అడిగినప్పుడు, ప్రస్తుతం తాము 20 మంది ఎంపిలం ఉన్నామని, ఈ సంఖ్య 22కి పెరగవచ్చన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిఎంసి తరపున మొత్తం 28 మంది ఎంపిలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. బెంగాల్‌లోని అసమ్మతి టిఎంసి ఎమ్మెల్యేలతో సంబంధాల గురించి ప్రస్తావించగా, అసమ్మతి ఎంపిలకు రాష్ట్ర శాసనసభ్యులతో ఎటువంటి సంబంధం లేదని దస్తీదార్ పేర్కొన్నారు. అంతకు ముందు రోజు హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన దస్తీదార్, గత 10 ఏళ్లలో పశ్చిమ బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం మహిళా భద్రతా పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు.

### దృష్టిలోపం ఉన్న వ్యక్తికి, అతని వృద్ధతల్లికి...

# సంక్షేమ చర్యలు అందించాలి

ఒడిశా సర్కారుకు 'సుప్రీంకోర్టు' ఆదేశం


**న్యూఢిల్లీ :** తీవ్ర పేదరికంలో జీవిస్తున్న దృష్టిలోపం ఉన్న వ్యక్తికి, అతడి 80ఏళ్ల తల్లికి సహాయంగా వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేలా చూడాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు మంగళవారం ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించింది.మీడియా కథనాల ఆధారంగా సుమోటోగా నమోదు చేసుకున్న కేసులో ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం జపాభూయే, అతడి వృద్ధ తల్లి అయిన రాధికా భూయేలకు సామాజిక భద్రత కల్పించేందుకు పలు ఆదేశాలు జారీ చేసింది. వారికి చేపట్టిన సంక్షేమ చర్యలపై అమలు నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ ఒడిశా ప్రభుత్వం స్పందనను కోరింది. ఒడిశాలో సుబర్నపూర్ జిల్లాలోని రాధిక భూయే ఆమె దృష్టిలోపం ఉన్న కుమారుడు జపాభూయే జీవిస్తున్నారు.ఆమె కుమారుడు పుట్టినప్పటి నుందిఅంధుడు, రోజువారీ అవసరాల కోసం తన తల్లిపై ఆధారపడి ఉన్నారు. మీడియా కథనాల ప్రకారం తండ్రి మరణం తర్వాత ఆ కుటుంబ అర్థికపరిస్థితి మరింత దిగజారింది. తండ్రీకొడుకు శిథిలావస్థలో ఉన్న భవనంలో నివసిస్తున్నారు. అదే వారి వంట గది. పడకగది, నివాస స్థలంగాకూడా ఉపయోగపడుతోంది. 'అయితే పుట్టుకతో అంధుడైన జపాభూయే, అతడి తల్లి రాధికాభూయే జీవనోపాధి, గౌరవ ప్రదమైన జీవితం గురించి మేం ఆందోళన చెందుతున్నాం. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ వారికి అన్ని ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాన్ని, దాని అధికారులను ఆదేశిస్తున్నాం' అని సుప్రీంకోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా ఒడిశా ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది తలి రాధికా భూయేకి వృద్ధాప్య పింఛన్, వైకల్య పింఛన్‌తో పాటు ఒక నివాస గృహాన్ని కూడాకేటాయించినట్లు సమాచారం అందిందని తెలిపారు.రాష్ట్ర సంక్షేమ పథకాలు, నిరుద్యోగులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందిస్తున్నాయా లేదా అనేదే కోర్టు దృష్టి సారించిన అంశమని ధర్మాసనం తెలిపింది.

## శత్రువు రాజకీయంగా ఓడిపోయాడు:హతామీ

### అంతర్జాతీయ వేదికపై ఇరాన్ బలంగా ఆవిర్భవించింది

**టెహ్రాన్:**తమ శత్రువులకు సాహసం లేదని ఇరాన్ సైన్యాధిపతి, మేజర్ జనరల్ అమీర్ హతామీ వ్యాఖ్యానించారు. గత ఏడాది, ఈ ఏడాద జరిగిన యుద్ధంలో శత్రువు రాజకీయంగా,వ్యూహాత్మకంగా ఓటమిపాలు కాగా, ఇరాన్ దేశం మాత్రం అంతర్జాతీయ వేదికపై మరింత బలంగా ఆవిర్భవించిందని అన్నారు. ఈ రెండు యుద్ధాలలోనూ ఇరాన్ ఒక్క అంగుళం భూభాగాన్ని కూడా కోల్పోలేదని చెప్పారు. టెహ్రాన్‌లోని ఇమామ్ అలీ ఆఫీసర్స్ అకాడమీ కార్యాలయంలో, అమరవీరుల కుటుంబాలనుగౌరవించే ఒక కార్యక్రమంలో మంగళవారం హతామీ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన రెండు యుద్ధాలలోనూ శత్రుదేశాలకు ఇరాన్ సముద్రతీర ప్రాంతాలను సమీపించే సాహసం చేయలేదని అన్నారు.దేశ సరిహద్దులను సమర్థవంతంగా రక్షించిన వైమానిక,నౌకా దళాలను ఆయన ప్రశంసించారు.ఈ రెండు యుద్ధాలలో ఇరాన్ ఆత్మరక్షణ పోరాటం చేసిందని, ఈ యద్ధాలలో నష్టపడినప్పటికీ, గొప్ప శక్తిమంతంగా దేశాన్ని రక్షించుకున్నామని, శత్రు దురాక్రమణ నుండి దేశాన్ని కాపాడామని చెప్పారు. దేశాన్ని రక్షించుకునేందుకు చర్చలు జరుగుతున్న సమయంలో చర్చలుపూర్తికాకుండానే రెండు సార్లు మోసపూరితంగా ఇరాన్‌పై శత్రువులు దాడి చేశారని అన్నారు. గత ఏడాది జూన్ 13న ప్రారంభమైన యుద్ధం 12 రోజులు జరిగిందని, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం 40 రోజులపాటు జరిగిందని, ఈ రెండు సందర్భాలలోనూ ఇరాన్ సాయుధబలగాలు శక్తిమంతంగా పోరాటం చేసి శత్రువులు శాంతి ఒప్పందం చేసుకోవడానికి మనదేశంపైనే ఒత్తిడి తెచ్చేలా చేయగలిగామని అన్నారు. ఇరాన్‌ను లొంగదీసుకోవడం, ఇరాన్‌లో ప్రభుత్వాన్నికూల్చివేయడం అనే శత్రువు నిర్దేశించుకున్న రెండు లక్ష్యాలు కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యాయని, వారి లక్ష్యాలు విఫలమయ్యాయని హతామీ విమర్శించారు.


## రేప్ కేసులో నార్వే యువరాజుకు నాలుగేళ్ళశిక్ష



**ఓస్లో:**ఉత్తర యూరప్ ప్రాంత దేశం నార్వేలో యువరాజు అత్యాచారం కేసులో దోషిగా తేలాడు. దీంతో దేశ యువరాజుకు న్యాయస్థానం నాలుగు సంవత్సరాలు కారాగారశిక్ష విధించింది. నార్వే యువరాణి మెట్టే–మారిట్ కుమారుడు మారియస్ బోర్గ్ హోయ్‌బిని (29) సకల అవలక్షణాలకు నిలయంగా మారాడు. జూదం, మాదక ద్రవ్యాల వినియోగం, మద్యపానం, లైంగిక అత్యాచారాలు అన్నిటిలో ఉన్నాడు. ఆయనపై మొత్తం 40 ఆరోపణలపై విచారణ జరిగింది. ఆరువారాలపాటు కేసు విచారణ తర్వాత న్యాయస్థానం రెండు అత్యాచారాల కేసులలో భోయిబినినీ సోమవారంనాడు నిందితుడుగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసింది. మాజీ ప్రియురాలు నోరా హోక్‌లాండ్‌పై దాడి చేయడం,బెదిరింపులకు పాల్పడటం, పదే పదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి నేరాలకుగాను హోయిబినినీ ఓస్లో కోర్టు దోషిగా ప్రకటించింది. ఐతే మరో రెండు అత్యాచారాల కేసుల నుండి మాత్రం ఆయనను విముక్తి చేసింది. 2018–2024 మధ్యకాలంలో నిద్రిస్తున్న లేదా ప్రతిఘటించడానికి అశక్తులైన నలుగురు మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డాడని హోయిబినిపై నేరాభియోగాలు చేశారు. అతడికి నాలుగేళ్ళ వయసులో ఉన్నప్పుడు అతడి తల్లి మెట్టే మారియట్ 2001లో నార్వే యువరాజును వివాహం చేసుకుంది. హోయ్‌బినికి యువరాజు హోదా లేనప్పటికీ అలా పిలుస్తారు. రాజకుటుంబంతో అతడికి ఈ రూపేణా సన్నిహిత సంబంధం మాత్రమే ఉంది.

# ఇకమీదట లెబనాన్‌పై దాడి ఒప్పంద ఉల్లంఘనే

ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాఘ్చి
ఇజ్రాయెల్ వైదొలగకపోతే యుద్ధం ముగిసినట్లుకాదు
శుక్రవారమే మలి విడత చర్చలు ప్రారంభం



**టెహ్రాన్:** అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినందువల్ల కీలక సమస్యలపై మలివిడత చర్చలు శుక్రవారం (జూన్ 19) స్విట్జర్లాండ్ నగరం జెనీవాలో ప్రారంభమవుతాయని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. అమెరికాతో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం, ఇకమీదట ఇజ్రాయెల్ గనుక లెబనాన్‌లో ఎలాంటి దాడులు చేసిననా లేదా లెబనాన్ భూభాగాలలో ఇజ్రాయెల్ సైన్యాలు తిష్టవేసి కూర్చున్నాగానీ అది ఒప్పందం ఉల్లంఘన కిందకే వస్తుందని కూడా హెచ్చరిక చేశా రు. లెబనాన్‌లో ఆక్రమించుకున్న భూభాగాల నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగకపోతే యుద్ధం ముగిసినట్లు కాదని కూడా అబ్బాస్ అరాఘ్చి తేల్చి చెప్పారు. లెబనాన్‌పై తదుపరి దాడులను అవగాహన ఒప్పందం ఉల్లంఘనగా భావిస్తామని చెప్పారు. మా దృష్టిలో ఈ ఒప్పంద పత్రం ప్రకారం ఒకవైపు పక్షంలో అమెరికా–ఇజ్రాయెల్ ఉంటే, మరోవైపు పక్షంలో ఇరాన్–హెజ్బొల్లాలు ఉన్నాయని అరాఘ్చి చాలా స్పష్టంగా వెల్లడించారు. ఇరాన్ శాంతి ఒప్పంద పత్రంలో అన్నింటికంటే ముఖ్యాంశం లెబనాన్ లో కాల్పుల విరమణ అంశమేనని, అక్కడ యుద్ధం ఆగిపోవడం,శాంతిస్థాపనే ముఖ్యాంశమని అన్నారు. లెబనాన్‌పై మార్చి రెండో తేదీన ఇజ్రాయెల్ సైన్యాలు దాడులు ప్రారంభించాయి. అ దేశంలోకి ప్రవేశించాయి. హెజ్బొల్లా సైనికులతోపాటు ఈనాటివరకు 3,700 మంది లెబనాన్‌లో మరణించారు. అనేక లక్షలమంది ప్రజలు గ్రామాలు,పట్టణాలు వదిలివెళ్లిపోయి నిరాశ్రయులుగా మారారు. తమ బలగాలు దక్షిణ లెబనాన్‌లోనే ఉంటాయని, రక్షణ జోన్‌లోనుండి కదిలేది లేదని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ సోమవారం ప్రకటించిన తర్వాత అబ్బాస్ పైవిధంగా స్పందించారు. ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య జరుగుతున్న దాడులు కూడా ఉండకూడదని, లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం అమలు కూడా ఈ పరిధిలోకే వస్తుందని పలువురు చెబుతుండగా, ప్రత్యేకించి పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా తొలుత ఒక ప్రకటన చేస్తూ, అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం, లెబనాన్ సహా అన్ని రంగాలలోనూ, ప్రతిచోటా యుద్ధం ఆగిపోతుందన్నారు.

## యుద్ధంతో అప్రదిష్టపాలైన అమెరికా : ఖానీ



**టెహ్రాన్:**పశ్చిమాసియాలో 107 రోజులు చేసిన యుద్ధంతో అమెరికా అప్రదిష్టపాలైందని ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇస్మాయెల్ ఖానీ అన్నారు. ఈ యుద్ధంలో ఇరాన్ మిత్రులు ఎవరి ఆధారంలేకుండా శత్రువే శాలపై స్వతంత్ర పోరాటం చేశారని ప్రశంసించారు. ఆయన చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖబర్ నెట్‌వర్క్ ప్రసారం చేసింది. యుద్ధ సమయంలో బలగాల ప్రతిఘటనతో శత్రువు అందోళన సుడిగుండంలో పడిపోయేట్లుగా చేసిందని కొనియాడారు. అంతర్జాతీయస్థాయిలో శత్రువు అప్రదిష్టపాలయ్యాడని అన్నారు. ఈ యుద్ధంలో హెజ్బొల్లాసైన్యం ఇరాన్‌కు అండగా నిలబడిందని, లెబనాన్ సమూహాన్ని ఒంటరి చేసే సామర్థ్యం అమెరికాకు గానీ, ఇజ్రాయెల్‌కు గానీ లేదని ఆయన హెచ్చరించారు. హెజ్బొల్లాకు ఎవరూ ఎదురు నిలబడలేరని అన్నారు. గాజాలో యుద్ధం కొనసాగుతున్నప్పటికీ, ఆ దేశాన్ని పునర్నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేశారు. బాబ్–అల్–మందబ్ జలసంధి కూడా ఇరాన్‌కు ఒక విజయస్థంగా ఉందని, అవసరమైతే మరిన్ని శక్తిసామర్థ్యాలను దేశం బయటపెడుతుందని అన్నారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ సంప్రదింపుల బృందం చర్చల సందర్భంగా మధ్యవర్తులతో చాలా సమర్థవంతంగా,బలంగా వ్యవహరించిందని కొనియాడారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో బంగ్లామంత్రికి గౌరవ భంగం

- నిరసనగా ఢాకా తిరిగి వెళ్ళిపోయిన జాహెద్ రెహమాన్
- ఇది హసీనా ప్రభుత్వం కాదు
- భవిష్యత్ సంబంధాలపై తీవ్ర ప్రభావం పడుతుంది
- మీడియా సమావేశంలో తీవ్ర వ్యాఖ్య

**ఢాకా:** బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా వెళ్ళిన తనకు న్యూఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన అగౌరవాన్ని భరించలేక అక్కడ జరిగే సమావేశంలో పాల్గొనకుండా తిరిగి వచ్చేశానని బంగ్లాదేశ్ ప్రధానమంత్రి సమాచార–ప్రసారాల విభాగం సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ చెప్పారు. ''ఒక వ్యక్తిగా నేను ఢిల్లీకి వెళ్ళలేదు,ప్రధానమంత్రికి సలహాదారుడు హోదాలో ఒక దేశ ప్రభుత్వ ప్రతినిధిగా వెళ్ళా, అందుకే అగౌరవానికి నిరసన తెలియజేయడంకోసం ఢాకా తిరిగి వచ్చేశా,ఇది షేక్ హసీనా ప్రభుత్వం కాదు, ప్రజలకోసం ఎన్నుకున్న ప్రభుత్వం,దేశం వెలుపల ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ సందేశం చేరాలని నేను కోరుకుంటున్నా, ఇక ఈ విషయాలన్నీ విదేశీమంత్రిత్వ శాఖ చూసుకుంటుంది'' అని చెప్పారు. పత్రికాకథనాలలో చెప్పినవన్నీ పొల్లుపోకుండా జరిగాయని, ఆ కథనాల్లో ఎలాంటి అసత్యాలు లేవని అన్నారు. హైకమిషన్ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపింది, చేయాల్సినవన్నీ చేస్తోంది,ప్రభుత్వం ఎలా స్పందించాలో వారే నిర్ణయిస్తారు, మా వైపు నుండి ఎలాంటి నిర్ణయాలు ఉంటాయి, ఎలా



స్పందిస్తారు అనేది నేను మాట్లాడదలచుకోలేదు అన్నారు. భవిష్యత్ సంబంధాలపై ఈ ఘటన ప్రభావం పడుతుందని తాను భావిస్తున్నానని, ఈ సంబంధాలు ఎప్పటికీ దెబ్బతినకుండా చూసుకోవాలని అన్నారు. నిర్ణీత ప్రకారం ఢిల్లీలో జరిగే ఐఓఆర్ఎ(ఇండియా ఓషన్ రిమ్ అసోసియేషన్) 28వ విడత సమావేశంలో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం రెహ్మాన్ తన నాయకత్వంలో ఒక బృందాన్ని తీసుకుని ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద అధికారులు ఎలాంటి సమాచారం చెప్పకుండా ఆయనను ఆపేశారు. ఎందుకు ఆపేశారని అడిగినప్పుడు ''అంతా సవ్యంగా ఉంది, కానీ కొన్ని వివరాలు తెలుసుకుంటున్నాం'' అని చెప్పి అధికారులు అక్కడే ఒక సోఫాలో ఆయనను కూర్చోబెట్టారు. ఒక దేశ మంత్రి హోదా ఉన్నప్పటికీ ఇతర ప్రయాణికులతో కలిసి రెండు గంటలసేపు సోఫాలో కూర్చుని ఆయన ఎదురుచూశారు. ఈ తర్వాత భద్రతా సిబ్బంది వెళ్ళి, ''అంతా సవ్యంగా ఉంది, మీరు వెళ్ళవచ్చు'' అని చెప్పారు. కానీ ఆయన మాత్రం నిరసనగా ఢాకా తిరిగి వెళ్ళిపోయారు. భారత్‌పై సంఘర్షణాత్మక వ్యాఖ్యలు చేసిన చరిత్రగల రెహమాన్‌పై తనిఖీల నిమిత్తం ఆపేసినట్లు ప్రముఖ దినపత్రికలు వార్తలు ప్రచురించాయి. జావేద్ రెహమాన్ అనేక సంవత్సరాలుగా యూట్యూబ్‌లో భారత్ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.భారత్ వ్యతిరేక విమర్శలు చేస్తున్నారు. ఈ విషయాలపై ఆయనకు వ్యతిరేకంగా వ్రాసి ఉన్న 10 పేజీల నివేదికను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆయనను సోఫాలో కూర్చోబెట్టిన తర్వాత అధ్యయనం చేశారు. ఆయన గత చరిత్ర పూర్తిగా భారత్ వ్యతిరేక ద్వేషంతో ఉన్నప్పటికీ ప్రభుత్వ ప్రతినిధిగా మొదటిసారి అయనను అనుమతించాలని నిర్ణయించుకుని అనుమతి మంజూరు చేశారు. కానీ ఆయన నిరసన వ్యక్తం చేసి తిరిగి ఢాకా వెళ్ళిపోయారు. మంగళవారం ఉదయం ఆయన ఢాకాలోని ప్రభుత్వ సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి జరిగిన సంఘటన వివరాలు తెలియజేశారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌లో తనకు ఎదురైన అగౌరవపూర్వక ప్రవర్తనకు నిరసన తెలియజేయడం కోసమే ఢాకా తిరిగి వచ్చేశానని చెప్పారు. ఐతే ప్రభుత్వ కార్యక్రమాల గురించి చెప్పడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశానని అన్నారు. ఢిల్లీ ఘటనపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం చెప్పానన్నారు.

## ఇరాన్ రక్షణలో మొజ్తాబా కీలకపాత్ర పెజెష్కియన్ ప్రశంస



టెహ్రాన్: అమెరికాతో కుదిరిన ఒప్పందంలో ఇరాన్ దేశ ప్రజల ప్రయోజనాలు కాపాడటంలో సుప్రీం అధినేత ఆయతొల్లా సయ్యద్ మొజ్తాబా అలీ ఖమేనీ కీలకపాత్ర పోషించారని దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ప్రశంసించారు. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించే నిబంధనలను ఒప్పందంలో చేర్చడంలో మొజ్తాబా ముఖ్యపాత్ర వహించారని ఎక్స్ వేదికగా మంగళవారం పోస్టింగ్ పెట్టారు.ఇరానియన్ ప్రజల హక్కులను గౌరవించే విషయంలో, అమెరికా నిజాయతీని పరీక్షించేందుకు మార్గదర్శకత్వం వహించారని, సమగ్ర చర్చల అనంతరం ఐఆర్‌జిసి సభ్యులు అత్యధికులు కూడా ఈ ముసాయిదా ఒప్పందాన్ని అంగీకరించారని పేర్కొన్నారు.

## అణ్వాయుధం ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

మూడోవారంలో బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 70 డాలర్లుగా ఉండేది. ఇదిలా ఉండగా, జెనీవాలో సంతకాలు జరగకముందుగానే శుక్రవారంలోపు అమెరికా–ఇరాన్ మధ్య జరిగిన తాత్కాలిక ఒప్పందం తాలూకూ పూర్తిపాఠాన్ని డోనాల్డ్ ట్రంప్ విడుదల చేసే అవకాశం ఉంది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఈ విషయం చెప్పారు.ఈ ఒప్పందంపై ఇరుపక్షాలు సోమవారంనాడు ఎలక్ట్రానిక్ పద్ధతిలో సంతకాలు చేశాయని, జెనీవాలో శుక్రవారంనాడు పత్రాలను ఇచ్చిపుచ్చుకునే అధికారిక కార్యక్రమం జరుగుతుదని అమెరికా అధికారులు చెప్పారు. ఒప్పంద నిబంధనలు ఏమిటో, అందులో ఏముందో తెలియక ప్రపంచవ్యాప్తంగా అనేకమంది నాయకులు,కీలకవ్యక్తులు,ప్రముఖులు,మేధావులు,విశ్లేషకులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్న తరుణంలో వాన్స్ ఈ ప్రకటన చేశారు.ఈ ఒప్పంద పూర్తిపాఠం బయటకువస్తే ట్రంప్ ప్రకటనల గుట్టు, ఆయన గాంభీర్యం, ఇరాన్ ధైర్యం వెనుక ఉన్న రహస్యం వంటి అనేక అంశాలు లోతైన విశ్లేషణల ద్వారా బయటపడతాయి.

## ఎసిబి దాడులు (మొదటి పేజీ తరువాయి)

బంధువులు, బినామీలు, సన్నిహితులకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో రంగారెడ్డి జిల్లాలో ఐదు ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరం వద్ద 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లాట్, నర్సింగిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్‌కు సంబంధించిన పత్రాలు లభించాయి. అదనంగా గచ్చిబౌలిలో జీ ప్లస్3 భవనం, చత్రినాకలో జీ ప్లస్ 2 భవనాన్ని కూడా అధికారులు గుర్తించారు. ఇక నరహరి రావు నివాసంలో రూ.1.54 కోట్ల నగదు, రూ.2.29 కోట్ల బ్యాంకు నిల్వలు, రూ.5.04 కోట్ల ఫిక్స్‌డ డిపాజిట్లు, సుమారు 1.3 కిలోల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య పేరిట ఉన్న రెండు లాకర్లను కూడా గుర్తించిన అధికారులు, దర్యాప్తు ప్రక్రియలో వాటిని తెరవనున్నట్లు తెలిపారు. ఒక కియా కేరెన్స్ కారును కూడా గుర్తించారు. సోదాల్లో ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.13.05 కోట్లుగా అంచనా వేస్తున్నప్పటికీ, మార్కెట్ విలువ ఇందుకు పలుమార్లు అధికంగా ఉండే అవకాశముందని ఎసిబి అధికారులు వెల్లడించారు. మరిన్ని ఆస్తులపై విచారణ కొనసాగుతోందని, నిందిత అధికారిని నాంపల్లి ప్రత్యేక ఎసిబి కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమాస్తుల వ్యవహారంలో ఇంకా మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముండటంతో ఈ కేసు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## నిర్దిష్ట కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు.

**కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీ**

రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి అదేశించారు. ''వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ ఎండి, ప్రణాళికా విభాగం కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతులు, పంటల వివరాల నమోదు, రికార్డులు, పంట ఉత్పత్తుల అంచనాలు, ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుంది. ఏ రైతు ఏ పంట వేశాడు, ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలి'' అని సిఎం చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని, రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించాలని, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని ఆదేశించారు.

**రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా రైతు వేదికలు**

రైతు వేదికలను ఇకపై రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకుని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రతి రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలి. జిల్లాల్లో వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలి' అని సిఎం ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఎఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేసి వ్యవసాయ శాఖలలో ఎఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సిఎం ఆదేశించారు. యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని, యూరియా పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలన్నారు.

**అవసరమైన యూరియా కోసం కేంద్రానికి లేఖలు రాయాలి**

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సిఎం సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలో ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపిలతో సమావేశం నిర్వహించి వాస్తవ పరిస్థితిని వివరించాలని సూచించారు. అవసరమైతే మంత్రులు, ఎంపిల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సిఎం చెప్పారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సిఎం సంబంధిత అధికారులకు సూచించారు. వ్యాపారులకు తలొగ్గకుండా ఈ సారి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిన కారణంగా మొక్కజొన్న కొనుగోళ్లతో వచ్చే నష్టం తగ్గించగలిగామన్నారు. గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని, ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల దిశలో నడిపించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

## కేంద్రం విశ్వ ప్రయత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

జానకిరామ్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్, సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, పి.ప్రేమ్ పావని తదితరులు పాల్గొన్నారు. సభలో రమణ మాట్లాడుతూ రాంబాబు మానస పుత్రిక యుఎఫ్‌పిఎస్‌యు అని అన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న కార్మిక సంఘాలకు యుఎఫ్‌పిఎస్‌యు అండగా నిలుస్తుందన్నారు. జానకిరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమం కోసం రాంబాబు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం కోసం బి.ఎస్.రాంబాబు ఎన్నో సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్నారని, ఆయన నాయకత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రేమ్ పావని మాట్లాడుతూ దేశ ఆర్థిక రంగంలో కీలకంగా పనిచేస్తున్న ఎఐబిఇఎ అధ్యక్షులుగా రాంబాబు ఎన్నిక కావడం మనందరికీ గర్వకరణామన్నారు. ఎఐబిఇఎ అధ్యక్షులు బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే ఏర్పాటైన ఎఐబిఇఎ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల సమస్యలపై కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా విశేషంగా కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులు అదాని, అంబానిలకు కట్టబెట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుందని పేర్కొన్నారు. నేటి కాలంలో ప్రభుత్వం నుంచే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన పరిస్థితి రావడం మన దౌర్భాగ్యమన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు భారతదేశం అప్పు రూ.58 లక్షల కోట్లు ఉండగా, నేడు రూ.244 లక్షల కోట్లకు చేరిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగికి అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఐబిఇఎ నా యకులు పి.వి.కృష్ణారావు, ఉదయ్ కుమార్, నల్లప రెడ్డి, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహేష్ కుమార్, పోస్టల్ యూనియన్ నాయకులు జలాలుద్దీన్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి పాల్గొన్నారు.

## అడ్డు కోలేదు

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్‌లో బిల్లు పాసైన తర్వాతే దీక్ష విరమించానని తెలిపారు. తెలంగాణకు ఒక్క రూపాయి వచ్చినా సంతోషించే మొదటి వ్యక్తిని తానేనని, ప్రాజెక్టులను అడ్డుకునే సంస్కృతి కాంగ్రెస్‌దే తప్ప బిజె పిది కాదన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి తగదన్నారు.

**రేవంత్ సర్టిఫికెట్లు మాకు అవసరం లేదు**

'నాకు, ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి సిఎం రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ పార్టీ సర్టిఫికెట్లు అవసరం లేదు. నేను రేవంత్ రెడ్డికి కాదు, తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా ఉంటాను. తెలంగాణ విషయంలో, అభివృద్ధి విషయంలో మాకు ఎవరి పాఠాలు, సూచనలు అక్కర్లేదు' అని కిషన్ రెడ్డి అన్నారు. తాను కేంద్రమంత్రులను కలిసి తెలంగాణకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నట్లు సిఎం చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. కేంద్రమంత్రి ఖట్టర్‌ని కలిసిన ప్రతిసారీ ఆ వివరాలను సోషల్ మీడియాలో పారదర్శకంగా పెట్టానని, తన షెడ్యూల్‌ను సిఎం తనకు గుర్తుచేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో కెసిఆర్ మెట్రో అలైన్‌మెంట్ మార్పు పేరుతో మూడేళ్లు కాలయాపన చేశారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో సమావేశానికి ఎప్పుడు వచ్చినా, తానే స్వయంగా భేషజాలు లేకుండా కలిసి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని కిషన్ రెడ్డి ప్రకటించారు.

**మెట్రో ఫేజ్–2కు కేంద్రం సిద్ధం**

హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టును 50:50 నిష్పత్తిలో ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. గతంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి తమతో పాటు ముఖ్యమంత్రి కలిసినప్పుడు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేశారన్నారు. మెట్రో ఫేజ్ 1కు కేంద్రం రూ.1,250 కోట్లు ఇచ్చిందని, ప్రధాని మోదీ స్వయంగా దాన్ని ప్రారంభించారన్నారు. దేశంలోని ఇతర నగరాల మాదిరిగానే హైదరాబాద్‌కు కూడా సాంకేతిక, ఆర్థిక పరమైన అంశాలను చర్చించి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. మెట్రో ఫేజ్2 పనులను వేగవంతం చేయాలని తానే స్వయంగా జనవరి 15న ముఖ్యమంత్రికి లేఖ రాశానని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఐఆర్ఎఫ్‌సి లోన్‌లకు సంబంధించి తాను ఎప్పుడూ మాట్లాడలేదని, అది రాష్ట్ర ప్రభుత్వానికి, ఐఆర్ఎఫ్‌సికి మధ్య జరిగిన రూ.13,500 కోట్ల ఒప్పందమన్నారు. మెట్రో ద్వారా వచ్చే టికెట్లు, ప్రకటనల ఆదాయం నుండి ముందుగా అప్పు చెల్లించేలా సిఎం ఒప్పందం కుదుర్చుకున్నారని, దీనిపై కేంద్రం కొన్ని సూచనలు చేసిందన్నారు.

## ఏది ప్రత్యామ్నాయం

(మొదటి పేజీ తరువాయి)

సాధిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండవ పంటగా సాగు చేస్తున్న వాటిలో మొక్కజొన్న తప్ప మిగిలిన ఏ పంట దిగుబడి ఆశాజనకంగా లేదు. ఇప్పుడు మొక్కజొన్న కాకుండా అంటే రైతులు ఇబ్బంది పడవల్సిందే.

**కలిసి రాని అపరాల సాగు :**

రైతులు సాంప్రదాయ పంటలైన పెసర, మినుము, కంది మొదలైన పంటలను సాగు చేయడం మానేశారు.రాను రాను వీటి సాగు శాతం గణనీయంగా తగ్గిపోతుంది. పెసర, మినుము పంటలను వర్షాకాలంలో సాగు చేస్తే అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా దిగుబడి రావడం లేదు. గతేడాది పెసర, మినుము సాగు చేసిన రైతులకు విత్తనం కూడా తిరిగి రాలేదంటే అతిశయోక్తి కాదు. అందుకే అపరాల సాగు పట్ల ఆసక్తి కనబర్చడం లేదు. కంది పునాస పంట. స్వల్పకాలిక రకాలు కందులలో వచ్చిన రెండవ పంట సాగు చేయాలనుకునే వారు కందిపట్ల మొగ్గు చూపడం లేదు. దీనికి తోడు తెగుళ్లు ముఖ్యంగా వైరస్ అపరాల సాగుకు అవరోదంగా మారింది.

**వద్దన్న పంటలతోనే లాభాలు :**

ఎందుకో తెలియదు కానీ గడిచిన పదేళ్లలో శాస్త్రవేత్తలు, అధికారులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో ఏ పంట సాగు చేయవద్దని చెబుతారో ఆ పంటే అధిక దిగుబడివచ్చిరైతులు లాభసాటి సాగుగా మారుతుంది. అధికారులు సూచించిన పంటలు సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు. కారణాలు, దిగుబడులు పక్కనపెడితే వ్యవసాయ రంగంలో ఆధునీకత అవసరమే. వర్షాపాతానికి అనుగుణంగా పంటలు సాగు చేయాల్సి ఉంది. వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి మొదలైన పంటలకు ప్రత్యామ్నాయం ఎన్నుకోవడం రైతులకు కష్టమే. ఉద్యానవన పంటలకు సంబంధించి ఇప్పటి వరకు రైతులకు ఇబ్బంది లేదు. మామిడి, పామాయిల్, నిమ్మ, జామా, ఇతర పండ్ల తోటల సాగు పట్ల రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులను మరింత చైతన్యపర్చడం, రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడటంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే చేనుకు చేవ రైతుకు రొక్కం చేకూరుతాయి.

**ఆలస్యమవుతున్న ఖరీఫ్ :**

ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యమవుతుంది. జూన్ మూడవ వారంలోకి వచ్చిన ఇంత వరకు సరైన వర్షం కురవ లేదు. రైతులు దుక్కులు సిద్దం చేసి విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. పొడిలో విత్తితే మొలక రాదన్న అభిప్రాయంతో సిద్దం చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే సూచనలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచార నేపథ్యంలో రైతులు ఆలోచనలో పడ్డారు. చినుకు ఆలస్యమయ్యే కొద్ది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సిరియా పోరాడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాద సైనికులు,వారి నాయకులను వెతికి పట్టుకోవాలంటే సామాన్య ప్రజలను చంపాల్సిన అవసరం లేదని అన్నారు. హెజ్బొల్లా నాయకులను వెతికి పట్టుకోవాలంటే సామాన్య ప్రజలను చంపాల్సిన అవసరం లేదని విమర్శించారు. వారు పోరాటం చేసే విధానం తప్పు, కొంతమంది హెజ్బొల్లా నాయకులు ఉన్నారని అనుమానించి దాడి చేసినప్పుడు ఆ మొత్తం నివాసిత ప్రాంతాన్ని నాశనం చేయాల్సిన అవసరం లేదు, ఈ విధమైన దాడులవల్ల ఈ యుద్ధంతో, ఈ విషయంతో సంబంధం లేని ఎంతోమంది సామాన్య ప్రజలు మరణిస్తున్నారు''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ''చాలా కాలంలో హెజ్బొల్లాతో ఇజ్రాయెల్ పోరాటం చేస్తోంది,హెజ్బొల్లాను వెతికి పట్టుకోవాలనుకున్న ప్రతిసారీ అపార్ట్‌మెంటులను కూల్చివేయాల్సిన అవసరం లేదు, ఈ అపార్ట్‌మెంట్లలో సామాన్య ప్రజలు ఉంటారు, వారంతా హెజ్బొల్లా సభ్యులు కాదు, ఇలా చాలామంది సంబంధంలేని సామాన్యులు ఈ పోరాటంలో చనిపోతున్నారు, ఈ విషయం నేను ఖచ్చితంగా చెప్పగలను, ఇరాన్ మద్దతుగల ఈ ఉగ్రవాద సంస్థపై పోరాట బాధ్యతను ఇకమీదట సిరియా చేపట్టాలి'' అని సూచించారు. అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందంపై అంగీకారం కుదరడానికి రెండు గంటల ముందు ఆదివారంనాడు బీరూట్‌లో ఇజ్రాయెల్ దళాలు చేసిన దాడులను మరోసారి ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. ఈ దాడులు జరగడం తనకు నచ్చలేదని అన్నారు. ఈ దాడులు జరగకుండా ఉంటే ఈపాటికి ఒప్పందం కుదిరి ఉండేదని ఇరాన్ సమ్మతించడానికి కొద్దిసేపటి ముందు ట్రంప్ వ్యాఖ్యానించగా, దక్షిణ లెబనాన్ నుండి తమ దళాలు బయటకు కదలివెళ్ళే ప్రసక్తేలేదని,ఒకవేళ హెజ్బొల్లా దళాలు దాడులు చేస్తే చాలా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఆ తర్వాత ఆయన సదస్సు సందర్భంగా ఎవియాన్–లెస్–బైన్స్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, అమెరికా లేకపోతే ఇజ్రాయెల్ ఉండేది కాదని అన్నారు. మేం కాపపాడుతూ వచ్చామని, లేకపోతే రాజధాని టెల్‌అవీవ్ ఏనాడో బాంబుదాడులతో పేలిపోయి ఉండేదని అన్నారు.లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని ''ఒక చిన్నయుద్ధం''గా పేర్కొన్నారు. హెజ్బొల్లాను నిరంతరం తలెత్తిచూసే ఒక చిన్న సూదిమొనగా అభివర్ణించారు. అది ఎప్పుడూ అందరినీ గుచ్చి బాధపెడుతూనే ఉంటుందన్నారు. బీరూట్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసినాగానీ ఇరాన్‌తో అమెరికా చేసుకున్న శాంతి ఒప్పందం నిలబడుతుందని అన్నారు. లెబనాన్,హెజ్బొల్లా విషయంలో ఇజ్రాయెల్ అనుసరించిన తీరుపట్ల తాను ఎంతమాత్రం సంతోషంగా లేనని అన్నారు.

# స్పెయిన్‌ను వణికించి ఒక్క మ్యాచ్‌తో ఓవర్‌నైట్ స్టార్

ఫిఫా ప్రపంచకప్‌లో ఎవరూ ఊహించని ఒక అద్భుతం జరిగింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లోనే అత్యంత బలమైన జట్లలో ఒకటైన మాజీ ఛాంపియన్ స్పెయిన్‌ను, టోర్నీలోకి అనామక జట్టుగా అడుగుపెట్టిన చిన్న దేశం కేప్ వర్డే 0–0 తో నిలువరించి అందరిని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది. వరల్డ్ నెం 2 ర్యాంక్ ఉన్న దేశంతో మ్యాచ్ ఆడుతున్నాం అన్న భయం లేకుండా స్పానిష్ జట్టుకు చుక్కలు చూపించింది. అయితే ఈ చారిత్రాత్మక డ్రా వెనుక ఆ జట్టులో 40 ఏళ్ల వెటరన్ గోల్ కీపర్ వోజిన్హా (జోసిమార్ జోస్ ఎవోరా డయాస్) చూపిన అసాధారణ పోరాట పటిమ ఉంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు కేవలం 50 వేల మంది ఇన్స్టాగ్రామ్ ఫాలోవర్లు మాత్రమే ఉన్న వోజిన్హా ఖాతాకు, మ్యాచ్ ముగిసిన 24 గంటల్లోనే ఏకంగా 6 మిలియన్ల (60 లక్షల) మంది కొత్త అభిమానులు వచ్చి చేరారంటే అతడు ఏ రేంజ్‌లో జట్టును ఆదుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. కేప్ వర్డే దేశ మొత్తం జనాభా సుమారు 5.3 లక్షలు మాత్రమే కాగా, ఆ దేశ జనాభా కంటే పది రెట్లకు పైగా ఫాలోవర్లను సంపాదించుకుని అతను రాత్రికి రాత్రి గ్లోబల్ సోషల్ మీడియా స్టార్‌గా అవతరించాడు. ఇక ఈ మ్యాచ్‌లో స్పెయిన్ జట్టు పూర్తి ఆధిపత్యం చలాయిస్తూ ఏకంగా 27 సార్లు కేప్ వర్డే గోల్ పోస్ట్‌లపై దాడులు చేసింది. అయితే ప్రపంచ స్థాయి స్టార్ ఆటగాళ్లు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను వోజిన్హా గోడలా అడ్డుకున్నాడు. ముఖ్యంగా మ్యాచ్ చివరి నిమిషాల్లో ఫెర్రాన్ టోరెస్, ఐమెరిక్ లాపోర్టేలు చేసిన గోల్ ప్రయత్నాలను అతను ఒంటిచేత్తో తిప్పికొట్టిన తీరు అభిమానులను ఫిదా చేసింది. మొత్తం 8 అద్భుతమైన సేవ్‌లతో స్పెయిన్కు చుక్కలు చూపించిన వోజిన్హా, ప్రపంచ కప్ అరంగేట్రం మ్యాచ్లో ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా రికార్డు సృష్టించిన అత్యంత వృద్ధ గోల్ కీపర్‌గా చరిత్రకెక్కాడు. అతని ఈ అసమాన ప్రదర్శనకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు మ్యాచ్ ముగిసిన వెంటనే వోజిన్హా మైదానంలోనే మోకాళ్లపై కూలబడి ఎమోషనల్ అవుతూ కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు అందరినీ కదిలించాయి. తన కన్నీళ్ల వెనుక ఉన్న బాధను పంచుకుంటూ, తాను చిన్నప్పు డు తాతయ్య, అమ్మమ్మల వద్ద పెరిగానని, తన జీవితంలో సర్వస్వమైన వారు ఈ చారిత్రాత్మక క్షణాన్ని చూడటానికి ఇప్పుడు బతికి లేరని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, అమెరికా కఠినమైన వీసా నిబంధనలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన తల్లి కూడా ఈ మ్యాచ్ను ప్రత్యక్షంగా చూడటానికి స్టేడియానికి రాలేకపోయిందని, తన జీవితకాల స్వప్నం నెరవేరిన వేళ వారు పక్కన లేకపోవడం బాధగా ఉన్నప్పటికీ, తన దేశానికి ఈ గౌరవం తెచ్చిపెట్టడం గర్వంగా ఉందంటూ భావోద్వేగానికి గురయ్యాడు.



## మకావు ఓపెన్‌లో రౌనక్ ముందంజ.. మెయిన్ డ్రాకు అర్హత




మకావు ఓపెన్‌లో భారత కుర్రాడు రౌనక్ చౌహన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో రాణించిన రౌనక్ క్వాలిఫికేషన్ మ్యాచ్‌లో చెలరేగాడు. కానీ, అనూహ్యంగా అతడి ప్రత్యర్థి హీన్ హుటుట్(మయన్మార్) రిటైరవ్వడంతో రౌనక్ ముందంజ వేశాడు. మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో రౌనత్ చౌహన్ ముందడుగు వేశాడు. మయన్మార్ షట్లర్ హీన్ హుటుట్తో తలపడిన రౌనక్ పట్టువదల్లేదు. ఇద్దరు చెరొక సెట్ గెలవడంతో మ్యాచ్ ఉత్కంఠ రేపింది. అయితే.. నిర్ణయాత్మక మూడో సెట్లో హీన్ రిటైర్డ్ అయ్యాడు. అప్పటికీ రౌనక్ స్కోర్ 19–17 ఉండడంతో అతడు మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. 32వ రౌండ్‌లో 133వ ర్యాంకర్ చైనీస్ తైపీకి చెందిన జే యింగ్ వూను రౌనక్ ఢీ కొట్టనున్నాడు.

## నేషన్స్ కప్ సెమీఫైనల్లో టీమిండియా

ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆక్లాండ్ వేదికగా మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్‌ను కాస్త కష్టపడి గెలిచిన టీమిండియా సెమీఫైనల్ చేరుకుంది. తద్వారా సలీమా టెటె సారథ్యంలోని భారత్ గ్రూప్ ఏ నుంచి సెమీస్ బెర్తు దక్కించుకుంది. న్యూజిలాండ్లోని ఆక్లాండ్లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్లో భారతజట్టు గొప్పగా ఆడుతోంది. జపాన్ రూపంలో క్వార్టర్ ఫైనల్లో కఠినమైన ప్రత్యర్థికి ఎదురైనప్పటికీ 2–1తో టీమిండియా గెలుపొందింది. కెప్టెన్ సలీమా టీటె, ఫార్వార్డ్ లల్రెమ్సియామి చెరొక గోల్ చేయడంతో జపాన్కు ఓటమి తప్పలేదు. మూడో అర్ధభాగంలో 33వ నిమిషంలో సలీమ, 49వ నిమిషంలో లల్రెస్మియామి గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 2–1కు చేరింది. తద్వారా ఆరు పాయింట్లో గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచిన టీమిండియా సెమీస్ బెర్తు పట్టేసింది. వచ్చే ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్‌కు టీమిండియా అర్హత సాధించింది.



## మహిళ

# సమానత్వం ఆమడ దూరం

ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కులు, లింగ సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి అంశాలపై గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, వారు ఇంకా అనేక చట్టపరమైన మరియు సామాజిక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ఇటీవల వెలువరించిన నివేదిక ఆందోళనకరమైన వాస్తవాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. సర్వే చేసిన దేశాల్లో సుమారు 47 శాతం దేశాలు ఇప్పటికీ మహిళలు పురుషులతో సమానమైన ఉద్యోగా ల్లో పనిచేయడాన్ని పరిమితం చేసే చట్టాలు లేదా నిబంధనలను కొనసాగిస్తున్నాయని ఐరాస పేర్కొంది. ఈ పరిస్థితి లింగ సమానత్వం సాధన లో ఇంకా ఎంత దూరం ప్రయాణించాల్సి ఉందో స్పష్టంగా తెలియజేస్తోంది. అనేక దేశాల్లో మహిళలు కొన్ని రంగాల్లో పనిచేయడానికి నిషేధాలు, సమయ పరిమితులు లేదా ప్రత్యేక అనుమతుల అవసరాలు వంటి చట్టపరమైన అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గనులు, నిర్మాణ రంగం, భారీ పరిశ్రమలు, రాత్రి పూట విధులు వంటి ఉద్యోగాల్లో మహిళల ప్రవేశంపై పరిమితులు అమలులో ఉన్నాయి. ఈ నిబంధనలు చాలా సార్లు మహిళల భద్రత పేరుతో రూపొందించబడినప్పటికీ, వాస్తవానికి అవి వారి ఆర్థిక అవకాశాలను తగ్గిస్తూ ఉపాధి స్వేచ్ఛను హరించే విధంగా పనిచేస్తున్నాయి. ఉద్యోగరంగంలో సమానఅవకాశాలు లేకపోవడం మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒక వ్యక్తి ఏ వృత్తిని ఎంచుకోవాలనే నిర్ణయం అతని లేదా ఆమె సామర్థ్యం, ఆసక్తి, నైపుణ్యాల ఆధారంగా ఉండాలి. కానీ, చట్టాలే మహిళలను కొన్ని ఉద్యోగాల నుంచి దూరంగా ఉంచితే, వారి ప్రతిభను పూర్తిగా వినియోగించుకునే అవకాశం తగ్గిపోతుంది. ఫలితంగా మహిళల ఆదాయం తగ్గడమే కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధి కూడా దెబ్బతింటుంది.ఐక్యరాజ్యసమితి అభిప్రాయం ప్రకారం, మహిళలు, పురుషులకు సమానమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడం కేవలం మానవ హక్కుల అంశం మాత్రమే కాదు.... అది స్థిరమైన అభివృద్ధికి కూడా కీలకమైన అవసరం. మహిళల శ్రామిక భాగస్వామ్యం పెరిగినప్పుడు కుటుంబాల ఆదాయం మెరుగుపడుతుంది, పేదరికం తగ్గుతుంది, పిల్లల విద్య మరియు ఆరోగ్య పరిస్థితులు కూడా మెరుగవుతాయి. అందువల్ల మహిళల ఉపాధి అవకాశాలను పరిమితం చేసే చట్టాలను తొలగించడం ద్వారా సమాజం మొత్తానికి ప్రయోజనం కలుగుతుంది. అయితే చట్టపరమైన పరిమితులే కాకుండా సామాజిక మూఢనమ్మకాలు, లింగ వివక్ష, అసమాన వేతనాలు, కుటుంబ బాధ్యతల భారమూ మహిళ ల పురోగతికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. చాలాచోట్ల మహిళలు ఒకే పని చేసినప్పటికీ పురుషుల కంటే తక్కువ వేతనం పొందుతున్నారు. అలాగే నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం కూడా ఇంకా తక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి దేశ ప్రభుత్వాలకు లింగ వివక్షను తొలగించే సంస్కరణలు చేపట్టాలని, మహిళలకు సమాన ఉపాధి హక్కులు కల్పించాలని పిలుపునిస్తోంది. చట్టపరమైన అడ్డంకులను తొలగించడం, సమాన వేతన విధానాలను అమలు చేయడం, సురక్షితమైన కార్యాలయ వాతావరణాన్ని కల్పించడం, మహిళల నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం వంటి చర్యలు అత్యవసరమని సూచిస్తోంది. ఏదిఏమైనా, ప్రపంచంలోని దాదాపు సగం దేశాల్లో మహిళలు ఇంకా పురుషులతో సమానమైన ఉద్యోగ అవకాశాలను పూర్తిగా పొందలేకపోవడం ఆందోళనకరమైన విషయం. నిజమైన లింగ సమానత్వం సాధించాలంటే చట్టాల్లోనే కాకుండా సమాజపు దృక్పథంలో కూడా మార్పు రావాలి.




## కలవరపెడుతున్న కొత్త ఆరోగ్య సమస్యలు

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా విడుదల చేసిన 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే6' (ఎన్ఎఫ్‌హెచ్ఎస్6) 2023–24నివేదిక భారత ఆరోగ్య రంగంలో గణనీయమైన పురోగతిని వెల్లడించింది. ముఖ్యంగా మాతాశిశు ఆరోగ్యం, పోషకాహారం, టీకాకరణ, కుటుంబ నియంత్రణ, మహిళా సాధికారత వంటి రంగాల్లో దేశం విశేషమైన అభివృద్ధిని సాధించినట్లు నివేదిక సూచిస్తోంది. అదే సమయంలో పెరుగుతున్న ఊబకాయం, అసంక్రమిత వ్యాధులు (ఎన్‌సిడిలు), అధిక సిజేరియన్ ప్రసవాలు, పిల్లల్లో కొనసాగుతున్న పోషకాహార లోపం వంటి కొత్త సవాళ్లను కూడా ఈ నివేదిక గుర్తించింది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్6లో అత్యంత ప్రాధాన్యత పొందిన అంశం 'ఆసుపత్రుల్లో ప్రసవాల పెరుగుదల'. ఎన్ఎఫ్‌హెచ్ఎస్5లో 88.6 శాతంగా ఉన్న ఆసుపత్రి ప్రసవాలు ప్రస్తుతం 90.6 శాతానికి చేరుకున్నాయి. ఇది సురక్షిత ప్రసవాల విషయంలో భారతదేశం సార్వత్రిక కవరేజీ దిశగా అడుగులు వేస్తోందని సూచిస్తోంది. అదేవిధంగా నైపుణ్యం కలిగిన ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ లో జరిగిన ప్రసవాలు 89.4 శాతం నుంచి 91.3 శాతానికి పెరిగాయి. ప్రసవం అనంతరం రెండు రోజులలోపు నవజాత శిశువులకు అందిన ఆరోగ్య సంరక్షణ 79.1 శాతం నుంచి 85.3 శాతానికి పెరగడం కూడా శుభపరిణామం. గర్భధారణ ప్రారంభ దశలోనే గర్భిణులు ఆరోగ్య పరీక్షలకు నమోదు కావడం 95.9 శాతానికి చేరుకుంది. మొదటి త్రైమాసికంలో ఎఎన్‌సి నమోదు70శాతం నుంచి 76.2 శాతానికి పెరిగింది. అలాగే గర్భిణులు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలను 100 రోజులకు పైగా తీసుకునే వారి శాతం 44.1 నుంచి 54.9 శాతానికి పెరిగింది. అయితే, ప్రసవానంతర సమస్యలు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. పిల్లల్లో పోషకాహార లోపం కొనసాగుతుండగా, మరోవైపు మహిళల్లో ఊబకాయం వేగంగా పెరుగుతోంది. పట్టణ మహిళల్లో ఇది 42.8శాతానికి చేరడం మరింత ఆందోళనకరం. ఊబకాయం పెరుగుదలతో పాటు మధుమేహం, రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్నాయి. అదేవిధంగా గర్భిణుల ఎఎన్‌సి నమోదు అధికంగా ఉన్నప్పటికీ, సిఫార్సు చేసిన కనీస నాలుగు ఆరోగ్య పరీక్షలను పూర్తి చేసే మహిళల సంఖ్య తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రక్తహీనత పరీక్షలను ఎన్ఎఫ్‌హెచ్ఎస్6లో తొలగించడం వల్ల ఈ సమస్యపై సమగ్ర అంచనా వేయడం కష్టమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యల నివారణకు చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో సమస్యలు మరింత పెరుగుతాయని స్పష్టం చేస్తున్నారు.



# రైతాంగం సమస్యలపై పోరాటాలు

### పెంచిన ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు తగ్గించాలి

### రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్

**ప్రజాపక్షం/భువనగిరి :** రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. పెంచిన ఎరువుల ధరలను క్రిమిసంహారక మందులను వెంటనే తగ్గించాలని ఆమె కోరారు. రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం రైతు సంఘం నాయకులు పేరబోయిన బంగారి అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి హోటల్లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పశ్య పద్మ హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగానికి అవసరమయ్యే ఎరువుల ధరలను విపరీతంగా పెంచడంతో వ్యవసాయం చేసే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, వెంటనే ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగం పట్ల సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర నామమాత్రంగానే పెంచారని ఆమె ఆరోపించారు. రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆమె కోరారు. మదర్ డైరీలో పాలు పోసిన పాల రైతులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించే విధం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధు చాలామంది రైతులకు అమలు కాలేదని, వెంటనే రైతాంగానికి అమలు అయ్యే విధంగా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో రైతు సంఘం నాయకులు కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక రైతాంగ సమస్యలపై ఎక్కడికక్కడ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతాంగాన్ని చైతన్యం చేసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడె చంద్రయ్య, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, రైతు సంఘం నాయకులు జక్కా దయాకర్ రెడ్డి, ఎలగందుల అంజయ్య, ఉప్పుల కొమరయ్య, పల్లె మల్లారెడ్డి, మొగుళ్ళ తిరుపతిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, దాసరి లక్ష్మయ్య, తెడ్డు ఆంజనేయులు, లింగారెడ్డి, సురేందర్ రెడ్డి, యాదయ్య, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.




## కార్మిక చట్టాలను అణగదొక్కుతున్న పాలకులు



### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** కార్మిక చట్టాలను అణగదొక్కుతూ, పాలకులు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మండిపడ్డారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బొరాతల గోవర్ధన్ అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని బజరంగ్ ఫంక్షన్ హాల్‌లో ఆహ్వాన సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశానికి విలాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ సంపదను బడా బాబులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. దేశ సంపద ను బడా బాబులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. జూలై 19న ఎఐటియుసి జిల్లా 4వ మహాసభల సందర్భంగా కార్మిక మహాప్రదర్శన ర్యాలీ ఉంటుందని వెల్లడించారు. అదే రోజు ప్రతినిధుల మహాసభ నిర్వహించి, నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. సమావేశంలో మహాసభ నిర్వహణ కోసం 23 మందితో ఫండ్, భోజన, అలంకరణ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజుల రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి. రాజన్న, మంతెన కాంతారావు, కె. గంగయ్య, కీర్తి రమణ, ఎస్కే ఉస్మాన్, వై.ఆశన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### డివిజన్, వార్డు గ్రామసభలు నిర్వహించి

## ఓటరు లిస్ట్ పూర్తిచేయాలి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** డివిజన్, వార్డు, గ్రామసభలు నిర్వహించి ఓటరు లిస్ట్‌ను పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ సర్వేలో ఓటరు లిస్ట్ సంబంధించిన సిపిఐ, ఇతర రాజకీయ పార్టీల బిఎల్‌ఎలు, సర్వేకొచ్చిన బిఎల్‌ఓ అధికారితో సహకరిస్తూ నగరంలోని డివిజన్లు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లోని వార్డులు గ్రామాల్లోని ఓటర్లను ఎన్‌రోల్ చేయించాలని కోరారు. దీంతో పాటు మున్సిపల్ డివిజన్, వార్డు అదే విధంగా గ్రామసభలు నిర్వహించి ఓటర్ల లిస్ట్‌ను బహిర్గతపర్చి వలసలు వెళ్లిన వారిని పిలిపించి ఓటర్లుగా నమోదు చేయించాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, సభ్యులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.




## హామీలు విస్మరించిన ప్రభుత్వాలు



### గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్

**ప్రజాపక్షం/వరంగల్ :** గిరిజనులకు ఇచ్చినా హామీలను ప్రభుత్వాలు విస్మరించాయని, తక్షణమే వాటిని అమలుచేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయకార్యదర్శి జువారి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్‌లోని తమ్మెర భవనంలో గిరిజన సమాఖ్య వరంగల్ జిల్లా 3వ మహాసభ జిల్లా అధ్యక్షుడు బానోత్ వీరునాయక్ నేతవాత్ లక్ష్మి అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిధులుగా గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జువారి రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాషమియాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గిరిజనుల ఇచ్చినా హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాయన్నారు. గిరిజన హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అటవీ భూములను బడా పెట్టుబడి దారులకు అప్పజెప్పి అడవుల్లో జీవించే ఆదివాసీ గిరిజనులకు ప్రకృతి సంపద మీద ఎలాంటి హక్కులు లేకుండా చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకిచ్చినా చేవెళ్ల డిక్లరేషన్ అమలు పర్చాలన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ట్రైకర్ రుణాలను రూ.216 కోట్లు విడుదల చేయాలని, ప్రజాపాలనలో భాగంగా రాజీవ్ యూవ వికాసం పేరుతో తీసుకొచ్చినా పథకాన్ని అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. మహాసభలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లావుడ్యా దశ్రునాయక్ నివేదికను సమర్పించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బానోత్ వీరునాయక్, అధ్యక్షుడిగా నేతవాత్ బానుచందర్, ఉపాధ్యక్షులుగా యాకుబ్, గుగులోత్ నర్సింహా, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా లావుడ్యాదస్రునాయక్, సహాయకార్యదర్శులుగా మాలోత్ స్వామి, నేతవాత్ లక్ష్మి , బోడా దేవికా, కోశాధికారిగా బానోత్ సుమన్‌తో పాటు 19 మందితో జిల్లా కమిటీని, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీ విధానాన్ని

## రద్దు చేయాలి : ఎఐటియుసి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని, ర్యాగ్ పిక్కర్‌లను శానిటేషన్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌గా గుర్తించి వారికి ఉపాధి భద్రత కల్పించాలని తెలంగాణ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గౌస్ డిమాండ్ చేశారు. గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ర్యాగ్ పిక్కర్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొత్తగా ప్రవేశపెడుతున్న పైలట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పైలెట్ ఏజన్సీ విధానం వల్ల కార్పొరేషన్‌లో గత 26 సంవత్సరాలుగా రిక్షా మరియు రాగ్ పికర్స్ కార్మికులుగా సేవలందిస్తున్న వారికి ఉపాధి భద్రతకు విఘాతం కలుగుతుందన్నారు. వీరిని శానిటేషన్ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి, తగిన జీతభత్యాలు అందించాలని పాలకవర్గాన్ని కోరారు. కార్పొరేషన్‌లో ఇంటింటి చెత్త సేకరణ చేసే కార్మికులు గతంలో రూ.150 జీతంతో ప్రారంభమైన ప్రస్తుతం రూ.4,000ల మ్యాచింగ్ గ్రాంట్ మరియు ఇంటి యజమానుల నుండి సేకరించే రూ.50 పారితోషికంతో కొనసాగుతోందన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో దాదాపు 140 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. పాలకపక్షం, మేయర్, స్థానిక ఎమ్మెల్యే చెత్త సేకరణ కార్మికుల సేవలను గుర్తించి వారికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో ర్యాగ్ పిక్కర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్రో విస్తరణకు అనుమతులు, నిధుల విడుదలపై జాప్యం చేయవద్దు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెట్రో ఫేజ్–2 విస్తరణకు అవసరమైన కేంద్రం అనుమతులతో పాటు ఐఆర్‌ఎఫ్‌సి రుణ నిధుల విడుదల మరింత జాప్యం చేయవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు ప్రయాణికులకు విశేష సేవలు అందిస్తోంది. పెరిగిన జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్–2 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. మొత్తం 7 కారిడార్లు, 122.9 కిలోమీటర్ల మార్గం, సుమారు రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలు ఇచ్చింది. ఫేజ్–1 ప్రైవేటు నిర్వహణలో ఉండటం, ఫేజ్–2 వేరే సంస్థాగత విధానంలో అమలు చేయటంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మకంగా స్వీకరించిందని సిఎం ఈ లేఖలో వివరించారు. మొత్తం మెట్రో వ్యవస్థ ఒకే నెట్‌వర్క్‌లో నడిచేందుకు వీలుగా ఫేజ్–1ను స్వాధీనం చేసుకునే అసాధారణ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఫేజ్–1 స్వాధీనం ప్రక్రియలో ఈక్విటీ కొనుగోలుకు రూ. 1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ. 13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15,000 కోట్ల లావాదేవీలున్నాయి. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ పారదర్శకంగా నిర్వహించింది. ఈ కమిటీకి కేంద్ర ప్రభుత్వం తరఫున యుపిఎం ఆర్‌సిఎల్ ఎండీ సుశీల్ కుమార్‌ను సభ్యుడిగా నామినేట్ చేసిందని గుర్తుచేశారు. ఐఆర్‌ఎఫ్‌సి ప్రాజెక్టును పూర్తిగా పరిశీలించి, డ్యూ డిలిజెన్స్ పూర్తి చేసి రుణ మంజూరు ఒప్పందం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. ఆర్‌బిఐ ద్వారా డైరెక్ట్ డెబిట్‌కు అంగీకరించింది. ఐఆర్‌ఎఫ్‌సి షరతుల ప్రకారం మొదటి విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.84.32 కోట్ల అప్‌ఫ్రంట్ ఫీజు చెల్లించింది. ఈక్విటీ రూ. 1,461.47 కోట్లు ఇప్పటికే ఎస్క్రో ఖాతాలో జమ చేసింది. ఈ ఒప్పందాలన్నీ పూర్తయ్యాక, అన్ని షరతులు నెరవేర్చాక, 2026 జూన్ 15న రావాల్సిన మొదటి విడత రుణం విడుదల కాలేదని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి దానం అడగటం లేదని సిఎం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఒప్పందం ప్రకారం ఐఆర్‌ఎఫ్‌సి రుణాన్ని విడుదల చేయించాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కేంద్రంలో సీనియర్ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఈ విషయంలో బాధ్యత తీసుకుని ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా మంజూరైన రుణం విడుదలయ్యేలా చూడాలని కోరారు. మెట్రో ఫేజ్–2ను కేంద్రం–రాష్ట్రం 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందని సీఎం ఈ లేఖలో వివరించారు. ఒకవేళ అనుమతులు ఆలస్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులు, సంస్థాగత రుణాల ద్వారా ఫేజ్–2ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన ముందస్తు అనుమతులను ఆలస్యం లేకుండా కేంద్రం నుంచి ఇప్పించాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం కిషన్‌రెడ్డిని కోరారు. సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలతో తాను అధికారులతో కలిసి ఆ సమావేశానికి హాజరై అన్ని వివరణలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# టూరిజం ప్రాంతాల్లో రైల్వే లైన్లు

### హైదరాబాద్ పుణె రైల్వే మార్గంలో వికారాబాద్ అనంతగిరి వద్ద స్టేషన్‌ను, హైదరాబాద్ టు బెంగుళూరు హైస్పీడ్ రైల్వే లైన్, భారత్ ఫ్యూచర్ సిటీలో స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పుణె రైల్వే మార్గంలో వికారాబాద్ అనంతగిరి వద్ద స్టేషన్‌ను, హైదరాబాద్ టు బెంగుళూరు హైస్పీడ్ రైల్వే లైన్, భారత్ ఫ్యూచర్ సిటీలో స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. టూరిజం ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని రైల్వే లైన్ ఉండాలన్నారు. హైదరాబాద్(శంషాబాద్)ను బుల్లెట్ ట్రైన్ హబ్‌గా పిలువాలన్నారు. హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లపైన సిఎంరేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపి వేం నరేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, సిఎంఒ ముఖ్యకార్యదర్శి శ్రీనివాస రాజు, టిజిఐఐ సి కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బి ప్రత్యేక కార్యదర్శి ప్రా వీణ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మన్ననూర్ వద్ద నల్లమల స్టేషన్, సోమశీల సమీపంలో స్టేషన్‌ను ప్లాన్ చేయాలన్నారు. కాకతీయ సామ్రాజ్యం వారసత్వ సంపద, అడుగడుగునా ఉట్టి పడే విధంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉండాలని, ఎయిర్‌పోర్ట్ ముందు భారీ ఐలాండ్ ఉండాలని సిఎం తెలిపా రు. ఐలాండ్‌లో రాణి రుద్రమ, రుద్రదేవుడు విగ్రహాలతో పాటు భారీ నంది విగ్రహాన్ని ఏర్పా టు చేయాలని ఆదేశించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ డి జైన్స్ విషయంలో ఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో చర్చించాలని సిఎం సూచించారు.

#### తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆరంభం మాత్రమే

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆరంభం మాత్రమేనని, రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్‌లో 'వంద' తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నెలకొల్పడమే తమ తదుపరి కర్తవ్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందనేది ఇకపైన ఒక నినాదం మాత్రమే కాదని, కళ్ల ముందు కనిపించే వాస్తమని, ఆ నిజానికి సాక్ష్యమే ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ అని అన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి తన ట్విట్టర్‌లో గురువారం పోస్ట్ చేశారు. మేధావుల సలహాలు, విజ్ఞుల సూచనలతో తెలంగాణ విద్యా వ్యవస్థ చరిత్రను విప్లవాత్మక సంస్కరణలతో తిరిగి రాయాలనే తన సంకల్పానికి రూపమే తెలంగాణ పబ్లిక్ స్కూల్ అని తెలిపారు. చరిత్ర పుటల్లో కలిసిపోతున్న 'ప్రభుత్వ బడి' ప్రజాపాలనలో మళ్లీ పూర్వవైభవాన్ని మించిన వైభవంతో, సకల సౌకర్యాలతో, ఆధునిక వసతులతో, పిల్లల మేధో వికాస క్షేత్రంగా నిలవబోతోందని, తెలంగాణ బిడ్డల పాలిట సరస్వతీ కటాక్ష ఆలయంగా రూపుదిద్దుకున్నదని తెలిపారు. ఆకలి తీర్చి, అక్షరాలు నేర్పి, ఆటను ప్రోత్సహించి పిల్లల్లో మనో వికాసం వికసించే విధంగా మట్టిలో మాణిక్యాలను తీర్చి దిద్దే సకల హంగులతో రూపుదిద్దుకున్న తన మానస పుత్రిక ఈ పాఠశాల అని అభివర్ణించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు రూపం ఇచ్చే కార్యంలో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరికీ సిఎం ధన్యవాదాలు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇస్తామనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి

### బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏ రకమైన ధాన్యం వేయాలనేది ప్రభుత్వం నిర్ణయించడం రైతు మెడపైన కత్తి పెట్టడమేనని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ ఇస్తామనిచెప్పి, 33 రకాల సన్నాలకు పరిమితం చేశారని, ప్రస్తుతం దీనిని 7 రకాలకు తగ్గించారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బంధు, పంట బోనస్, పంట బీమా, రైతు బీమా గురించి సమీక్ష చేయకపోవడమంటే రైతు సంక్షేమాన్ని విస్మరించడమేనని ఆరోపించారు. గత మూడు సీజన్లకు రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, గత యాసంగికి రెండు ఎకరాలకు రైతుభరోసా ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. పంట మార్పిడి అంటూ గొప్పలు చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మి గత సీజన్‌లో మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయా, వేరుశనగ సాగు చేసిన రైతుల పరిస్థితి రోడ్డు పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంటలను మద్దతుధరకు కొంటామని ప్రభుత్వం హామీనిస్తుందా ?, దీనికి గ్యారంటీ ఏమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బోనస్‌ను పూర్తిగా ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇప్పటికైనా మొక్కుబడి సమీక్షలు చేయకుండా, రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో 16 శాతం పోక్సో కేసులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ఫోక్సో కేసులు 6 శాతం నమోదైతే, ఇందులో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 16శాతం కేసులు నమోదయ్యాయని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ గొంగిడిసునీత అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల అంశంపైన హోంశాఖ బాధ్యతలను నిర్వహిస్తున్న సిఎం ఇప్పటి వరకు సమీక్ష నిర్వహించలేదని ఆరోపించారు. నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఖమ్మం భాధితురాలిని మంత్రి సీతక్క పరామర్శించి ఆర్థిక సహాయం చేయడాన్ని సునీత స్వాగతించారు. చిన్నారులపై నేరాలకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో కూడా సీతక్క చెప్పాలన్నారు. బండి భగీరథ్ కేసు విషయంలో తొలుత బలహీన సెక్షన్లను నమోదు చేశారని, రాష్ట్రంలో మహిళలు రోడ్డు ఎక్కితే అప్పుడు ఆ సెక్షన్లను మార్చారని విమర్శించారు. సౌదీ అరేబియా తరహా చట్టాలను ఇక్కడా కూడా అమలు చేయాలన్నారు.

## తెలంగాణ రైతులకు తగిన యూరియా కేటాయించాలి : అన్వేష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు పెంచాలని,పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి కేటాయించాల్సిన యూరియాను పూర్తిస్థాయిలో సరఫరా చేయకుండా కోతలు విధించడం సరికాదన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్‌పై బిజెపి నేతలు విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు.ఎరువుల ధరల పెంపుతో రైతులపై అదనపు భారం పడుతోందని, పంటల కొనుగోళ్లలో కూడా కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. వరి, పప్పుధాన్యాల కొనుగోళ్లలో రైతులకు న్యాయం చేయాలని డిమాండ చేశారు.యూరియా కేటాయింపులు, ఎరువుల ధరల అంశాలపై త్వరలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామని అన్వేష్ రెడ్డి తెలిపారు.

## నిషేధిత జాబితాపై స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాము కొనుగోలు చేసిన భూమిని అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చారంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ అభినందకుమార్ షావిలి, ఆయన సోదరుడు అశోక్‌కుమార్ షావిలికి మధ్యంతర ఊరట లభించింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిషేధిత జాబితా ఉత్తర్వుల అమలుపై హైకోర్టు స్టే విధించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం గుబ్బడి గ్రామ పరిధిలోని మొత్తం 4.30 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పుల్లా కార్తీక్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ 2025 నవంబర్ 6న జారీ చేసిన ప్రొసీడింగ్స్ ద్వారా పిటిషనర్లకు చెందిన 3.26 ఎకరాలు, 1.04 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం చట్టవిరుద్ధమని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. 1950 నుంచి ఉన్న రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తే, ఈ భూమిని పిటిషనర్ల పూర్వీకులు 1980లో పట్టాదారుల నుంచి కొనుగోలు చేసిన విషయం స్పష్టమవుతుందని తెలిపారు. అనంతరం పాస్‌బుక్స్ కూడా జారీ అయ్యాయని పేర్కొన్నారు. అయితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, భూమిని అసైన్డ్ ల్యాండ్‌గా పేర్కొంటూ అధికారులు ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న న్యాయమూర్తి కలెక్టర్ ఉత్తర్వుల అమలుపై మధ్యంతర స్టే జారీ చేశారు. అలాగే రెవెన్యూ శాఖ, జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌లకు నోటీసులు జారీ చేసి కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

# ఉద్యమకారుల గుర్తింపునకు సంప్రదింపులు

### 23 నుండి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సలహాలు సూచనలు స్వీకరిస్తామని తెలిపిన కమిటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుండి అమరజ్యోతి కేంద్రంగా వివిధ వర్గాలతో సంప్రదింపులు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఇందులో విద్యార్థి జెఎసి ప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అడ్వకేట్లు, డాక్టర్లు తదితర వర్గాలతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణంలో నిర్మించిన వివిధ గదులను పరిశీలించిన కమిటీ సభ్యులు, ప్రత్యేకంగా ఆడియో విజువల్ రూమ్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కమిటీ చైర్మన్ కె. కేశవరావు నేతృత్వంలో అమరజ్యోతి కేంద్రంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 2001 నుండి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రజా సంఘాల ఉద్యమకారులు, ఉద్యమకారుల సంక్షేమ కమిటీలు, ఇతర వర్గాలతో రాజకీయాలకు అతీతంగా విస్తృత స్థాయిలో చర్చలు జరిపి ఉద్యమకారుల గుర్తింపుకు అవసరమైన సూచనలు, సలహాలను దశలవారీగా సేకరించాలని కమిటీ నిర్ణయించింది. ఈ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సూచనలు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఆఫ్‌లైన్ విధానంలో ఉద్యమకారులు తమ ప్రతినిధ్యాలు సమర్పించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి, అందిన అభిప్రాయాలు, వివరాలను నమోదు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## ప్రభుత్వ న్యాయవాది హామీకి అధికారులు కట్టుబడి ఉండాల్సిందే : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైడ్రా అధికారుల వ్యవహార శైలిపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన హైడ్రా ప్రత్యేక అధికార సంస్థ కాదని, చట్ట పరిధిలోనే విధులు నిర్వహించాలని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలు, అలాగే కోర్టు ఎదుట ప్రభుత్వ న్యాయవాదులు ఇచ్చిన హామీలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. ప్రైవేటు ఆస్తుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని గతంలో ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు హామీ ఇచ్చినప్పటికీ, దానికి విరుద్ధంగా హైడ్రా అధికారులు వ్యవహరించడం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనగా పరిగణించాల్సి వస్తుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కోర్టు ఎదుట ప్రభుత్వ తరఫున ఇచ్చే హామీలు రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలకు వర్తిస్తాయని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని స్పష్టం చేసింది. అలాంటి హామీలను ఉల్లంఘిస్తే అది అధికారుల తప్పిదంగా పరిగణించబడుతుందని హెచ్చరించింది. కోర్టు ధిక్కరణ చర్యలకు దారితీసే ఇటువంటి వ్యవహారాలను సహించబోమని హైడ్రా కమిషనర్‌ను హెచ్చరించింది. శాంతా శ్రీరామ్ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, వివాదాస్పద భూమిని సివిల్ కోర్టు, హైకోర్టు ఇప్పటికే ప్రైవేటు ఆస్తిగా గుర్తించాయని తెలిపారు. అయినప్పటికీ, ప్రభుత్వ ఆస్తిగా పేర్కొంటూ హైడ్రా జోక్యం చేసుకుందని ఆరోపించారు. దీనిపై హైడ్రా తరఫు న్యాయవాది స్పందిస్తూ, 'సొసైటీ టు సేవ్ రాక్స్' సంస్థ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారని తెలిపారు. భవిష్యత్తులో ఆ భూమి విషయంలో హైడ్రా జోక్యం చేసుకోదని కోర్టు కు హామీ ఇచ్చారు. దీంతో కోర్టు ధిక్కరణ పిటిషన్లను ముగిస్తూ హైకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది.

# నీటమునిగే ప్రాంతాల నివారణకు సమన్వయ చర్యలు


### చేపట్టాలని అధికారులను ఆదేశించిన డిజిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మల్కం చెరువు వద్ద నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో డిజిపి ఈ సూచనలు చేశారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపుడి గాంధీ, జిహెచ్‌ఎంసి కమిషనర్ కెవి కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ వర్షాకాలంలో వరదలు, నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, కీలక జంక్షన్లు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలు లేదా నీటి నిల్వల కారణంగా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా అన్ని ఎమర్జెన్సీ వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మియాపూర్, కొండాపూర్, మాదాపూర్, బయోడైవర్సిటీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లోని మల్కం చెరువు, ఖాజాగూడ సరస్సు, మండికుంట, గురునాథ్ చెరువు తదితర ప్రాంతాలను ప్రత్యేక ఇంజినీరింగ్ బృందాలు పరిశీలిస్తున్నట్లు అధికారులు వివరించారు. వర్షపు నీటి ప్రవాహ మార్గాలు , డ్రైనేజీ అనుసంధానం, ఆక్రమణలు తదితర అంశాలను అధ్యయనం చేసి తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారాలపై నివేదిక సమర్పించాలని ఆయా బృందాలకు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. వరదల నివారణలో పోలీస్ శాఖ, జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్ శాఖ, హైడ్రా తదితర విభాగాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని డిజిపి పేర్కొన్నారు. నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని, రాష్ట్ర వ్యాప్తం గా పోలీసు యంత్రాంగం 24 గంటల పాటు సిద్ధంగా ఉండి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. సమావేశం అనంతరం అధికారులు మల్కం చెరువు పరిసర ప్రాం తాలను పరిశీలించి, నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అమలు చేయడం, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం, ప్రజల భద్రతను కాపాడడం కోసం సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.

## నీట్ విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్‌ఎస్‌యుఐ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టిఎ నిర్లక్ష్యం కారణంగా నీట్ యుజి 2026 ప్రశ్నాపత్రం లీక్ కావడంతో దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకట్ స్వామి అన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 21న నిర్వహించనున్న నీట్ యుజి రీఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తోందని వివరించారు. అందువల్ల పరీక్ష రోజున విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు అనుకూలంగా నిర్ణయం తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందనకు ఎన్‌ఎస్‌యుఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ జాతీయ లీగల్ సెల్ కోఆర్డినేటర్ అక్బర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాకేష్, కర్ణాకర్, హస్సన్, విష్ణువర్ధన్, వికాస్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లు @ డాక్టర్లు.. అప్రమత్తంగా ఉండాలి

### హెచ్చరించిన టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్
### 735 మంది డాక్టర్లకు రూ.29.88 కోట్ల టోకరా..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో వైద్య వృత్తి నిపుణులు సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఆందోళన వ్యక్తం చేసింది. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 735 మంది వైద్యులు సైబర్ మోసాల బారినపడి దాదాపు రూ.29.88 కోట్ల మేర నష్టపోయినట్లు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడించారు. పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో వైద్యులకు అవగాహన కల్పించేందుకు టిజిసిఎస్‌బి మంగళవారం హైదరాబాద్‌లో వైద్య సంఘాల ప్రతినిధులతో ఉన్నతస్థాయి అవగాహన సమావేశాన్ని నిర్వహించింది. శిఖా గోయల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌పిలు హర్షవర్ధన్, సాయి శ్రీ పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ వైద్య సంఘాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ఖజాంచీలు, సీనియర్ ప్రతినిధులు కలిపి 72 మంది హాజరయ్యారు. సమావేశంలో శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అత్యంత విద్యావంతులు, వృత్తిపరంగా ఉన్నత స్థాయిలో ఉన్నవారినీ లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. అవగాహన, అప్రమత్తత, వెంటనే ఫిర్యాదు చేయడం మాత్రమే సైబర్ మోసాల నుంచి రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు. టిజిసిఎస్‌బి గణాంకాల ప్రకారం, బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో అత్యధికంగా 127 మంది వైద్యులు రూ.22.39 కోట్లు కోల్పోయారు. డిజిటల్ అరెస్ట్ మోసాల్లో 22 మంది రూ.2.26 కోట్లు, ఐడెంటిటీ థెఫ్ట్ కేసుల్లో 144మంది రూ.2.05 కోట్లు, ఇంపర్సనేషన్ మోసాల్లో 181 మంది రూ.1.32 కోట్లు, ప్రకటనల మోసాల్లో 188 మంది రూ.1.17 కోట్లు నష్టపోయినట్లు వెల్లడించారు. వీటితో పాటు ఉద్యోగాలు, రుణాలు, బీమా, యూపీఐ, మ్యాట్రిమోనియల్, క్రిప్టోకరెన్సీ మోసాలు కూడా నమోదైనట్లు తెలిపారు. సైబర్ ఆర్థిక మోసాల్లో 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకమని, మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే డబ్బు రికవరీ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షుడు డాక్టర్ ఎంపి కిషన్, తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రఘునాథ్ రెడ్డి, తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఖజాంచి డాక్టర్ వజ్జా ప్రదీప్, థానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎల్. సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. 'సైబర్ అవగాహన – నివారణ – రక్షణ' అనే ఉమ్మడి నినాదంతో వైద్య వర్గాలు, టిజిసిఎస్‌బి కలిసి పని చేయాలని తీర్మానించాయి.

## స్థాయిలో సౌత్ సెంట్రల్ రైల్వేకు ప్రతిష్టాత్మక అవార్డు

### కవచ్, డిజిటల్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థల అమల్లో అత్యుత్తమ పనితీరుకు జాతీయ గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే భద్రత, సిగ్నలింగ్ ఆధునికీకరణ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన సౌత్ సెంట్రల్ రైల్వే (ఎస్‌సిఆర్) జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక గుర్తింపును దక్కించుకుంది. కవచ్, డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థల అమలులో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు సౌత్ సెంట్రల్ రైల్వేకు 'నేషనల్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ అవార్డు' లభించింది. భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ రైల్వే సిగ్నల్ ఇంజినీర్స్ , ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ రైల్వే సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్–2026 సందర్భంగా ఈ అవార్డును న్యూఢిల్లీలో ప్రదానం చేశారు. ఈ నెల 10 నుంచి 13 వరకు భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా రైల్వే సంస్థలు, ప్రముఖ విద్యాసంస్థలు, సాంకేతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వికసిత్ భారత్–2047 లక్ష్యానికి అనుగుణంగా కృత్రిమ మేధ ఆధారిత నూతన రైల్వే నియంత్రణ, కమాండ్ సిగ్నలింగ్ వ్యవస్థల అభివృద్ధిపై చర్చలు జరిగాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో సౌత్ సెంట్రల్ రైల్వే 21 డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలను ప్రారంభించడంతో పాటు 486 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ 4.0 వ్యవస్థను అమలు చేసింది. అలాగే 479 రూట్ కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌ను ప్రారంభించి రైళ్ల భద్రత, నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచింది. ఈ అవార్డు సాధించిన సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ మురళీకృష్ణ నేతృత్వంలోని బృందం మంగళవారం రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసింది. ఈ సందర్భంగా ఆయన బృందాన్ని అభినందిస్తూ, రైల్వే భద్రత, సమర్థవంతమైన రైలు నిర్వహణ కోసం సిగ్నలింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థల ఆధునికీకరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ మరిన్ని విజయాలు సాధించాలని అధికారులకు సూచించారు.



## నీటి సరఫరా లేక ప్రజల ఆందోళన

### వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్ట 280 డివిజన్ పరిధిలోని రోడ్డు నెం.1 నుంచి చివరి బస్‌స్టాప్ వరకు గత ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మంగళవారం జగద్గిరిగుట్ట వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కామ్రేడ్ ఏసురత్నం, కుత్బుల్లాపూర్ మండల సహాయ కార్యదర్శి వి.హరినాధరావు, శాఖ కార్యవర్గ సభ్యుడు దేవానందం తదితరలు ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం వాటర్‌వర్క్స్ ఏరియా మేనేజర్ మహేష్‌ను కలిసి సమస్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మూడు రోజులకు ఒకసారి రెండు గంటల పాటు నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం నీటి ఒత్తిడిని తగ్గించి కేవలం 40నిముషాల పాటు మాత్రమే నీరు అందిస్తున్నారని ఆరోపించారు. ఆ నీరు కూడా ప్రజల అవసరాలకు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత కారణంగా బోర్‌వెల్ ఎండిపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని పేర్కొంటూ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోజు విడిచి రోజు కనీసం గంటన్నర పాటు నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఏరియా మేనేజర్ మహేష్, తక్షణ ఉపశమన చర్యగా రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిస్తామని, రెండు గంటల్లోపు నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో ప్రజలు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీపిఐ సీనియర్ నాయకుడు ఏ.బిక్షపతి, ఎఐవైఎఫ్ నాయకుడు కె.కీర్తిబాబు, మహిళలు కె.కళా తి, దీప, సునీతారెడ్డి, ఎస్.భాగ్యమ్మ, బాలరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సుల భద్రతపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/వికారాబాద్ :** పాఠశాల బస్సులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్కూల్ బస్సుల నిర్వహణ డ్రైవర్ల అర్హత, వాహనాల ఫిటినేస్ విషయంలో తల్లి దండ్రులు, పాఠశాల యాజమన్యాలు, సంబంధింత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వాహనాలు నడిపే డ్రైవర్లుతగిర అనుభవం, లైసెన్స్ కలిగి ఉండాలని, ఎట్టి పరిస్థితిల్లోను మధ్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎవైన లోపలు ఉంటే పోలీసులకు తెలియజేయలని సూచించారు.



## బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : డా.సత్యం శ్రీరంగం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని టిపిసిసి అధికార ప్రతినిధి, పిసిసి సభ్యుడు డా.సత్యం శ్రీరంగం అన్నారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ మంగళవారం కైత్లాపూర్‌లోని డా.సత్యం శ్రీరంగం నివాసంలో కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజ అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై ఇరువురు నాయకులు చర్చించుకున్నారు. అర్హులైన బ్రాహ్మణ కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయక కార్యక్రమాలను చేరవేయడంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కీలక పాత్ర పోషిస్తోందని పొన్నాడ తెలిపారు. స్థానిక బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై స్పందించిన శ్రీరంగం సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బ్రాహ్మణుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాందూరి నరేంద్ర ఆచార్య, హరిహర క్షేత్రం చైర్మన్ మూర్తి, సుబ్బారావు, పంచగంగేశ్వర్, శ్రీరంగం శ్రీనివాసాచార్యులు, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హుక్కా సెంటర్లపై దాడులు... ఏడుగురి ఆరెస్టు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్లపై మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేశారు. పోలీసు కమిషనర్ సుమతి తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరి స్పెషల్ ఆపరేషన్ బృందాలు (ఎస్‌ఓటి) కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి 14 హుక్కా సెంటర్లు, కేఫ్‌లను పరిశీలించారు. వీటిలో నిబంధనలను ఉల్లంఘించిన నాలుగు హుక్కా సెంటర్లపై కేసులు నమోదుచేసి ఏడుగురిని అరెస్టు చేశారు. హుక్కా సెంటర్లు నిబంధనలు ఉల్లంఘించి నడిపించటం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవటమే కాక శాంతిభద్రతల సమస్యలు సైతం తలెత్తుతాయని, ఇలాంటి వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలు ఎక్కడ జరిగినా తమకు సమాచారం తెలియ చేయాలని కోరారు.

## యువకుడి అదృశ్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఇంట్లో గొడవ పడిన తన భర్త గత రెండు రోజులుగా జాడ కనపడటం లేదంటూ నేరేడ్‌మెట్ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ప్రయివేట్ జాబ్ చేస్తున్న రాసు మహేష్ (45) గత శనివారం ఉదయం ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, భర్త జాడ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోయిందని అతడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో రగ్బీ సందడి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత రగ్బీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రొఫెషనల్ టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన హెచ్‌ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్2కు మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. దేశ, విదేశాలకు చెందిన అగ్రశ్రేణి ఆటగాళ్లతో పాటు తొలిసారిగా మహిళల ఫ్రాంచైజీలను ప్రవేశపెట్టడంతో ఈ సీజన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జిఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లీగ్ ప్రారంభోత్సవ వేడుకకు తెలంగాణ క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల రగ్బీ లీగ్ ట్రోఫీని ఆవిష్కరించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దేశంలోని ప్రధాన క్రీడా ఈవెంట్లకు తెలంగాణ ఆతిథ్యం ఇస్తూ జాతీయ క్రీడా కేంద్రంగా ఎదుగుతోందన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ప్రగతిశీల క్రీడా విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. మహిళల ఫ్రాంచైజీల ప్రవేశం రగ్బీ క్రీడకు కొత్త దిశను చూపుతుందని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ, హైదరాబాద్‌ను దేశంలో ప్రముఖ క్రీడా గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌ల నిర్వహణకు నగరం అన్ని విధాలా సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ పూర్తి సహకారం అందిస్తోందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోని బాలాదేవి మాట్లాడుతూ, టోర్నమెంట్ విజయవంత నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

## సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన ఆర్‌టిఏ సేవలు



**ప్రజాపక్షం/ఉప్పల్ :** సాంకేతిక సమస్యలతో మంగళవారం తలెత్తిన సమస్యల కారణంగా ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో నిలిచి పోయాయి. సోమవారం స్వల్పంగా ప్రారంభమైన ఈ సమస్యను సకాలంలో పరిష్కరించటంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండో రోజు సైతం మరింత తీవ్రమై కార్యకలాపాలన్ని పూర్తిగా ఆగి పోవటంతో లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ల లాంటి వివిధ పనుల కోసం ఆన్‌లైన్ విధానంలో ముందుగా స్లాట్‌లు బుక్ చేసుకొని దూర ప్రాంతాల నుండి ఉదయం నుండే ఇక్కడికి చేరిన ప్రజలు సమస్య పరిష్కారమై పని పూర్తవుతుందన్న ఆశతో గంటల తరబడి కౌంటర్లు, కార్యాలయ ప్రాంగణంలో వేచి ఉన్నా ఫలితం లేక పోవటంతో నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. ఆర్టీఏ కార్యకలాపాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహన్, సారథి యాప్, వెబ్‌సైట్లకు సంబంధించి సర్వర్లు పని చేయని కారణంగానే ఈ సమస్య తలెత్తిందని, ఈ సమస్య తమ వద్దే కాకుండా దేశవ్యాప్తంగా ఉంద ని అధికారులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారం తమ పరిధిలో లేదని, ఢిల్లీలోని కేంద్ర సర్వర్ ద్వారా నిర్వహించబడే ప్రాంతం లో తలెత్తిన సమస్యను అక్కడే పరిష్కరించాల్సి ఉన్న కారణంగా ఏ సమయంలో యథాస్థితి వస్తుందన్న విషయం చెప్పలేక పోతున్నామని ఉప్పల్ ఆర్టీఓ సురేష్ రెడ్డి తెలిపారు.

తమ బాధ్యతగా కార్యాలయంలో తలెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి వెంటవెంటనే తెపలియచేస్తున్నామన్నారు. సర్వర్ కనక్షన్లు పునరుద్దరించగానే ఆర్టీఏ సేవలు సాధారణ స్థితికి వస్తాయని, ఇప్పటికే వివిధ సేవలకు గాను స్లాట్‌లు బుక్ చేసుకొన్న వారు సర్వర్ సమస్య పరిష్కారమయ్యే వరకు వేచి ఉండాలని ఆయన కోరారు.

## విలీన గ్రామాల్లో డోర్ నంబర్లు కేటాయించాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మండల పరిధిలో ఇటీవల హైదరాబాద్ మహానగర పాలక సంస్థలో విలీనం అయిన 11 గ్రామాల్లో గ్రామ కంఠం స్థలాలకు సంబంధించి హౌస్ నెంబర్లు కేటాయింపు,అలాగే ఆస్తుల పేరు మార్పిడి నమోదు ప్రక్రియలు వేగవంతం చేయాలని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ డిమాండ్ చేశారు.

విలీన ప్రక్రియ పూర్తయి నెలలు గడిచినా ఇప్పటికీ గ్రామాల్లోని అనేక ఇళ్లకు డోర్ నెంబర్లు కేటాయించకపోవడం అలాగే పాత పన్ను రికార్డుల్లో తండ్రుల పేర్లకు మార్చే ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డోర్ నెంబర్లు లేకపోవడం,పేరు మార్పిడి నమోదు పూర్తి కాకపోవడం వల్ల ఆస్తుల కోనుగోలు,అమ్మకాలు,బ్యాంకు రుణాలు, భవన నిర్మాణ అనుమతులు వంటి కీలక ప్రభుత్వ సేవలు పొందడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. పలుమార్లు సంబంధిత కార్యాలయాలను సంప్రదించినప్పటికీ సరైన పరిష్కారం లభించలేదని వినోద్,స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని విలీన గ్రామాల గ్రామ కంఠం స్థలా ల డోర్ నెంబర్లు కేటాయింపు,పేరు మార్పిడి నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ దరఖాస్తులను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, స్థానిక ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్ శ్రీరామ్ నగర్‌లో కూన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూశ్రీరామ్ నగర్‌లో సుమారు ఎనిమిది అంతర్గత సిమెంటు రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. సుమారు రూ. 55 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే అభివృద్ధికి పునాదులు వేసినట్లేనని పేర్కొన్నారు. బస్తీలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, రాకేష్, మధు, అశ్వత్, అనురాధ, సల్మాన్, నాగరాజు, రఫీ, ఇలియాస్, దశరథ్ పాల్గొన్నారు.




## వృద్ధుల హక్కులపై సుప్రభాత్ టౌన్‌షిప్‌లో చర్చ

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** వృద్ధులపై పెరుగుతున్న శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక దుర్వినియోగాలను అరికట్టేందుకు సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వక్తలు పిలుపునిచ్చారు. వృద్ధులను గౌరవించడం వారి హక్కులను పరిరక్షించడం ప్రతి కుటుంబం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్ సామాజిక భవనంలో ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవం సందర్భంగా డెమోక్రాటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు వృద్ధులు కుటుంబాలకు సమాజానికి అమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. వారి అనుభవాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్‌లో నిర్వహించే ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవం ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణ భద్రతపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సెల్ టవర్ ఏర్పాటు నిలిపి వేయాలి


**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అనారోగ్యాలకు దారితీసే సెల్ టవర్ ఏర్పాటు నిలిపి వేయాలంటూ మల్కాజిగిరి డివిజన్‌లోని ఎస్పీ నగర్ ప్రాంతవాసులు మంగళవారం ఎంఎంసి మల్కాజిగిరి జోనల్, డిప్యూటి కమిషనర్లను కల్సి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జిడి సంపత్ మాట్లాడుతూ నివాస గృహాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో సెల్‌టవర్ ఏర్పాటు కోసం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, దీనివల్ల వెలువడే రేడియేషన్ కారణంగా కారణంగా స్థానికులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న ఈ టవర్ ఏర్పాటును వెంటనే నిలిపి వేయాలని కోరటంతో అధికారులు సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానికులు జిడి చరణ్ గౌడ్, గౌసుద్దీన్, రవీంద్రరెడ్డి, జివిఎస్ సతీష్, చారి, దాస్, ఆసిం, శారద, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకాభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలు గుర్తించండి

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులకు సూచించారు. మంగళవారం అనంతగిరి పర్యావరణ పర్యాటక కేంద్ర ఏర్పాట్లపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనులను పరిశీలించారు. జిల్లాలోని అనంతగిరి ప్రాంతంతోపాటు సర్పంన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటక అభివృద్ధికి పరిశీలించాలని తెలిపారు. జిల్లాలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను గుర్తించి పర్యాటక అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనింగ్ సచిన్ బస్వరాజ్ ,తదితరులుపాల్గొన్నారు.



### ఎరువులు,విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తాం

వికారాబాద్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ధనలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసే ధరల పట్టిక, విలువల రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని తెలిపారు. డీలర్లు అక్రమాలకు పాల్పడినట్లయితే చట్ట రీత్యా తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలను సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులు అధిక శాతం పాఠశాలకు హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు అల్పాహారం

* మేడ్చల్‌లో 22 పాఠశాలలు ప్రయోగాత్మకంగా ఎంపిక
* ఒకే ప్రాంగణంలో తయారీ కోసం కలెక్టర్ భవన పరిశీలన

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించాలన్న ప్రభుత్వ కార్యక్రమానికి గాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రయోగాత్మకంగా 22 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ అల్పాహార తయారీని అంతా ఒకే ప్రాంతంలో తయారుచేసే విధంగా కేంద్రీకృత వంటల ఏర్పాట్ల కోసం ఆలియాబాద్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ఎక్కడ అనుకూలంగా ఉంటుందన్న భవనాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో అల్పాహారం తయారు చేసి సకాలంలో సరఫరా చేసే ఏర్పాట్ల కోసం వసతి, నీటి ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి అనుకూలమైన దాన్ని ఎంపిక చేయనున్నారు. దీనిలోని భాగంగా ఆలియాబాద్, కేశవరంలో మూత బడ్డ బిసి ప్రీమెట్రిక్ హాస్టళ్ల భవనాలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి మంగళవారం పరిశీలించారు. ఈ హాస్టళ్లు ఎంతకాలం నుండి మూతబడ్డాయి, ఏ మేరకు స్థలం విస్తీర్ణత, ఇతర సదుపాయాలు ఉన్నాయన్న విషయాలపై వెంటనే తనకు నివేదిక సమర్పించాలని బిసి సంక్షేమ శాఖ అధికారి, తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం ఆయన కేశవరంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి కొత్తగా ఎన్ని అడ్మిషన్లు వచ్చాయని తెల్సుకొన్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి మరేదైనా పాఠశాలలో అవసరం ఉందా అని విద్యార్థులను అడగటంతో తమకు ఫుట్‌బాల్, క్రికెట కిట్లు కావాలని కోరటంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఎప్పటి మాదిరిగానే తాను అందచేస్తానంటూ హామీ ఇచ్చారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఝాన్సిరాణి, శామీర్‌పేట, మూడు చింతలపల్లి తహసీల్దార్లు శ్రీనివాస్, మహ్మద్ ఇద్రీస్, అల్పాహార తయారీ, సరఫరా నిర్వహణ కాంట్రాక్టు ఏజన్సీ మన్న ట్రస్ట్ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

## నేడు సంస్కృతి స్కూల్ ప్రారంభోత్సవం

### ముఖ్య అతిథులుగా తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరు




**ప్రజాపక్షం/నవాబుపేట్:** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో నేడు సంస్కృతీ స్కూల్ ఘన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కాలే యాద య్య ముఖ్య అతిథులుగా హాజరై స్కూల్‌ను ప్రారంభించనున్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం తో ఏర్పాటు చేసిన సంస్కృతీ స్కూల్‌లో ఆధునిక విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ విద్యాసంస్థకు డైరెక్టర్లు జయకాంత్ రెడ్డి, సీతారాం ప్రవీణ్ కుమార్ నాయకత్వం వహిస్తున్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందు కు కేరళ, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందాన్ని నియమించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. సంస్కృతీ స్కూల్ నవాబుపేట ప్రాంతంలో విద్యా రంగానికి కొత్త దిశను చూపుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** ఫతేనగర్ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి ఫతేనగర్ హరిజన బస్తీలోని జిహెచ్‌ఎంసి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సమావేశానికి ముందు ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. దీనదయాళ్ నగర్ బ్రిడ్జి ఎత్తు పెంపు పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్‌ఎండిపి ప్రాజెక్టు అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ఆర్‌యూబీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులు మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శివనగర్ ప్రాంతంలో ఆర్‌యూబీ నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. సమీక్ష సమావేశంలో మాట్లాడిన మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని, ఫతేనగర్ డివిజన్‌ను విభజించిందని ఆరోపించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు డ్రైనేజీ సమస్యలు, వీధిలైట్లు, చెత్త సేకరణ, ప్రధాన స్మశానవాటిక అభివృద్ధి, మంచినీటి సరఫరా వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనుల అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, బేగం పేట్ మాజీ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, కొత్తటి రాములు, కంచి బిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారు లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో యువకుడు అదృశ్యం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** యువకుడు అదృశ్యమైన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా దొనకొండ మండలం గంగాదేవిపల్లికి చెందిన బత్తుల సందీప్(23) చర్లపల్లి బిఎన్ రెడ్డి కాలనీలోని ది హోమ్ ఫర్ అర్ఫన్ స్టూడెంట్స్ హాస్టల్‌లో ఉంటు దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐఏసిఇ ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. కోచింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని తన బావమరిది త్రినాథ్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. బంధువులు,స్నేహితులను ఆరా తీసిన ఆచూకీ లభించకపోవడంతో చర్లపల్లి పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ తో కలిసి ఫాతిమా విజయ్ ఆంటో నీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామంజనేయులు జవ్వాజీ నిర్మించిన చిత్రం 'వంద దేవుళ్ళు'. 'బిచ్చగాడు' తరువాత దర్శకుడు శశితో విజయ్ ఆంటోని చేసిన ఈ చిత్రం 19న రిలీజ్ కాబోతోంది.

# రీల్



## తమిళనాడు సిఎం విజయ్‌ని కలిసిన విశాల్

తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్‌ను నటుడు విశాల్ కలిశారు. విశాల్ తన స్నేహితుడు అయిన సిఎం విజయ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన ఈ భేటీ గురించి పోస్ట్ చేశారు.'లయోలా కాలేజీలో మన పరిచయం ఏర్పడిన నాటి నుంచి నేను మిమ్మల్ని 'డార్లింగ్' అని పిలుస్తూనే ఉన్నాను.. అందులో ఎలాంటి మార్పు రాలేదు. ఓ సాధారణ హీరోగా మొదలైన మీ ప్రయాణంలోని అన్ని అడ్డంకులను, విమర్శలను ఎదుర్కొని, మీ మౌనంతో, విజయంతో వాటన్నిటినీ పక్కకు నెట్టేశారు. ఒక సూపర్‌స్టార్‌గా మీరు ఉన్నత శిఖరాలకు ఎదిగి ఈనాడు తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి అయ్యారు.పదవి, హోదా మారాయి కానీ మీరు మాత్రం మారలేదు. మిమ్మలను కలవడం ఎంతో ఆనందాన్నిచ్చింది, అదే ఆప్యాయతను మళ్లీ అనుభూతి చెందాను. ఎంజీఆర్ నుంచి.. జయలలిత అమ్మ వరకు, స్టాలిన్ అంకుల్ నుండి నా ప్రియ సోదరుడు ఉదయనిధి స్టాలిన్ వరకు.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ని 'డార్లింగ్' అని పిలవడం ఎంతో ముచ్చటగా అనిపించింది. నాలోని ఈ మధుర క్షణాలు ఎప్పటికీ నిలిచి ఉంటాయి అని విశాల్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## ఘనంగా 'వంద దేవుళ్ళు' ప్రీ రిలీజ్



విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ తో కలిసి ఫాతిమా విజయ్ ఆంటో నీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామంజనేయులు జవ్వాజీ నిర్మించిన చిత్రం 'వంద దేవుళ్ళు'. 'బిచ్చగాడు' తరువాత దర్శకుడు శశితో విజయ్ ఆంటోని చేసిన ఈ చిత్రం 19న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల, దర్శకుడు త్రినాథరావు నక్కిన ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'శశి 20 ఏళ్ల నన్ను మ్యూజిక్ దర్శకుడిగా పరిచయం చేశారు. పదేళ్ల క్రితం శశి 'బిచ్చగాడు' చిత్రంతో హీరోగా నాకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ 'వంద దేవుళ్ళు' అంటూ మేం రాబోతోన్నాం. శశి కథ చెప్పిన తరువాత నేను ఎంతో ఏడ్చేశాను. నాకు కన్నీళ్లు మాత్రం ఆగలేదు. నా పాత్ర చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. 'బిచ్చగాడు' నుంచి నాతో ప్రయాణిస్తున్న భాష్య శ్రీకి థాంక్స్. 'వంద దేవుళ్ళు' మూవీని సుబ్బారెడ్డి, మైత్రి శశి డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. నా నిర్మాత ఫాతిమాకి థ్యాంక్స్. 19న రాబోతోన్న మా 'వంద దేవుళ్ళు' తెలుగు ప్రేక్షకులందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'వంద దేవుళ్ళు' మూవీని ఆల్రెడీ నేను చూశాను. శశి గారు తీసిన 'శ్రీను' మూవీ చూసి నేను వెక్కి వెక్కి ఏడ్చాను. ఆయన 'బిచ్చగాడు' లాంటి గొప్ప సినిమాని తీశారు. ప్రతీ ఒక్కరూ హార్ట్ పెట్టి మూవీకి పని చేసినట్టుగా కనిపిస్తోంది. పెళ్లి అయితే, పిల్ల లను కంటే అమ్మాయి అమ్మగా మారిపోతుంది అన్నారు. నిర్మాత ఫాతిమా విజయ్ ఆంటోని మాట్లాడారు .. త్రినాథరావు నక్కిన, దర్శకుడు శశి, నటి కావ్య అనిల్, డిస్ట్రిబ్యూటర్ సుబ్బారెడ్డి, రైటర్ భాష్య శ్రీ పాల్గొన్నారు.

## 'సేవ్ ది టైగర్స్' సీజన్ 3 ప్రీమియర్



సేవ్ ది టైగర్స్ సీజన్ 3 గ్రాండ్ ప్రీమియర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. పలువురు సినీ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరు కాగా.. వారి నవ్వులతో, సందడితో సాయంత్రం ఆహ్లాదంగా మారింది. అతిథులు, సెలబ్రిటీలు, నటీనటులు, సాంకేతిక బృందం క్రియేటర్లు.. ఇలా అందరూ కలిసి ప్రాంతీయ ఒటిటి వినోదంలో పెద్ద హిట్‌గా నిలిచిన సేవ్ ది టైగర్స్ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన సీజన్3ను ఎంజాయ్ చేశారు. తారల తళుకులతో మెరిసిన ఈ రెడ్ కార్పెట్ వేడుకకు టివి సీరియల్స్ నుంచి సినిమాల వరకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్లు, హైఫ్యాషన్‌లో సెలబ్రిటీల మెరిసే హాజరు, ఎక్స్‌క్లూజివ్ మీడియా ఇంటరాక్షన్లు, అలాగే ప్రీ స్క్రీనింగ్ గెట్ టుగెదర్స్.. ఇలా అన్నీ కలిసి ఈ స్ట్రీమింగ్ ప్రారంభానికి అద్భుతమైన వేదికగా నిలిచాయి.సేవ్ ది టైగర్స్ 3 స్పెషల్ సెలబ్రిటీ ప్రీమియర్ వేడుకలో టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్, కామాక్షి భాస్కర్ల, రాగ్ మయూర్, బిగ్ బాస్ తెలుగు 5 విజేత వీజే సన్నీ, కళ్యాణ్ పడాలా (బిగ్ బాస్ సీజన్ 9 విజేత), చైతన్య రావు, వెంకటేష్ కాకుమాను, కార్తీక్ రత్నం, ఆదిత్య మండల, శ్రీనాథ్ మాగంటి, జబర్దస్త్ కమెడియన్ ముక్కు అవినాష్, నిరుపమ్, కిరీటి దామరాజు, మానస్ సహా పలువురు ప్రముఖులు పాల్గొని ప్రీమియర్‌ను ఎంజాయ్ చేశారు. ప్రియదర్శి, వెన్నెల కిషోర్, జోర్దార్ సుజాత, కృష్ణ చైతన్య, దేవియాని శర్మ, అభినవ్ గోమటం, పావని గంగిరెడ్డి వంటి నటీనటుల పెర్ఫామెన్స్‌లకు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. మూడు జంటల కథతో పాటు ప్రత్యేకమైన పాత్రలో వెన్నె ల కిషోర్ నటించిన ఈ సిరీస్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. సేవ్ ది టైగర్స్ సీజన్ 3 జూన్ 19 నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది.

## దీవాన ఇంటర్వెల్ షాకింగ్ గా ఉంటుంది – హీరో హర్షిత్ రెడ్డి



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణి మేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. 'దీవాన' సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ నేపథ్యంలో హర్షిత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మా నాన్న స్వస్థలం మిర్యాలగూడ. నేను పుట్టి పెరిగింది, చదువుకున్నది అంతా హైదరాబాద్‌లోనే. సిటీ కల్చర్, ఇక్కడి లైఫ్ స్టైల్ తెలుసు. ఫస్ట్ యూట్యూబ్, ఇన్ స్టాలో వీడియోస్ చేస్తుండేవాడిని. ఆ వీడియోస్ చూసి వైజయంతీ సంస్థ నిర్మించిన మెయిల్ సినిమాకు సెలెక్ట్ చేశారు. అది కోవిడ్ టైమ్, ఆన్ లైన్‌లోనే ఆడిషన్ తీసుకున్నారు. మహబూబాబాద్‌లో ఒక బాయ్స్ హాస్టల్ తీసుకుని, అందులోనే స్టే చేస్తూ దాదాపు రెండు నెలల్లో సింగిల్ షెడ్యూల్ లో మెయిల్ మూవీ షూటింగ్ కంప్లీట్ చేశాం. ఆ సినిమాలో బికామ్ కంప్యూటర్స్ అంటూ నేను చెప్పే డైలాగ్ ఒకటి ఉంది. ఆ డైలాగ్ నచ్చి రాజ్ అండ్ డికె శుభం సినిమాకు నన్ను ఎంపిక చేశారు. ఇదంతా ఒక డెస్టినీలా జరిగిపోయింది. కల్కి సినిమాలో ఆడిషన్ లేకుండానే నన్ను డైరెక్టర్ నాగ్ అశ్విన్ సెలెక్ట్ చేశారు. నేను ఒకరోజు అడిగితే, చూడగానే పాపం అనిపించే మొహం కావాలి. నిన్ను చూస్తే అలా అనిపించి ఆడిషన్ లేకుండా తీసుకున్నాం అని చెప్పారు. నేను బీటెక్ థర్డ్ ఇయర్‌లో ఉండగా ఈ అవకాశాలు ఒక్కొక్కటిగా రావడం మొదలైంది. రెండు వెబ్ సిరీస్‌ల్లో కూడా నటించాను. శుభం సినిమా కంటే ముందే 'దీవాన' ఆఫర్ వచ్చింది. ఆహాలో నేను మెయిల్, తరగతి గది..ఇలాంటి మూవీస్ చేశాను. అలా నాకు వాసు, శ్రీదేవి పరిచయం. ఈ మూవీ స్క్రిప్ట్ విన్నప్పుడు వాళ్ల దగ్గరకు తీసుకెళ్లి డైరెక్టర్‌ను పరిచయం చేశాను. స్క్రిప్ట్ నచ్చి వాళ్లు ప్రొడ్యూస్ చేయడానికి ముందుకొచ్చారు. ప్రేమలో పూర్తిగా మునిగిన ఓ కుర్రాడి కథే 'దీవాన'. మనం చాలా ప్రేమ కథలు చూసి ఉంటాం గానీ ఇందులో ఒక కొత్త పాయింట్, ఎమోషన్ ఉంటుంది. ఆ పాయింట్‌తో వచ్చే 'ఇంటర్వెల్ మిమ్మల్ని షాక్'కు గురిచేస్తుంది. కొద్ది నిమిషాలు మీరు అలా ఉండిపోతారు. మేము ట్రైలర్, టీజర్ లో కూడా ఆ పాయింట్ ఎక్కడా రివీల్ చేయలేదు. మనం రియల్ లైఫ్ లో ఎప్పుడో ఒకసారి దీవాన అవుతాం. మా డైరెక్టర్ కూడా ప్రేమలో ఒక దీవాననే. అల్లు అరవింద్ గారికి మా మూవీ విపరీతంగా నచ్చింది. ఆయన నన్ను పిలిచి కొన్ని సీన్స్ గురించి మాట్లాడారు. ఆ సీన్స్‌లో బాగా నటించావని చెప్పారు. ఆయన ప్రశంసలు దక్కడం చాలా హ్యాపీగా ఫీలయ్యాను. మెయిల్ సినిమా తర్వాత నాకు వస్తున్న ప్రతి అవకాశాన్నీ విలువైనదిగా భావిస్తూ వస్తున్నా. ప్రతి ప్రాజెక్ట్ కు పూర్తి ఎఫర్ట్స్ పెట్టి నటిస్తున్నా. ప్రస్తుతం కల్కి 2 చిత్రంలోనూ నటిస్తున్నా. అలాగే రోమియో జూలియట్ అనే సినిమా చేస్తున్నా.

## 21న టిఎఫ్ సిసి అవార్డుల వేడుక




చిత్ర పరిశ్రమలో న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ టిఎఫ్‌సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఫెస్టివల్‌కు భారీగా ఎంట్రీలు వచ్చినట్లు ఈ హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైటర్స్ అసోసియేషన్ నుంచి రవి మాస్టర్ కూడా పాల్గొన్నారు. ఈ అవార్డుల కమిటీ జ్యూరీకి చైర్ పర్సన్‌గా నటి ఇంద్రజ వ్యవహరిస్తున్నారు. ప్రముఖ జర్నలిస్ట్ పొన్నం రవిచంద్ర జ్యూరీ మెంబర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా టిఎఫ్ సిసి చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయాలనే లక్ష్యంతో మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరుపున టిఎఫ్ సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 నిర్వహిస్తున్నాం. ఈ నెల 13వ తేదీ వరకు ఎంట్రీలను ఆహ్వానించాం. మొత్తం 55 షార్ట్ ఫిలింస్ ఎంట్రీలు వచ్చాయి. ఇందులో అన్ని రకాల జానర్స్ ఉన్నాయి. మా టిఎఫ్ సిసి మీద ఉన్న నమ్మకంతో పెద్ద సంఖ్యలో షార్ట్ ఫిలింస్ ఎంట్రీలు పంపించారు. జ్యూరీ ఛైర్ పర్సన్ గా ఇంద్రజ గారు వ్యవహరిస్తారని ఇప్పటికే ప్రకటించారు. అలాగే ప్రముఖ జర్నలిస్ట్ పొన్నం రవిచంద్ర గారిని జ్యూరీ మెంబర్‌గా తీసుకున్నాం. ఏటా ఈ కార్యక్రమం సక్సెస్ ఫుల్‌గా నిర్వహిస్తాం అన్నారు. రవి మాస్టర్ కూడా పాల్గొన్నారు.

## సబ్ కమిటీ నుంచి సురేష్ బాబు–దిల్ రాజు తప్పుకోవాలి

### నిర్మాత నట్టి కుమార్ డిమాండ్

నిర్మాతలు, పంపిణీదారులు సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సబ్ కమిటీ చైర్మన్ గా ఉన్న దగ్గుపాటి సురేష్ బాబు , నిర్మాత దిల్ రాజు ఆ పదవి నుంచి తప్పుకోవాలని నిర్మాత నట్టి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నట్టి కుమార్ మాట్లాడారు. పంపిణీదారులు కోరుకున్నట్టు పర్సంటేజ్ కు నిర్మాతలు ఒప్పుకుంటున్నారని, అయితే ఎంత పర్సంటేజ్ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది ఇంకా క్లారిటీ రాలేదని చెప్పారు. థియేటర్లు అద్దెకు తీసుకుని నడుపుతున్న వారిలో మొదటి వరుసలో సురేష్ బాబు, దిల్ రాజు ఉన్నారని అందుకే సబ్ కమిటీ నుంచి వీరిద్దరూ కూడా తప్పుకుంటే నిర్మాతలకు న్యాయం జరుగుతుందని నట్టి కుమార్ తెలిపారు. పెద్ది సినిమా నుంచి ఎవరెవరు ఎంత పర్సంటేజ్ తీసుకున్నారో అందరికి తెలుసునని అన్నారు. సురేష్ బాబు, దిల్ రాజు ఇద్దరి చేతుల్లోనే ఎక్కువగా థియేటర్లు అద్దెకు ఉన్నాయని, వీరిద్దరూ కూడా అద్దె ఓనర్లు అయినందువల్ల ఇద్దరు కూడా పంపిణీదారులు మద్దతుగా మాట్లాడుతున్నారని తెలిపారు. నిర్మాతకు, పంపిణీదారుడికి మధ్య ఉండే డిస్టిబ్యూటర్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసే విధం గా వ్యవహారం నడుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.








## తిరుగుబాటు తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయని అన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణాకే విముక్తి జరిగేది కాదని అన్నారు. గుండ్ల సింగారంలో ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని, కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడిసెవాసులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కాలనీలో కరెంట్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు గద్దం రాజనర్సు, రోంటాల శ్యామ్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, ప్రముఖ సినీ గాయకుడు ఇమ్మడి అశోక్ పాటలు, మహిళల కోలాట నృత్యం ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

**వరంగల్ లక్ష్మీ పురం భూపోరాట కేంద్రంలో ..**

భూపోరాటాలు నిర్వహించి ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. వరంగల్ లక్ష్మీపురం భూపోరాట కేంద్రంలో మంగళవారం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ సాంబమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, తోట బిక్షపతి, వల్లి ఉల్లాఖాధ్రి, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అండ

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యలను ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో పరిష్కరిస్తుందని, వారికి అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులను దశలవారీగా పూర్తిగా చెల్లించేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోందని ఆయన తెలిపారు.మంగళవారం ప్ర జాభవన్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తమ పెండింగ్ బకాయిల విడుదలపై వినతిప త్రం సమర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మా ట్లాడుతూ చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం అర్థం చేసుకుంటోందని, ఆర్థిక శాఖ తరఫున ప్రతినెలా బిల్లుల చెల్లింపులు నిరంతరాయంగా జరుగుతున్నాయని గుర్తుచేశారు. పెండింగ్ బకాయిలను పూ ర్తిగా చెల్లించడానికి దశలవారీ ప్రణాళిక అమలు చేస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. చిన్న కాంట్రాక్టర్ల ప్రయోజనా లే ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.అంతకుముందు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ల ప్రతినిధులు చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో ఆ చర్చల వివరాలను ఉపముఖ్యమంత్రికి తెలియజేశారు.

**చలో హైదరాబాద్' వాయిదా**

పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి ఇచ్చిన సానుకూల హామీతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 18న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాబడి లోటు (మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాలు సాధించగా, అసోం,బీహార్,ఛత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, మిజోరాం, తెలంగాణ రాష్ట్రాలు 2024–25 ఆర్థిక సంవత్సరంలో లోటు బడ్జెట్‌లను ఎదుర్కొన్నాయని చెప్పారు. గడచిన ఐదేళ్ళలో ద్రవ్యలోటు గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సహా 14 రాష్ట్రాలలో 2024–25లో అంతకుముందు సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు ద్రవ్యలోటు గణనీయంగా పెరిగిందని చెప్పారు.

గోవా, జార్ఖండ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, త్రిపుర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఆదాయలోటు అస్సలు ఉండకూడదని,ఈ విషయంలో శూన్యస్థానానికి వెళ్ళాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కానీ వీటిల్లో గోవా, జార్ఖండ్, త్రిపుర,ఉత్తర ప్రదేశ్ నాలుగు రాష్ట్రాలు మాత్రమే ఆ లక్ష్యాన్ని సాధించాయి. అదేసమయంలో పంజాబ్,రాజస్థాన్,తమిళనాడు రాష్ట్రాలు ఆ ఏడాదిని ఆదాయాల లోటు సంవత్సరంగా ముగించాయి. 2024–25లో ఆదాయలోటు ఎదుర్కొన్న హిమాచల్‌ప్రదేశ్,మిజోరాం,పంజాబ్,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఆర్థిక సంఘం నుండి ఆదాయలోటు గ్రాంటులను సంపాదించాయి. రాష్ట్రాల ఆర్థిక ఏకీకరణ కోసం 15వ ఆర్థిక సంఘం జిఎస్‌డిపిలో సూచించిన మూడుశాతం ఆర్థికసంవత్సరం ద్రవ్యలోటును పరిగణనలోకి తీసుకుంటే 18 రాష్ట్రాలు లక్ష్యాన్ని అధిగమించినట్లవుతుందని పేర్కొంది. కాగా 13 రాష్ట్రాల ఆదాయాల మిగులును మినహాయిస్తే, ఆదాయ లోటు ఎదుర్కొంటున్న 15 రాష్ట్రాలలో మొత్తం లోటు రూ.3,46,385 కోట్లుగా తేలింది. ఇది వాటి ఉమ్మడి జిఎస్‌డిపిలో చూసినప్పుడు 1.5 శాతంగా ఉంది. అదేవిధంగా మిగులు సాధించిన 13 రాష్ట్రాల ఆదాయాలను సర్దుబాటు చేసిన తర్వాత చూడగా, వాటి ఆదాయాల మిగులు రూ.2,19,041 కోట్లుగా తేలింది. మొత్తం 28 రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి జిఎస్‌డిపి పర్సంటేజీలో చూస్తే నికరంగా ఇది 0.68 శాతంగా ఉంది.

తాము వెలువరించిన ఈ సమాచారం రాష్ట్రాలలో ప్రభుత్వాలు విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతో ఉపయోగపడుతుందని,ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా వారికి మంచి అవగాహన తమ నివేదిక ద్వారా లభిస్తుందని భావిస్తుననట్లు సంజయ్ మూర్తి అన్నారు.ప్రభుత్వాలు,పౌరులు,విధాన రూపకర్తలు,విశ్లేషకులకు ఇది ఒక ప్రామాణిక ఆధారంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 28 రాష్ట్రాల కు సంబంధించిన రూ.40.52 లక్షలకోట్ల ఉమ్మడి ఆదాయాలలో 50 శాతం వాటా ఉన్న రాష్ట్రాలలో సొంత పన్నుల రాబడుల ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు.నాటి ఆర్థిక సంవత్సరంలో మొత్తం అన్ని రాష్ట్రాల ఉమ్మడి బడ్జెట్ వ్యయాలు రూ.51.20 లక్షల కోట్లుగా తేలిందని, ఇది మొత్తం ఉమ్మడి జిఎస్‌డిపిలో 15.78 శాతంగా ఉందని చెప్పారు. 2025 మార్చి 31వ తేదీ నాటికి మొత్తం అప్పులు, నెరవేర్చాల్సిన ఇతర బాధ్యతలు కలిపి రూ.90.51 లక్షల కోట్లుగా తేలిందని, అన్ని 28 రాష్ట్రాలను ఉమ్మడిగా చూసినప్పుడు ద్రవ్యలోటును నమోదు చేశాయని చెప్పారు.

## నిరూపిస్తే రాజీనామా చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకే అంశంపై బిఆర్‌ఎస్ నాయకులు వేర్వేరు అంకెలు చెబుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు రూ.2 వేల కోట్ల కుంభకోణమని, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రూ.3 వేల కోట్ల కుంభకోణమని ఆరోపిస్తుండగా, వారి అనుబంధ మీడియా మాత్రం రూ.200 కోట్ల వ్యవహారమని ప్రచారం చేస్తోందని తెలిపారు. 'రూ.200 కోట్లా, రూ.2,000 కోట్లా, రూ.3,000 కోట్లా.. ముందుగా బిఆర్‌ఎస్ నేతలే క్లారిటీ ఇవ్వాలన్నారు. టెండర్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరమే నిర్ణయాలు తీసుకున్నామని, ఇది పూర్తిగా పారదర్శక ప్రక్రియ అని స్పష్టం చేశారు కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని హైకోర్టు కూడా సమర్థించిందని పేర్కొన్న మంత్రి, అన్ని టెండర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించామని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన 27 రకాల వస్తువుల కొనుగోలుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు.బెడ్డింగ్ మెటీరియల్ కొనుగోళ్లలో పోటీ ప్రక్రియ ద్వారా ధరలు తగ్గించి మొత్తం రూ.70.86 కోట్ల విలువైన కొనుగోళ్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ట్రంక్ బాక్సుల ధరను రూ.1,299 నుంచి రూ.1,275కు తగ్గించి రూ.41.40 కోట్ల కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు. యూనిఫాం క్లాత్ కొనుగోళ్ల విలువ రూ.298.10 కోట్లు కాగా, టిజిఎస్‌సిఒకు రూ.57.17 కోట్ల విలువైన వస్త్ర సరఫరా బాధ్యత అప్పగించినట్లు చెప్పారు.

అధిక ధరలు వచ్చిన చోట నోట్‌బుక్, ట్రాలీ బ్యాగ్ టెండర్లను రద్దు చేశామని, స్టేషనరీ కిట్ల కొనుగోలును జిల్లా స్థాయికి అప్పగించినట్లు వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులకు అవసరమైన వస్తువులు విద్యాసంవత్సరం ప్రారంభమైన నెలల తర్వాత అందేవని విమర్శించారు.'వేల కోట్ల కుంభకోణం జరిగిందని చెబుతున్న వారు ఒక్క ఆధారమైనా చూపించాలి. తెలంగాణ ప్రజలకు కావాల్సింది ప్రచార సంఖ్యలు కాదు, స్పష్టమైన ఆధారాలు' అని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు.

## ఆత్మగౌరవ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

రవీంద్రభారతిలో 'తెలంగాణ సాంస్కృతిక సారథి' ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అవగాహన సదస్సుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులకు మంత్రి గుర్తింపుకార్డులు అందజేశారు. మొదటి కార్డును తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నరసింహకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 9వేల మంది కళాకారులకు గుర్తింపు కార్డులను దశలవారీగా అందజేస్తామని తెలిపారు. అర్హులైన కళాకారులకు కొత్తగా పింఛన్లు మంజూరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. హెల్త్‌కార్డుల మంజూరుకు కృషిచేస్తానని తెలిపారు. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ప్రజలను చైతన్యవంతం తీసుకొచ్చే దిశగా 'ప్రభుత్వ ప్రభాత భేరి' అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ రియాజ్, సారథి ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు

**తొలి గుర్తింపుకార్డు అందుకోవడం ఆనందంగా ఉన్నది**

''కళాకారుల ఏళ్ల నాటి కల నెరవేరింది. కళాకారులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులివ్వడం మంచి పరిణామం. నాకు మొదటి గుర్తింపు కార్డు ఇవ్వడం సంతోషంగా ఉన్నది. సిఎం రేవంత్‌రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి తెలంగాణ ప్రజా నాట్యమండలి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా.'' అని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నరసింహ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com